ఎన్నికల హామీని మరచిన సిఎం

- పరిష్కారం కోసం మంగళగిరి సిసిఎల్‌ఎ కార్యాలయం వద్ద విఆర్‌ఎల ధర్నా
- రూ. 15 వేలు కనీస వేతనమివ్వాలి : కె.ఉమామహేశ్వరరావు

3

PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

సిటీ◆

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 107 | విజయవాడ, మంగళవారం 19 నవంబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Tuesday 19 November 2024 | Rs

భారత్-మలేషియా స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా

8

ఉద్యోగులను విస్మరించారు

అసంఘటిత రంగాన్ని పట్టించుకోలేదు

బడ్జెట్‌పై చర్చలో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరావు

ప్రజాశక్తి-అమరావతిబ్యూరో

ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చిరుద్యోగులు, ఫింఛనర్లు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, స్కీం వర్కర్లు, అసంఘిటితరంగ కార్మికులను బడ్జెట్‌లో ప్రభుత్వం విస్మరించిందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ. వెంకటేశ్వరరావు విమర్శించారు. సోమవారం మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌కు సంబంధించి వివిధ రంగాలకు కొంత ఎక్కువ తక్కువ కేటాయింపులు మినహా గత ప్రభుత్వానికి ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య వ్యత్యాసం కనిపించడం లేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగులు, ఉపాధాయులు, పెన్షనర్లు ఎనిమిది లక్షల మంది, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు రెండు లక్షల మంది, ప్రభుత్వ స్కీంల్లో పనిచేసే వారు నాలుగు లక్షల మంది ఉన్నారని చెప్పారు. గత ప్రభుత్వం పిఆర్‌సి ఇవ్వకుండా ఉద్యోగులను చాలా మోసం చేసిందని అన్నారు. సకాలంలో డిఎలు ఇవ్వలేదని, సిఆర్‌సి రద్దు చేయలేదని తెలిపారు. ఇప్పటికి 11 పిఆర్‌సి పూర్తికాలేదని, దాని బకాయిలు చెల్లించలేదని చెప్పారు. గత మార్చి నెలలో జరిగిన జెఎసి సమావేశంలో పిఆర్‌సి, డిఎలు, పిఎఫ్‌లు, సెలవులకు సంబంధించి ఉద్యోగులకు రూ. 35 వేల కోట్లు బకాయి ఉన్నట్లు గత ప్రభుత్వమే చెప్పి ఎన్నికల్లో కొంత చెల్లించిందని, మరో రూ. 22 వేల కోట్లుపైగా ఉద్యోగులకు బకాయి చెల్లించాల్సి ఉందని వివరించారు. వీటితోపాటు 12 పిఆర్‌సి గురించిన ప్రస్తావన బడ్జెట్‌లో లేదన్నారు. గత ప్రభుత్వం సిపిఎస్‌ను జిపిఎస్‌గా మార్చిందని, ఈ ప్రభుత్వం మెరుగైన విధానం తీసుకు వస్తామని చెప్పినా బడ్జెట్‌లో దానిపై ఎటువంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీం వర్కర్లు డైలీ వేజెస్, పార్టుటైం గెస్ట్ టీచర్లు రకరకాల పద్ధతుల్లో పనిచేస్తున్న వారికి కనీస వేతనాలు అమలవ్వడం లేదని, డిఎలో లేని వారికి రెండు సంవత్సరాలకు ఒకసారి వేతనాలు పెంచాలని తెలిపారు. పది సంవత్సరాల వరకు కొన్ని కేటగిరీల్లోని ఉద్యోగుల జీతాల్లో మార్పు ఉండటం లేదని, పెరుగుతున్న ధరలను పరిగణలోకి తీసుకున్నప్పుడు జీతాలు పెరగని ఉద్యోగుల నిజ వేతనాలు తగ్గినట్లు చూడాలన్నారు. స్కీం వర్కర్లు, చిరుద్యోగులు, మిడ్ డే మీల్ కార్మికులకు నాలుగు, ఐదు నెలలు జీతాలు పెండింగ్‌లో ఉన్నాయని

మిగతా 7లో

మోసపూరిత బడ్జెట్

- సూపర్ సిక్స్ పథకాలకు సరైన కేటాయింపులు లేవు
- మండలి ప్రతిపక్ష నేత బొత్స

2

'పోలీస్' సమస్యలు పరిష్కరించండి : కె.ఎస్.లక్ష్మణరావు

రాష్ట్రంలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు రాష్ట్రప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా సోమవారం ప్రభుత్వం దృష్టికి పోలీసుల సమస్యలను తీసుకొచ్చారు. పోలీసు సిబ్బంది ఎంతో ఒత్తిడితో పనిచేస్తున్నారని తెలిపారు.కానిస్టేబుల్స్, సిబ్బంది సరెండర్ లీవ్‌లు, అడిషనల్ సరెండర్ లీవ్‌లు, ట్రాన్స్‌పోర్టు అలవెన్స్ బకాయిలు (టిఎ)లు రాక ఇబ్బందులు పడుతున్నారని, వారికి రావాల్సిన డిఎ బకాయిలు చెల్లించాలని అన్నారు.

మణిపూర్‌లో భయానక పరిస్థితి

- సిపిఎం పొలిట్‌బ్యూరో ఆందోళన
- శాంతిని నెలకొల్పేందుకు కేంద్రం నుంచి తక్షణమే గట్టి జోక్యం అవశ్యం

న్యూఢిల్లీ : మణిపూర్‌లో హింస తీవ్ర రూపం దాల్చడం పట్ల సిపిఎం ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడ శాంతిని తిరిగి నెలకొల్పేందుకు, అన్ని జాతుల హక్కులను పరిరక్షించేందుకు కేంద్ర ప్రభుత్వం తక్షణమే గట్టి జోక్యం చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని పార్టీ పొలిట్‌బ్యూరో పేర్కొంది. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన జారీ చేసింది. జాతుల ప్రాతిపదికన హత్యలు, ప్రతీకార హత్యలతో హింస పెచ్చరిల్లి ఇప్పుడక్కడ భయానక పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నెల 7 నుంచి ఇంతవరకు చోటుచేసుకున్న వివిధ ఘటనల్లో 20మంది దాకా మరణించారు. ఇంతకు ముందు జరిగిన భయానక ఘటనలో అపహరణకు గురైన ఐదుగురు మహిళలు, చిన్నారుల మృత దేహాలు లభ్యం కావడంతో లోయ హింసతో అట్టుడుకుతోందని సిపిఎం పొలిట్‌బ్యూరో పేర్కొంది.

మొదట నుండి కూడా మణిపూర్‌లో పరిస్థితులు ఇంతలా దిగజారిపోవడానికి ముఖ్యమంత్రి బీరేన్ సింగే కారణం. ఇంత జరిగినాక కూడా కేంద్ర ప్రభుత్వం గానీ, పాలక పార్టీ అయిన బిజెపి గానీ ముఖ్యమంత్రిని తొలగించడానికి తిరస్కరిస్తున్నాయి. ఆ పదవిలో ఆయననే నిక్షేపంగా కొనసాగిస్తున్నాయి దీంతో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలను, పాలనా యంత్రాంగం రాతపూర్వక ఆదేశాలను సైతం ఖాతరుచేయని పరిస్థితి ఇప్పుడక్కడ

మిగతా 7లో

తిరుమల అన్నమయ్య భవనంలో జరిగిన టిటిడి నూతన పాలకమండలి తొలి సమావేశంలో చైర్మన్ బిఆర్ నాయుడు తదితరులు

అన్యమత ఉద్యోగులకు విఆర్‌ఎస్

- ఒప్పుకోకపోతే ఇతర శాఖలకు బదిలీ
- టిటిడి పాలకమండలి తొలి సమావేశంలోనే ఆర్‌ఎస్‌ఎస్ అజెండా

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి)లో పనిచేస్తున్న అన్యమతస్తులకు విఆర్‌ఎస్ అమలు చేయాలని పాలకమండలి నిర్ణయించింది. టిటిడి నూతన పాలక మండలి తొలి సమావేశం అధ్యక్షులు బిఆర్ నాయుడు అధ్యక్షతన తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలోనే అన్యమతస్తుల అంశం చర్చకు వచ్చింది. తిరుమల తిరుపతి దేవస్థానం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఇతర శాఖల మాదిరే ఇక్కడా ఉద్యోగ నియమాకాలు జరిగాయి. రాజ్యాంగానికి అనుగుణంగా, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ దశాబ్దాల తరబడి ఉద్యోగాల్లో కొనసాగుతున్న వీరికి తాజా నిర్ణయం పిడుగుపాటు. ఈ నియామకాలను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తరచు వివాదాస్పదం చేసేవి. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమిలో బిజెపి కూడా భాగస్వామి అన్న సంగతి తెలిసిందే. దీంతో ఆర్‌ఎస్‌ఎస్ అజెండాలో భాగమైన 'టిటిడిలో అన్యమతస్తుల' అంశం పాలకమండలి తొలి సమావేశంలోనే ప్రస్తావనకు వచ్చింది. ఆర్‌ఎస్‌ఎస్ కోరుతున్నట్లుగానే అన్యమతస్తులను టిటిడి నుండి సాగనంపాలని నిర్ణయించారు. పాలకమండలి సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన ఛైర్మన్ బిఆర్ నాయుడు టిటిడిలో పనిచేస్తున్న అన్యమత ఉద్యోగులతో మాట్లాడి విఆర్‌ఎస్‌కు ఒప్పిస్తామని చెప్పారు. ఇందుకు ఒప్పుకోకపోతే వారిని ఇతర శాఖలకు బదిలీ చేయాలని ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అన్యమత ఉద్యోగులు ఎంతమంది ఉన్నదీ లెక్కలు తీస్తున్నామని చెప్పారు. సామాన్య సందర్శకులకు త్వరితగతిన శ్రీవారి దర్శనం కల్పించేలా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తీసుకురానున్నామని, దీనిని ఎలా చేయాలనే దానిపై అధ్యయనం చేస్తున్నామని తెలిపారు. శ్రీనివాస సేతు పేరును తిరిగి గరుడ వారధిగా మార్పు చేస్తున్నట్లు చెప్పారు. అలిపిరి వద్ద టూరిజం కార్పొరేషన్ ద్వారా 'దేవలోక్' ప్రాజెక్టు (ప్రస్తుతం ముంతాజ్ హోటల్ నిర్మాణమవుతున్న స్థలం)కు కేటాయించిన 20 ఎకరాల భూమిని వెనక్కి తీసుకోవాలని నిర్ణయించినట్లు చెప్పారు. తిరుమలలో రాజకీయ ప్రసంగాలు నిషేధమని, దీనిని ఉల్లంఘిస్తే కేసులు పెడతామని తెలిపారు. స్థానికులకు ప్రతి నెలా మొదటి మంగళవారం శ్రీవారి దర్శనం కల్పిస్తామన్నారు. 'శ్రీవాణి' ట్రస్టును రద్దు చేసి వేరే ట్రస్టులో విలీనం చేస్తామని తెలిపారు. నిత్యాన్నదానాన్ని మరింత మెరుగుపరిచేలా మెనూలో మరిన్ని ఆహార పదార్థాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. టిటిడిలోని 17,400 శాశ్వత ఉద్యోగులకు, 7,530 కాంట్రాక్టు ఉద్యోగులకు బ్రహ్మోత్సవ బహుమానం పది శాతం పెంచి ఇవ్వాలని నిర్ణయించినట్లు

మిగతా 7లో

బియ్యానికి నగదు బదిలీ!

- కేంద్రం గ్రీన్‌సిగ్నల్‌తో రాష్ట్రం కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉచిత బియ్యం పథకానికి కాలం చెల్లినట్టేనా? విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ ప్రశ్నకు సమాధానం అవుననే! సబ్సిడీలకు కోత పెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ వ్యూహంలో భాగంగా దీనిని కూడా నగదు బదిలీ పథకాల జాబితాలో కలిపివేయడానికి రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి అందిన అనధికార ప్రతిపాదనలకు కేంద్రం అంగీకారం తెలిపినట్లు తెలిసింది. దీంతో అధికారికంగానే ప్రతిపాదనలు పంపి, ఆమోదముద్ర పొందడానికి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఆర్థికశాఖకు చెందిన ఉన్నతాధికారులు దీనిని ధ్రువీకరించారు. ఖర్చును తగ్గించుకునే చర్యల్లో భాగంగా ఉచిత బియ్యం పథకం స్థానంలో నగదు బదిలీని ప్రవేశపెట్టాలని డైరక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్‌ఐ) రాష్ట్ర ప్రభుత్వానికి సూచించిన సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వ సహాయంతో ఈ పథకం అమలవుతుండటంతో వారు ఏమంటారోనని రాష్ట్ర ప్రభుత్వం సందేహించింది. అయితే, కేంద్ర ప్రభుత్వం సబ్సిడీల స్థానంలో నగదు బదిలీల పథకాల వైపు మొగ్గు చూపుతున్న నేపథ్యంలో డిఆర్‌ఐ సూచనను కేంద్రం దృష్టికి రాష్ట్ర అధికారులు తీసుకుపోయన వెంటనే సానుకూల స్పందన వ్యక్తమైనట్లు చెబుతున్నారు. దీంతో ఆ దిశలో పూర్తిస్థాయిలో ప్రతిపాదనలు, మార్గదర్శకాలు రూపొందించేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆర్థికశాఖకు చెందిన ఒక అధికారి తెలిపారు. రాష్ట్రంలో ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యాన్ని 1.48 కోట్ల మంది లబ్దిదారులకు అందిస్తున్నారు. దీనికోసం ఏటా 28 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సమకూర్చాల్సి వస్తోంది. దీని విలువ 13 వేల కోట్లవరకు ఉంటుందని ఒక అంచనా. ఒక్కో మెట్రిక్ టన్నుకు కేంద్రం 40,480 రూపాయలను తన సబ్సిడీ వాటాగా అందిస్తోంది. ఏటా ఆహార భద్రత చట్టం పరిధిలోని సబ్సిడీ బియ్యంకు కేంద్రం 7,488 కోట్ల రూపాయలు ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 5,427 కోట్ల రూపాయలను సమకూరుస్తోంది. ఇదిగాక నాన్ ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ బియ్యానికి సంబంధించిన పూర్తి సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం

మిగతా 7లో

కాగ్ కొత్త చీఫ్‌గా కె.సంజయ్ మూర్తి

న్యూఢిల్లీ : భారత కంప్ట్రోలర్ అండ్ జనరల్ (కాగ్) చీఫ్‌గా ఐఎఎస్ అధికారి కె.సంజయ్ మూర్తి నియమితులయ్యారు. ప్రస్తుతం కేంద్ర ఉన్నత విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న ఆయన్ను కాగ్ చీఫ్‌గా రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము నియమించారు. 1989 ఐఎఎస్ బ్యాచ్ హిమాచల్‌ప్రదేశ్ క్యాడర్‌కు చెందిన సంజయ్‌మూర్తి నియామకంపై కేంద్ర ఆర్థికశాఖకు చెందిన ఆర్థిక వ్యవహారాల విభాగం ఒక నోటిఫికేషన్ విడుదల చేసింది. 2020 నుంచి కాగ్ చీఫ్‌గా కొనసాగుతున్న గిరిశ్ చంద్ర ముర్ము పదవీ కాలం ఈ నెల 20తో ముగియనుండటంతో ఆయన స్థానంలో కె.సంజయ్ మూర్తి బాధ్యతలు చేపట్టనున్నారు.

ఎందరు పిల్లలున్నా పోటీ చేయొచ్చు

స్థానిక సంస్థల చట్ట సవరణకు శాసనసభ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా స్థానిక సంస్థల ఎన్నికల పోటీకి అర్హతను కల్పిస్తూ పంచాయతీరాజ్ (అమెండ్‌మెంట్) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు-2024కు శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ అమెండ్‌మెంట్ బిల్లులను డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ తరపున పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, మున్సిపల్ చట్టాల సవరణ బిల్లును మున్సిపల్‌శాఖ మంత్రి పొంగూరు నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1960 ప్రాంతంలో జనాభా నియంత్రణలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుటుంబ నియంత్రణ పథకాలు ప్రవేశపెట్టాయని, కుటుంబ నియంత్రణలో భాగంగా తీసుకున్న నిర్ణయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్న వారిని అనర్హులుగా చేస్తూ చట్టంలో సవరణలు చేశారన్నారు. గత మూడు దశాబ్దాల కాలంలో జనాభా నియంత్రణ కోసం తీసుకున్న చర్యలతో సంతానోత్పత్తి సామర్థ్యం రేటు బాగా తగ్గిపోయిందన్నారు. 2001లో 2.6 నుంచి 1.5 శాతానికి తగ్గిపోయిందని వారు వివరించారు. ఇదే సమయంలో వృద్ధుల జనాభా రేటు ఎక్కువగా ఉందన్నారు. మారుతున్న సామాజిక, ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా జనాభాను పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్న ఉద్దేశంతోనే చట్టంలో సవరణలు చేయాల్సి వచ్చిందన్నారు. గతంలో ఆయా చట్టాల్లో చేసిన సవరణలకు సంబంధించిన సెక్షన్లను తొలగిస్తూ ఎపి మున్సిపల్ చట్ట సవరణ, ఎపి పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదముద్ర వేసింది.

మరిన్ని బిల్లులు ...

వీటితోపాటు డాక్టర్ ఎన్‌టిఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (అమెండ్‌మెంట్ బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ (ఆంధ్ర ఏరియా) ఆయుర్వేదిక్, హోమియోపతి మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు-2024, ఆంధ్రప్రదేశ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (అమెండ్‌మెంట్) బిల్లు-2024ను వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రవేశపెట్టారు. శాసనసభలో 7 బిల్లులు ప్రవేశపెట్టగా, అందులో ఐదు పాసయ్యాయి. రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ విజ్ఞప్తి మేరకు ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ గ్రాబింగ్ (ప్రొహిబిషన్) బిల్లు-2024ను వాయిదా వేస్తున్నట్లు స్పీకరు అయ్యన్నపాత్రుడు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ కో-ఆపరేటివ్ సొసైటీస్ (అమెండ్‌మెంట్) బిల్లు-2024ను వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు సభలో ప్రవేశపెట్టారు. మెడికల్ బిల్లులను ప్రవేశపెట్టే సందర్భంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ, కుష్టు వ్యాధితో పాటు ఇతర అంశాలతో ప్రభావితమయ్యే వ్యక్తుల పట్ల వివక్షను నిర్మూలించడానికి జాతీయ మానవహక్కుల కమిషన్ - 2022 జనవరి 14న సమగ్ర సలహాను ఇచ్చిందన్నారు. కుష్టు వ్యాధితో ప్రభావిత వ్యక్తుల పట్ల వివక్షను చూపుతున్న 97 చట్టాలను నిర్ణీత కాలపరిమితితో సవరించాలని సిఫార్సులు చేసిందన్నారు.

అందులో రాష్ట్రానికి సంబంధించి కుష్టు వ్యాధితో ప్రభావితమయ్యే వ్యక్తుల పట్ల వివక్షను ముగింపు పలకడానికి నిర్ణీత కాలపరిమితితో చట్టాలను సవరించేందుకు చర్యలను ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఆర్‌సి కోరిందని సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎపి వైద్య వృత్తిదారుల రిజిస్ట్రీకరణ చట్టం-1968 ప్రధానంగా పేర్కొన్న నిబంధనల నుంచి 'చెవిటి, మూగ, కుష్టు రోగి' అనే పదాలను తొలగించడానికి ఈ చట్టాన్ని సవరించాలని సిఫార్సు చేస్తుందన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్లు

- సమస్యలపై కదంతొక్కిన ఆశాలు
- సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి : కె ధనలక్ష్మి

ప్రజాశక్తి- యంత్రాంగం

సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశా వర్కర్లు సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా కదంతొక్కారు. ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కలెక్టరేట్ల వద్ద ధర్నా చేశారు. సమ్మె ఒప్పందాల జిఒలు విడుదల చేయాలని, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, సంబంధం లేని పనులు మాతో చేయించరాదని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. భారీగా ఆశాలు తరలివచ్చారు. దీంతో, కలెక్టరేట్లు దద్దరిల్లాయి. ధర్నా అనంతరం కలెక్టర్లకు, డిఎం అండ్ హెచ్‌ఒలకు వినతిపత్రాలు అందజేశారు. విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగిన ధర్నాలో యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ పేదలకు ఆరోగ్య సేవలందిస్తున్న ఆశా వర్కర్లను ప్రభుత్వం కార్మికులుగా గుర్తించాలని, ఇతర సౌకర్యాలను కల్పించాలని కోరారు. 60 సంవత్సరాలు వయస్సు వచ్చే వరకు పనిచేయించుకొని ప్రభుత్వం రిటైర్మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించకుండానే తొలగించడం సరికాదన్నారు. 62 సంవత్సరాల రిటైర్మెంట్ జిఒ వర్తింపజేయాలని, గ్రూప్ ఇన్సూరెన్సు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్‌ను ఆశాలుగా మార్పు చేయాలని కోరారు. 2024 ఫిబ్రవరి 9న గత ప్రభుత్వంలో అధికారులతో జరిగిన చర్చల సందర్భంగా జరిగిన ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మెడికల్ లీవ్‌లు, మెటర్నటీ లీవ్‌లు, సాధారణ సెలవులు, రిటైర్మెంట్ బెనిఫిట్ కింద రూ.60 వేలు, మట్టి ఖర్చులకు రూ.20 వేలు ఇస్తామని, 62 సంవత్సరాలకు వయో పరిమితి పెంచుతామని, సహజ మరణానికి రూ.2 లక్షలు,

మిగతా 7లో

విజయవాడ ధర్నాచౌక్‌లో ధర్నా చేస్తున్న ఆశా వర్కర్లు

వృద్ధి 6.3 శాతమే..! : మోర్గాన్ స్టాన్లే

న్యూఢిల్లీ : భారత జిడిపి అంచనాలకు గ్లోబల్ బ్రోకరేజ్ సంస్థ మోర్గాన్ స్టాన్లే కోత పెట్టింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జులై నుంచి సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో దేశ వృద్ధి 6.3 శాతానికే పరిమితం కావొచ్చని 2025 ఇండియా ఎనామిక్ అవుట్ లుక్ రిపోర్ట్‌లో వెల్లడించింది. 2024-25లో జిడిపి 6.7 శాతానికి పరిమితం కావొచ్చని విశ్లేషించింది. ఇంతక్రితం 7 శాతంగా అంచనా వేసింది. ద్వితీయార్థంలో 6.7-6.8 శాతం వృద్ధి చోటు చేసుకోవచ్చని పేర్కొంది. 2026-27లోనూ జిడిపి 6.5 శాతంగా ఉండొచ్చని మోర్గాన్ స్టాన్లే గ్రూప్ రీసెర్చ్ ఇండియా చీఫ్ ఎకనామిస్ట్ ఉపాసన చచ్రా పేర్కొన్నారు. ప్రభుత్వ వ్యయాలు, వ్యవసాయ రంగంలో వృద్ధి ఉండొచ్చన్నారు. అంతర్జాతీయంగా టారిఫ్ విధానాలకు సంబంధించి అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో ఎగుమతుల వృద్ధిపై ప్రభావం ఉండొచ్చని భావిస్తున్నామన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో కీలక వృద్ధి రేటు 40 నెలల కనిష్టానికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. డిసెంబర్‌లో జరగనున్న ఆర్‌బిఐ ఎంపిసి భేటీలోనూ వడ్డీ రేట్లను తగ్గించకపోవచ్చని, టారిఫ్ విధానాల ప్రభావంతో గ్లోబల్ కమోడిటీ ధరలు పెరగొచ్చని పేర్కొన్నారు.

జి-20 సదస్సు ప్రారంభం

- డసిల్వాతో సంభాషించిన మోడీ



రియో డి జెనీరో : వాతావరణ సంక్షోభం, గాజాపై ఇజ్రాయిల్ క్రూర దాడులు, ఉక్రెయిన్ యుద్ధం అనంతంగా సాగుతున్న నేపథ్యంలో రెండు రోజుల జి 20 శిఖరాగ్ర సదస్సు సోమవారం నాడిక్కడ ప్రారంభమైంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్న ఈ రెండు యుద్ధాలతో బాటు ఆకలి, దారిద్ర్యం, అసమానతలపైనా సదస్సు దృష్టి సారించింది. ఆర్థిక, సామాజిక, పర్యావరణపరమైన సుస్థిరాభివృద్ధి, పాలనా సంస్కరణలు వంటి అంశాలు కూడా చర్చకు రానున్నాయి. ఆఫ్రికన్ యూనియన్‌ను కొత్తగా గ్రూపులోకి తీసుకున్న తర్వాత జరుగుతున్న మొదటి సదస్సు ఇది.

భారత ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పటికే ఈ సదస్సు కోసం రియో డీ జెనీరో చేరుకున్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు లూలా డ సిల్వాతో ఆయన కాసేపు ముచ్చటించారు. మూడు దేశాల పర్యటనలో భాగంగా భారత ప్రధాని నైజీరియా పర్యటన అనంతరం సోమవారం రియో చేరుకున్నారు. పలువురు ప్రపంచ నేతలతో అర్థవంతమైన చర్చలు జరిపేందుకు తాను ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నానంటూ ప్రధాని మోడీ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. జి-20 సదస్సు తరువాత ఆయన గుయానాకు బయల్దేరి వెళతారు. "ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్" అన్న మన దార్శనికతను కొనసాగించేలా జి-20 చర్చలు జరగాలని కోరుకుంటున్నానని బ్రెజిల్‌కు బయల్దేరే ముందు మోడీ పేర్కొన్నారు. మోడీ రియో చేరుకోగానే అక్కడి భారతీయులు ప్రధానికి సాంప్రదాయక పద్ధతుల్లో స్వాగతం పలికారు.

విద్యుత్ సుంకం బిల్లుకు మండలి ఆమోదం

- వ్యతిరేకించిన పిడిఎఫ్
- వైసిపి వాకౌట్

2

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- దోర్నాలలో ఇద్దరు, త్రిపురాంతకంలో మరో ఇద్దరు మృతి

నన్ను దోషిగా చూపారు

- మంత్రి కొల్లుతో ఎమ్మెల్యే వసంత వాగ్వాదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

శాసనసభలో సోమవారం మంత్రి కొల్లు రవీంద్రకు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌కు మధ్య వాగ్వాదం జరిగింది. మైలవరం నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌కు సంబంధించి తన పేరు ప్రస్తావించడాన్ని వసంతకృష్ణ ప్రసాద్ తప్పుపట్టారు. శాసనమండలిలో ఒక సభ్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానంగా అక్రమ మైనింగ్‌లో తన ప్రమేయం ఉందని మంత్రి కొల్లు రవీంద్ర చెప్పడం సరికాదన్నారు. మంత్రికి తప్పుడు సమాచారం ఇచ్చారా? మంత్రి స్వయంగా చెప్పారా? స్పష్టం చేయాలన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర తన ప్రతిష్టను దిగజార్చేలా ఇటీవల ప్రకటనలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. మంత్రి ఈ విషయంపై వివరణ ఇవ్వాలన్నారు. ఇందుకు మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. మండలిలో గ్రావెల్ తవ్వకాలపై సభ్యులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పానని వివరణ ఇచ్చారు. పోలవరం కాల్వల్లో మట్టి తవ్వకాలపై అక్రమాలు జరిగాయని వచ్చిన ఆరోపణలపై విచారణ చేయిస్తామన్నారు. తన నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయంలో అక్రమ మైనింగ్ జరుగుతుండగా తాను అప్పటి సిఎం కార్యాలయానికి సమాచారం ఇచ్చానని ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. కృష్ణప్రసాద్ దోషి అని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. 16 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తవ్వకాలు జరిగాయని, 175 మందిని బాధ్యులుగా గుర్తించామని తెలిపారు. వీరిపై చర్యలకు విజిలెన్సు విచారణ చేయిస్తామన్నారు. గన్నవరం, మైలవరం మాజీ ఎమ్మెల్యేల పేర్లు ప్రస్తావించానని కృష్ణ ప్రసాద్ పేరు చెప్పలేదని అనడంతో ఇక శాంతించాలని డిప్యూటీ స్పీకరు రఘురామ కృష్ణరాజు సూచించారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

- మండలిలో పిడిఎఫ్ వాయిదా తీర్మానం- తిరస్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని శాసనమండలి పిడిఎఫ్ ఎమ్మెల్సీలు కోరారు. ఈ అంశంపై చర్చించాలని కోరుతూ మండలి ఛైర్మన్ కె మోషేనురాజుకు ఎమ్మెల్సీలు కెఎస్ లక్ష్మణరావు, ఐ వెంకటేశ్వరరావు, స్వతంత్ర సభ్యులు పి రఘువర్మ సోమవారం వాయిదా తీర్మానం అందించారు. తమకు న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ బాధితులు రాష్ట్రవ్యాప్తంగా ఎదురుచూస్తున్నారని ఎమ్మెల్సీలు చెప్పారు. 32 లక్షల మంది డిపాజిట్‌దారులు, ఏజెంట్లు దారులు రూ.3900కోట్లు నష్టపోయారని వివరించారు. అగ్రిగోల్డ్ కంపెనీకి ఆస్తులు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం చొరవ తీసుకొని ఈ ఆస్తులను వేలం వేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన్నట్లు ఛైర్మన్ కె మోషేనురాజు చెప్పారు. ఉచిత ఇసుక విధానం, భవన నిర్మాణ కార్మికుల సమస్యలు గురించి చర్చించాలని వైసిపి సభ్యులు మొండితోక అరుణ్‌కుమార్, కె శ్రీనివాస్, పండుల రవీంద్రబాబు ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని కూడా ఛైర్మన్ తిరస్కరించారు.

రిటైర్‌మెంట్ వయోపరిమితి పెంపు పై ధ్రువీకరించని కేంద్రం

న్యూఢిల్లీ : కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయోపరిమితి 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతున్నట్లు వచ్చిన వార్తలపై కేంద్రప్రభుత్వం ఇంకా ధ్రువీకరించలేదు. ఉద్యోగ సంఘాలు కూడా దీనికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం అందలేదని చెబుతున్నాయి.

వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు దుర్మరణం

- దోర్నాలలో లారీని బైక్ ఢీకొని ఇద్దరు..
- త్రిపురాంతకంలో ఆర్‌టిసి బస్సు టిప్పర్‌ను ఢీకొని ఇద్దరు మృతి
- మృతుల్లో ఒకరు ఆశా వర్కర్

ప్రజాశక్తి - పెద్దదోర్నాల, త్రిపురాంతకం (ప్రకాశం జిల్లా)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు దుర్మరణం చెందిన ఘటనలు ప్రకాశం జిల్లా దోర్నాల, త్రిపురాంతకం ప్రాంతాల్లో సోమవారం చోటుచేసుకున్నాయి. దోర్నాలలో లారీని బైక్ ఢీకొనడంతో ఇద్దరు, త్రిపురాంతకంలో టిప్పర్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొట్టడంతో మరో ఇద్దరు దుర్మరణం చెందారు. మృతుల్లో ఆశా వర్కర్ కూడా ఉన్నారు.

పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. నందిగూడెంకు చెందిన గురవయ్య తన చిన్నమ్మ ఆశా వర్కర్ నాగమ్మ (38), కుమార్తె పల్లవి (2) కలిసి మోటార్‌సైకిల్‌పై పెద్దదోర్నాలలోని ప్రభుత్వ వైద్యశాలకు బయలుదేరారు. కొత్తూరు సమీపంలోని వెలిగొండ రెండో టన్నెల్ దగ్గరికి వచ్చేసరికి దోర్నాల వైపు వెళుతున్న లారీని క్రాస్ చేయబోయి అదుపుతప్పి లారీని ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలతో రోడ్డుకు అవతలి వైపు గురవయ్య పడిపోయారు. లారీ టైర్ కిందపడి నాగమ్మ, పల్లవి అక్కడికక్కడే మృతి చెందారు.

పల్నాడు జిల్లా, నగిరికల్‌కు చెందిన కొందరు తమ బంధువుల ఇంటిలో దినకర్మ కార్యక్రమాన్ని ముగించుకొని తిరిగి బస్సులో వస్తున్నారు. త్రిపురాంతకం మండలం కేసినేపల్లి వద్ద 544డి జాతీయ రహదారిపై బస్సు ఆగింది. బస్సు నుంచి గాలి వెంకటేశ్వర్లు (72) మూత్రవిసర్జనకు దిగి రోడ్డు దాటేందుకు ప్రయత్నించారు. అదే సమయంలో విజయవాడ నుండి కర్నూలు వైపు వెళ్తున్న బస్సు డ్రైవర్ ఆయనను తప్పించే ప్రయత్నంలో డైవర్ బస్సు పక్కకు తిప్పే క్రమంలో టిప్పర్‌ను ఢీకొట్టారు. దీంతో బస్సు నుజ్జునుజ్జయ్యింది. దీంతో బస్ డ్రైవర్ మృతి చెందారు. తీవ్రంగా గాయాలైన వెంకటేశ్వర్లు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయారు. వెంకటేశ్వర్లుతో పాటు దోపాలి బాయ్, శేషగిరిరావు, మనోహర్, వంశీ, విశాల్, హరీత్, సులేమాన్, షరీఫ్, సునీల్, నరేష్ కుమార్‌కు గాయాలయ్యాయి.

కేరళ తరహాలో రాష్ట్రంలోనూ పంచాయతీరాజ్ వ్యవస్థ పటిష్టం

- అమరావతిలో మైనార్టీల కోసం ప్రత్యేకంగా మెడికల్ కళాశాల
- డిమాండ్స్, బడ్జెట్‌పై చర్చ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

పంచాయతీరాజ్ వ్యవస్థ కేరళలో పటిష్టంగా అమలవుతోందని, అదే తరహాలో మన రాష్ట్రంలోనూ అమలు చేయాలని అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ పేర్కొన్నారు. శాసనసభలో సోమవారం డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయ వ్యవస్థలోని ఇంజినీరింగ్ సిబ్బందిని పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి శాఖకు అనుసంధానం చేయడం ద్వారా ఆయా శాఖల్లో సిబ్బంది కొరతను అధిగమించొచ్చన్నారు. ఆరోగ్యశ్రీని పటిష్టం చేయాలని, ఆరోగ్యశ్రీకి కేంద్ర ఆరోగ్య పథకం, బీమా సౌకర్యానికి అనుసంధానించడం ద్వారా ఎక్కువ మందికి ఉపయోగం ఉంటుందన్నారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ.. తమ నియోజకవర్గంలో డయాలసిస్ సెంటర్‌ను ఏర్పాటుచేయాలని, ఆర్‌టిసి బస్ డిపో, ఆస్పత్రిని 100 పడకల ఆస్పత్రిగా మార్చాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాస్పత్రులు, టీచింగ్ కాలేజీల్లో సౌకర్యాలు పెంచాలన్నారు. కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవిరెడ్డి మాట్లాడుతూ.. 2014–19 టిడిపి హయాంలో ఎస్‌సి, ఎస్‌టి లబ్ధిదారులకు ఆయా కార్పొరేషన్ల ద్వారా పవర్ ఆటోలతో పాటు పలు పరికరాలను పంపిణీ చేయగా, మిగిలిన వాటిని వైసిపి ప్రభుత్వం మూలన పడవేసిందని ఫలితంగా ఒక్క తన నియోజకవర్గంలోనే రూ.20 కోట్ల విలువైన ఆటోలు వస్తువులు పనికిరాకుండా పోయాయన్నారు. పంపిణీ చేయకుండా మూలనపడేసిన వారిపై విచారణ చేపట్టాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ.. నాయుడుపేట-పూతలపట్టు హైవేపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. తమ నియోజకవర్గంలో ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని, ఆరోగ్యశ్రీ కార్డులు తమిళనాడులోని వేలూరులోని సిఎంసిలో చెల్లుబాటు అయ్యేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. పాణ్యం ఎమ్మెల్యే గౌతు చరితారెడ్డి

మాట్లాడుతూ.. ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో పనిచేసే స్థాయిలో ఆధునిక టెక్నాలజీతో ఐటిఐ విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కేంద్రం 75 శాతం, రాష్ట్రం 25 శాతం వాటాతో కొన్ని రాష్ట్రాల్లో మోడల్ ఐటిఐ కళాశాలలు ఏర్పాటుచేస్తోందన్నారు. అదే తరహాలో ఓర్వకల్లులోనూ ఆధునిక టెక్నాలజీలో శిక్షణ ఇచ్చే కళాశాలను ఏర్పాటు చేస్తే స్థానిక యువతకు అత్యధికంగా ఉద్యోగాలిచ్చే అవకాశం ఉంటుందన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే బాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో గైనకాలజిస్టుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. పిహెచ్‌సిలో గైనకాలజిస్టులకు టార్గెట్లు పెడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఈ విషయాన్ని పున:పరిశీలించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ.. అమరావతిలో మైనార్టీల కోసం ఒక మెడికల్ కాలేజీ ఏర్పాటు చేయాలని, అమరావతిలో ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు నిధులు విడుదల చేయడంతో పాటు స్థలాన్ని కూడా కేటాయించాలని కోరారు.

జగనన్న కాలనీలపై విచారణ

- శాసనసభ్యుల డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్ల నిర్మాణం పేరుతో జరిగిన అక్రమాలపై విచారణ చేపట్టాలని శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, గణబాబు, పల్లా శ్రీనివాసరావు, గోరంట్ల బుచ్చయ్య చౌదరి డిమాండ్ చేశారు. సోమవారం ఉదయం శాసనసభ ప్రారంభమైన అనంతరం స్పీకరు అయ్యన్నపాత్రుడు తొలుత ప్రశ్నోత్తరాలకు అనుమతి ఇచ్చారు. 98 వేల ఇళ్లను నిర్మించేందుకు వైసిపి నాయకులే కాంట్రాక్టులు పొందినట్లు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ చెప్పారు. విశాఖలో ఇళ్ల నిర్మాణం ముందుకు సాగడం లేదని, ప్లాట్లను విక్రయించుకుని రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారని మరో ఎమ్మెల్యే గణబాబు తెలిపారు. రాజమండ్రిలో జగనన్న కాలనీల్లో వర్షాలు పడితే ఐదు అడుగుల నీరు నిలిచిపోతుందని, భూముల కొనుగోలులో రూ.110 కోట్లు అవినీతి జరిగిందని ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి అన్నారు. అంతకముందు 2019–24 మధ్య కాలంలో ఎన్‌టిఆర్ గృహ నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి బిల్లులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేలు వేగుళ్ల జోగేశ్వరరావు, వసంత కృష్ణప్రసాద్ కోరారు. గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి సమాధానం ఇస్తూ.. విశాఖపట్నంలో 31,274 ఇళ్లు మంజూరు చేసినట్లు, వీటిలో పూర్తయినవి 2,779, పనులు ప్రారంభించనవి 449 ఉండగా, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు.

మత్స్యకారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు, వారి వృత్తికి అవసరమైన వస్తువులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి, యనమల దివ్య కోరారు. మంత్రి అచ్చెన్నాయుడు సమాధానమిస్తూ.. కేంద్రం 4,484 ట్రాన్స్‌పాండర్లను కేటాయించిందని, వీటిలో 1,135 బోట్లకు అమర్చామన్నారు. ఐస్ బాక్సులు, వలలు, ఇంజిన్లు, సబ్సిడీపై డీజిల్, బయోడీజిల్ మత్స్యకారులకు అందించనున్నట్లు తెలిపారు. త్వరలో మత్స్యకారులకు రూ.20 వేలు భరోసాను అందజేస్తామన్నారు. కృష్ణా జిల్లా మల్లవల్లి పారిశ్రామికవాడలో అవసరమైన మౌలిక వసతులైన తాగునీరు, పోలీసు అవుట్ పోస్ట్, పరిపాలన భవనం వంటి సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కోరారు. మంత్రి టిజి భరత్ సమాధానమిస్తూ.. ఇప్పటికే అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామని, సమస్యలు ఏమైనా ఉంటే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రాష్ట్రంలో అసైన్డ్‌భూముల గురించి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల రామకృష్ణ లేవనెత్తిన అంశాలకు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సమాధాన మిస్తూ.. రాష్ట్ర వ్యాప్తంగా 2019 వరకూ 36,36,748 ఎకరాలను అసైన్‌మెంట్ పథకంలో పేదలకు పంపిణీ చేశారన్నారు. ఈ జాబితా నుంచి సుమారు 9 లక్షల ఎకరాలను తొలగించి రిజిస్ట్రేషన్‌కు గత ప్రభుత్వంలో వైసిపి నాయకులు ప్రయత్నించారని, ఈ అంశంపై విచారణ జరుగుతుందన్నారు. నంద్యాల, రాయచోటి, పుటపర్తిలో ఈ అక్రమాలు అధికంగా జరిగాయన్నారు. 6,500 గ్రామాల్లో రీ సర్వే పూర్తయ్యిందని, సర్వేలో పలు సమస్యలు ఉన్నట్లు తన దృష్టికి వచ్చిందని, పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

విజయనగరం జిల్లాలో అతిసారా వ్యాప్తిపై ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, చంద్రశేఖర్ అడిగిన ప్రశ్నకు మంత్రి సత్యకుమార్ లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. గుర్లలో అతిసారాతో నలుగురు మరణించినట్లు తెలిపారు. వ్యాధి వ్యాప్తిని నివారించే దుకు ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుందన్నారు.

ఎమ్మిగనూరు పురపాలక సంఘంలో చేపట్టిన తాగునీటి పథకం పురోగతి గురించి ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి అడిగిన ప్రశ్నకు పురపాలకశాఖ మంత్రి నారాయణ సమాధానమిస్తూ.. గతంలో 100 ఎకరాల భూమి సేకరించామని, ఈ భూముల ను తిరిగి రైతులకే ఇస్తామన్నారు. ఎడిబి బ్యాంక్ సహకారంతో గతంలో నిలిచిపోయిన ప్రాజెక్టును పన:ప్రారంభిస్తామన్నారు.

అధికారుల తీరుపై స్పీకరు ఆగ్రహం

శాసనసభకు వివిధ శాఖల అధికారులు ఇచ్చే సమాచారం సరిగ్గా లేదని సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేయడంతో స్పీకరు అయ్యన్నపాత్రుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. శాసనసభలో సోమవారం జరిగిన ప్రశ్నోత్తరాలలో మంత్రులు కొలుసు పార్థసారధి, టిజి భరత్ ఇచ్చిన సమాధానాలపై సభ్యులు వెలగపూడి రామకృష్ణబాబు, యార్లగడ్డ వెంకట్రావు స్పందిస్తూ.. అధికారులిచ్చిన సమాధానం సరిగ్గా లేదని, వాస్తవ పరిస్థితి ఇందుకు విరుద్ధంగా ఉందని పేర్కొన్నారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన సభాపతి సభకు తప్పుడు నివేదికలు ఇచ్చిన అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారధికి సూచించారు. భవిష్యత్తులో సభకు తప్పుడు సమాచారం ఇవ్వకుండా ఉండేలా చర్యలు ఉండాలని కోరారు.

విద్యుత్ సుంకం బిల్లుకు మండలి ఆమోదం

- వ్యతిరేకించిన పిడిఎఫ్
- వైసిపి వాకౌట్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆంధ్రప్రదేశ్ విద్యుత్ సుంకం (రెండో సవరణ)–2024 బిల్లుకు శాసనమండలి సోమవారం ఆమోదం తెలిపింది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రవేశపెట్టిన ఈ బిల్లును పిడిఎఫ్ పూర్తిగా వ్యతిరేకించింది. బిల్లును అడ్డుకునే బలం ఉన్న వైసిపి వాకౌట్ పేరుతో తప్పించుకుంది. 6 పైసలుగా ఉన్న విద్యుత్ సుంకాన్ని రూపాయికి పెంచుతూ ఎపి విద్యుత్ సుంకం–1939 చట్టాన్ని 2021లో అప్పటి వైసిపి ప్రభుత్వం ఈ బిల్లుకు సవరణలు తెచ్చింది. సుంకం పెంపునకు వ్యతిరేకంగా కొన్ని కంపెనీలు కోర్టును ఆశ్రయించాయి. దీంతో ఈ బిల్లు అమలుపై కోర్టు స్టే ఇచ్చింది. ఈ బిల్లుపై కోర్టుల్లో ఎలాంటి అవంతరాలు ఎదురుకాకుండా ఉండేందుకు నూతన ప్రభుత్వం సవరణలు తీసుకొచ్చింది. ఈ సవరణ బిల్లును తాము వ్యతిరేకిస్తున్నామని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం తొలిదశలో రూ.6 వేలకోట్ల ట్రూఅప్ ఛార్జీలు విధించిందని, ఇంకా రూ.11 వేలకోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సుమారు రూ.17 వేలకోట్లు ట్రూఅప్ పేరుతో భారాలు మోపనుందని చెప్పారు. వినియోగదారులపై ఇప్పటికే భారం ఉందని, ఇలాంటి సమయంలో ఈ బిల్లు అవసరమా? అని ప్రశ్నించారు. తాము ఈ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు.

శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో విద్యుత్ ఛార్జీలు పెంచబోమని, ఉన్న ఛార్జీలను తగ్గిస్తామని టిడిపి ఎన్నికల సమయంలో వాగ్దానం ఇచ్చిందని చెప్పారు. ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలకు అనుగుణంగా ప్రభుత్వాలు భరించాలని చెప్పారు. ట్రూఅప్ ఛార్జీలకు ప్రభుత్వం సబ్సిడీ కింద కేటాయింపు చేయొచ్చు కదా? అని ప్రశ్నించారు. సామాన్య ప్రజలపై మోపాల్సిన అవసరం ఏముందని నిలదీశారు. దీనిని తాము వ్యతిరేకిస్తున్నామని చెబుతూనే బిల్లుకు నిరసనగా వాకౌట్ చేస్తున్నామని చెప్పారు.

మోసపూరిత బడ్జెట్

- సూపర్ సిక్స్ పథకాలకు సరైన కేటాయింపులు లేవు
- మండలి ప్రతిపక్ష నేత బొత్స

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కూటమి ప్రభుత్వం మోసపూరిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల హామీని ఎగ్గొట్టేందుకు కూటమి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. కూటమి నేతలు ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాన్ని సభలోనూ, రోడ్డుపైనా వైసిపి నిలదీస్తుందని తెలిపారు. సోమవారం మండలిలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రి కార్పొరేషన్ల అప్పుతో కలిపి రాష్ట్రానికి రూ.6,46,535 కోట్లు ఉన్నాయని బడ్జెట్‌లో చూపారని, యనమల రామకృష్ణుడు మాత్రం రూ.10 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని సభను పక్కదారి పట్టించేందుకు ప్రయత్నించారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌ఆర్‌బిఎం నిబంధనలకు అనుగుణంగానే గత ప్రభుత్వం అప్పులు చేసిందని తెలిపారు. కూటమి ఏడు నెలల క్రితం అధికారంలోకి వచ్చినా రాష్ట్రంలో శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు సరైన చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి నేతలకు చిత్తశుద్ధి ఉంటే ఈ ఆర్థిక సంవత్సరంలో రెండు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెల్లరేషన్ కార్డుదారులున్న 1.55 కోట్ల మందికి ఒక సిలిండర్ ఉచితంగా ఇవ్వాలంటే రూ.1200 కోట్లు కేటాయించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం అరకొరగానే కేటాయించిందన్నారు. మోసపూరిత బడ్జెట్ కేటాయింపులకు నిరసనగా తాము సభ నుంచి వాకౌట్ చేస్తున్నట్లు ప్రకటించి బయటకెళ్లారు.

ఆర్థిక సంవత్సరంలో ఉచిత సిలిండర్ ఒక్కటే : మంత్రి నాదెండ్ల మనోహర్

కూటమి పాలనలో అమలవుతున్న సంక్షేమ పథకాలను చూసి వైసిపి నేతలు ఓర్వలేకపోతున్నారని పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీపై విపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన ఆరోపణలకు మండలిలో సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. 2025 మార్చి 31 వరకు ఒక సిలిండర్‌ను లబ్ధిదారులు బుక్ చేసుకోవచ్చని చెప్పారు. 2025 ఏప్రిల్ ఒకటి నుంచి లబ్ధిదారులు మూడు సిలిండర్లు బుక్ చేసుకోవచ్చని, రాబోయే బడ్జెట్‌లో ఆ మేరకు కేటాయింపులు ఉంటాయని తెలిపారు.

కాకినాడ కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షలో కూర్చొన్న 108 సిబ్బంది

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి

- రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్ల వద్ద 108 ఉద్యోగుల నిరాహార దీక్షలు
- సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మె

ప్రజాశక్తి - యంత్రాంగం

రాష్ట్ర ప్రభుత్వమే నేరుగా 108 అంబులెన్స్ వ్యవస్థను నిర్వహించాలని, తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, ఇఎంటి, పైలట్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ వైద్య ఆరోగ్య శాఖలో భర్తీ చేస్తున్న పోస్టుల్లో తమకు వెయిటేజ్ కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా 108 ఉద్యోగులు జిల్లా కలెక్టరేట్ల వద్ద నిరహార దీక్షలు చేపట్టారు. జిఒ 49 పునరుద్ధరించాలని, ప్రభుత్వ ఉద్యోగులు మాదిరిగానే ఎనిమిది గంటల పని విధానాన్ని అమలు చేయాలని నినదించారు. ఐదేళ్ల పూర్తయిన ఉద్యోగులకు స్లాబ్ విధానాన్ని అమలు చేయాలని, హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పై సమస్యలను ఈనెల 25 లోగా పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. 108 సర్వీసెస్ కాంట్రాక్టు ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం దీక్షలు చేపట్టారు.

విశాఖ జివిఎంసి గాంధీ విగ్రహం ఎదుట, అనకాపల్లి జిల్లా కలెక్టరేట్ వద్ద, అల్లూరి జిల్లా పాడేరు ఐటిడిఎ ఎదుట దీక్షలు నిర్వహించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, చిత్తూరు, ఒంగోలు, బాపట్ల, ఏలూరు, కృష్ణాజిల్లా మచిలీపట్నం జిల్లాల్లో కలెక్టరేట్ల వద్ద నిరాహార దీక్షలు చేపట్టారు. కడప, అన్నమయ్య జిల్లాల్లో తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఎస్ఐలకు వినతిపత్రం అందజేశారు.. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట పట్టణం గాంధీ పార్క్ ధర్నా చౌక్ వద్ద ధర్నా చేపట్టారు

టీచర్ ఎమ్మెల్సీకి ఆరుగురు నామినేషన్

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

పూర్వపు ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ స్థానానికి ఆరుగురు నామినేషన్లను దాఖలు చేశారని నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకట్రావు తెలిపారు. ఈ నెల 11 నుంచి 18 వరకూ పనిదినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల మధ్య నామినేషన్లు స్వీకరించామన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన బొర్రా గోపిమూర్తి, రామచంద్రాపురం మండలం ద్రాక్షారామం గ్రామానికి చెందిన గంధం నారాయణరావు మొదటి, రెండవ రోజు నామినేషన్లు దాఖలు చేయగా, చివరి రోజైన సోమవారం మరో నలుగురు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ అందజేశారు. కాకినాడ జిల్లా సామర్లకోట గ్రామానికి చెందిన నామన వెంకటలక్ష్మి, తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రికి చెందిన కవల నాగేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంకి చెందిన పులుగు దీపక్, మన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన అహ్మద్ షేక్ నామినేషన్లు దాఖలు చేశారు. వీటిని ఈ నెల 19న ఉదయం 11 గంటలకు పరిశీలించనున్నారు. 21వ తేదీ మధ్యాహ్నం మూడు గంటల వరకూ నామినేషన్ల ఉపసంహరణ, డిసెంబరు 5వ తేదీ ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల మధ్య పోలింగ్ జరగనుంది. తొమ్మిదిన కౌంటింగ్ నిర్వహించనున్నారు.

చివరి రోజు నామినేషన్ అందిస్తున్న స్వతంత్ర అభ్యర్థి

ఎన్నికల పరిశీలకునిగా కె.హర్షవర్ధన్

తూర్పు-పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకునిగా ఐఎఎస్ అధికారి కె.హర్షవర్ధన్ నియమితులయ్యారు. సోమవారం ఆయన కాకినాడ జిల్లాకు వచ్చారు. రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ సగిలి, సహాయ రిటర్నింగ్ అధికారి, కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు.

డిమాండ్స్‌పై చర్చ జరుగుతుంటే అధికారులేరి?

- పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తిన కొణతాల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బడ్జెట్ డిమాండ్స్‌పై చర్చ జరుగుతుంటే శాసనసభ ఆఫీసర్స్ గ్యాలరీలో ఒక్క అధికారి కూడా లేకపోవడం పట్ల అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. సోమవారం డిమాండ్స్, బడ్జెట్‌పై పాణ్యం ఎమ్మెల్యే గౌతు చరితారెడ్డి మాట్లాడుతున్న సమయంలో రామకృష్ణ పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతూ అధికారులు గ్యాలరీలో లేకపోవడాన్ని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇదే విషయంపై వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జోక్యం చేసుకుంటూ అధికారులు పై గ్యాలరీలో కూర్చొని నోట్ చేసుకుంటున్నారంటూ కవర్ చేసే ప్రయత్నం చేశారు. వెంటనే స్పీకరు అయ్యన్నపాత్రుడు స్పందిస్తూ.. మంత్రి గారూ ఎందుకు అలా వెనకేసుకొస్తున్నారని ప్రశ్నించారు. ప్రశ్నించిన కొద్ది సేపటికి అధికారులు వారి గ్యాలరీలోకి వచ్చారు.

టిడ్కోపై చర్చ తీరును ప్రశంసించిన స్పీకరు

టిడ్కోపై జరిగిన చర్చపై చాలామంది సభ్యులు తనకు ఫోన్ చేసి చర్చ బాగా జరిగిందని, తమకు ఆ సబ్జెక్టుపై అవగాహన వచ్చిందని తెలిపారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు వెల్లడించారు. టిడ్కోపై చర్చ జరిగిన తీరును ఆయన అభినందించారు. టిడ్కోపై చర్చ తరహాలోనే మిగిలిన నాలుగు రోజుల్లో ఒక్కోరోజు ఒక్కో సబ్జెక్టుపై చర్చించాలని, ముఖ్యంగా జగనన్న కాలనీల పేరుతో భూదోపిడీ, మైనింగ్ దోపిడీ, ఇసుక మాఫియా, వైసిపి కార్యాలయాల పేరుతో భూసేకరణ, అనుమతులు వంటి అంశాలపై చర్చ పెట్టాలని సభ్యులకు ఆయన సూచించారు.

మహిళలు, బాలికలపై నేరాలు పెరగలేదు

- ఐదు నెలల్లో 7,393 కేసులు నమోదు
- మండలిలో హోంమంత్రి అనిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై నమోదైన నేరాల్లో గణనీయమైన పెరుగుదల లేదని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. శాసనమండలి ఛైర్మన్ కె మోషేను రాజు అధ్యక్షతన మండలి సోమవారం ప్రారంభమైంది. ఇటీవల రాష్ట్రంలో మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు , దాడులు పెరుగుతున్న విషయం వాస్తవమేనా? అని వైసిపి సభ్యులు వరుదు కళ్యాణి, మొండితోక అరుణకుమార్, చంద్రగిరి ఏసురత్నం ప్రశ్నోత్తరాల సమయంలో హోంమంత్రిని అడిగారు. నేరాల్లో గణనీయమైన పెరుగుదల లేదని చెప్పిన హోంమంత్రి ఐదు నెలల్లో 7,393 కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ.. ప్రభుత్వం, పోలీసుల వైఫల్యం వల్ల రాష్ట్రంలో నేరాలు రోజురోజుకూ పెరుగుతున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ యాప్ వల్ల మహిళలు ధైర్యంగా ఉన్నారని అన్నారు. ఈ యాప్‌ను ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా అని అడిగారు. సభ్యులు కల్పలతా రెడ్డి మాట్లాడుతూ.. హత్యలు, అత్యాచారాలు తారాస్థాయికి చేరుకున్నాయని అన్నారు. ఇప్పటి వరకు ఎంతమందిని శిక్షించారో చెప్పాలని కోరారు. సభ్యులు ఏసురత్నం మాట్లాడుతూ.. దిశ యాప్ మహిళలకు రక్షణ కలిగించేందుకు ఉందన్నారు. ఈ సమయంలోనే అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హోంమంత్రి మాట్లాడుతూ.. ఇప్పటి వరకు జరిగిన నేరాల్లో 48 గంటల్లో నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని చెప్పారు. గత ప్రభుత్వంలో పోలీసులు కాపలా కాయడానికే పరిమితం తప్ప మహిళలను రక్షించలేదన్నారు. మహిళా పోలీస్ స్టేషన్ల పేరు మార్చి దిశ స్టేషన్లుగా మార్చారని చెప్పారు. దిశ చట్టం లేకుండా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి మాటాలపై వైసిపి సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో శాంతిభద్రతలు సక్రమంగా లేవని ఉప ముఖ్యమంత్రి సైతమే చెప్పారని తెలిపారు. సభ్యుల ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా రాజకీయ ఉపన్యాసం చేస్తున్నారని అన్నారు. రాజకీయ కోణంలో మంత్రి సమాధానం చెప్పారని, ఇందుకు నిరసనగా ఈ ప్రశ్నకు తాము వాకౌట్ చేస్తున్నట్లు బయటకు వెళ్లారు. పవన్‌కల్యాణ్ వ్యాఖ్యాలను మండలి ప్రతిపక్షనేత వక్రీకరిస్తున్నారని టిడిపి సభ్యులు యనమల రామకృష్ణుడు అన్నారు.

మంత్రిపై ఛైర్మన్ అసహనం

హోంమంత్రి వ్యాఖ్యలపై ఛైర్మన్ మోషేను రాజు అసహనం వ్యక్తం చేశారు. వైసిపి సభ్యులు వాకౌట్ చేస్తున్న సమయంలో దమ్ముంటే సభలో కూర్చుంటే తాను సమాధానం చెబుతానని మంత్రి అనిత అన్నారు. బాధ్యతగల మంత్రిగా ఉండి దమ్ము, ధైర్యం అంటూ మాట్లాడటం సరికాదని అనితపై ఛైర్మన్ అసహనం వ్యక్తం చేశారు. మంత్రులు, సభ్యుల ప్రశ్నకు సంబంధించిన అంశాలు మాత్రమే మాట్లాడాలని అన్నారు.

మీటర్లు బిగించే ప్రసక్తే లేదు : మంత్రి గొట్టిపాటి రవి

రైతుల వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లను బిగించే ప్రసక్తే లేదని టిడిపి సభ్యులు భూమిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. గత ప్రభుత్వం చేపట్టిన అవకతవక విధానాల వల్ల డిస్కమ్‌లపై విపరీతమైన భారం పడిందని చెప్పారు. రామ్‌గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయ పంపుసెట్లకు స్మార్ట్ మీటర్లు బిగింపు ప్రక్రియలో వేలకోట్ల కుంభకోణం జరిగిందన్నారు. దక్షిణ ప్రాంత పంపిణీ సంస్థ పరిధిలో మీటర్లు బిగించకుండానే బిగించినట్లు బిల్లులు మంజూరు చేశారని విమర్శించారు. గత ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల కారణంగా విద్యుత్ సంస్థలపై రూ.1.29 లక్షల కోట్ల భారం పడిందని మంత్రి గొట్టిపాటి అన్నారు. ప్రతియేటా విద్యుత్ వినియోగదారులు 5–6 శాతం పెరుగుతున్నా ఒక్క మెగావాట్ విద్యుత్‌ను కూడా జగన్ ప్రభుత్వం కొత్తగా ఉత్పత్తి చేయలేదన్నారు.

అభివాదం చేస్తున్న ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు

ఉక్కు ప్రయివేటీకరించలేదని మోడీ ప్రకటించాలి

- పరిరక్షణ పోరాట కమిటీ డిమాండ్

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటీకరణ చేయడం లేదని ఈ నెల 29న విశాఖ వస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ స్పష్టంగా ప్రకటించాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు జె.అయోధ్యరామ్, డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్ డిమాండ్ చేశారు. అదే క్రమంలో ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయనున్నట్టు ప్రకటించాలన్నారు. సోమవారం అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు కర్మాగారం పూర్తిస్థాయిలో ఉత్పత్తి చేయని కారణంగా ఇతర రాష్ట్రాల నుంచి స్టీల్‌ను మన రాష్ట్రానికి రప్పించి టన్నుకు రూ.నాలుగు వేల నుండి, రూ.ఐదు వేలు అదనంగా అమ్మకాలు చేస్తూ బ్లాక్ మార్కెట్‌కు పాల్పడుతున్నారని తెలిపారు. అదే విశాఖ ఉక్కు కర్మాగారం పూర్తిస్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో నడిస్తే ఇక్కడే నాణ్యమైన స్టీల్ తయారు కావడం, తక్కువ ధరకు లభించడం జరుగుతుందన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు 26 వేల ఎకరాల భూములు రాష్ట్రపతి పేరుతో ఉన్నాయని, వాటిని స్టీల్ ప్లాంట్ పేరుతో బదలయించాలని కోరారు. ప్లాంట్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ద్వంద్వ వైఖరి విడనాడాలని, కచ్చితంగా ప్రభుత్వ రంగంలోనే దీన్ని నడపాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న అప్పులపై వడ్డీని రద్దు చేయాలని, అదే సందర్భంలో అప్పులను ఐదు సంవత్సరాల పాటు వాయిదా వేయాలని కోరారు. ఉత్పత్తిలో కార్మికుల భాగస్వామ్యం ఉన్న సంగతిని విస్మరించి 35 శాతం, 50 శాతం జీతాలు కోత విధించి చెల్లిస్తుండటం దారుణమన్నారు. స్టీల్‌ప్లాంట్ కణితి రిజర్వాయర్‌కు సోలార్ ప్యానల్ యూనిట్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వాలని కోరారు. ఉక్కు పోరాటానికి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు ఉందని, ఈ నెల 24, 26 తేదీలలో పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఉద్యమాలు నిర్వహించనున్నామని తెలిపారు. సమావేశంలో వరసాల శ్రీనివాసరావు, డి.సురేష్ బాబు, జి.గణపతి రెడ్డి, బొడ్డు పైడిరాజు పాల్గొన్నారు.

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఉండవల్లి శ్రీదేవి బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఉండవల్లి శ్రీదేవి తాడేపల్లిలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా శ్రీదేవి మాట్లాడుతూ.. టిడిపి కూటమి ప్రభుత్వం దళిత సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. సిఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్‌కు పార్టీ కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. ఇచ్చిన ఈ అవకాశాన్ని బాధ్యతగా నిర్వహిస్తానని చెప్పారు. గత ప్రభుత్వంలో వెనుకబడిన తరగతులకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా జగన్‌మోహన్‌రెడ్డి మోసం చేశారని, ప్రభుత్వ సలహాదారులకు ఇచ్చిన ప్రాధాన్యత దళితులకు ఇవ్వలేదన్నారు. గత ప్రభుత్వం దళితులను చంపిన వారిని అరెస్టు చేయకుండా కాలయాపన చేసిందన్నారు.

యువ రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - కొత్తూరు

మహేష్ (ఫైల్)

అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన శ్రీకాకుళం జిల్లా కొత్తూరు మండలంలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గురండికి చెందిన రైతు ముంజేటి మహేష్ (30) తనకున్న ఐదెకరాలతో పాటు మరో ఎకరా భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. పెట్టుబడుల కోసం దాదాపు రూ.నాలుగు లక్షల వరకు అప్పులు చేశారు. ఆశించిన మేర దిగుబడులు రాక పోవడంతో అప్పులకు వడ్డీ భారం అధికమైంది. రుణదాతల ఒత్తిడి తాళలేక ఆదివారం రాత్రి పురుగు మందు తాగారు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎమ్మెల్యే తాటిపర్తికి నోటీసులు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం వైసిపి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌పై యర్రగొండపాలెం పోలీసులు ఇటీవల కేసులు నమోదు చేశారు. పోలీసులు సోమవారం ఆయన నివాసానికి వెళ్లి నోటీసులు అందజేసి సంతకాలు తీసుకున్నారు. మంత్రి లోకేష్‌పై ఎక్స్‌లో పెట్టిన పోస్ట్‌కు సంబంధించి ఒక కేసు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో నమోదు అయిన కేసులకు సంబంధించి మూడు.. మొత్తం నాలుగు కేసులు పోలీసులు నమోదు చేశారు. వివిధ సెక్షన్‌లతో కూడిన నోటీసులు అందజేశామని యర్రగొండపాలెం ఎస్సై చౌడయ్య తెలిపారు.

ఎన్నికల హామీని మరచిన సర్కారు

- పరిష్కారం కోసం మంగళగిరి సిసిఎల్ఎ కార్యాలయం వద్ద విఆర్‌ఎల ధర్నా
- రూ. 15 వేలు కనీస వేతనమివ్వాలి : కె. ఉమామహేశ్వరరావు

సిసిఎల్ఎ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న విఆర్‌ఎలు, నాయకులకు అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

నిబంధనలకు విరుద్ధంగా మోపిన నైట్ డ్యూటీలు, ఇసుక, రైస్ మిల్ డ్యూటీలను నిలిపివేయాలని, అటెండర్, వాచ్‌మెన్, రికార్డ్ అసిస్టెంట్ తదితర ఖాళీ పోస్టులను అర్హులైన విఆర్‌ఎలతో వెంటనే భర్తీ చేయాలని, పే స్కేలు జీతాలు చెల్లించాలని, నామినీలను విఆర్‌ఎలుగా గుర్తించాలన్న డిమాండ్లతో ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయం ముందు విఆర్‌ఎలు ధర్నా చేపట్టారు. ముందుగా ఆటోనగర్‌లోని గౌతమబుద్ధ రహదారిపై ప్రదర్శన చేశారు. శనివారం సాయంత్రం నుంచి రాష్ట్రవ్యాపితంగా గృహ నిర్బంధాలు, అరెస్టులు రెవెన్యూ అధికారుల వేధింపులు పెద్ద ఎత్తున కొనసాగాయి. సంఘం రాష్ట్ర అధ్యక్షులు గట్టు వెంకన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బందగి సాహెబ్, రాష్ట్ర కోశాధికారి వడ్డే బాజీ బాబు, చిత్తూరు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతోపాటు సిఐటియు గుంటూరు జిల్లా కార్యదర్శి లక్ష్మణరావుతోపాటు పెద్ద ఎత్తున్న రెవెన్యూ డివిజన్, మండల నాయకులను పోలీసులు నిర్బంధించారు. ప్రభుత్వ నిర్బంధాన్ని, అడ్డంకులను అధిగమించి మంగళగిరికి విఆర్‌ఎలు చేరుకున్నారు. ఎన్‌ఆర్‌ఐ హాస్పిటల్ నుంచి సిసిఎల్ఎ ఆఫీస్ వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గత వైఎస్ఆర్ ప్రభుత్వం విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించలేదని విమర్శించారు. గతంలో విజయవాడలో జరిగిన ధర్నాలో ఈనాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొని తాము అధికారంలోకి వస్తే వెంటనే విఆర్‌ఎల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక వారి సమస్యలను పరిష్కరించలేదని విమర్శించారు. తెలంగాణలో మాదిరి పే స్కేలు అమలు చేయాలని, టిడిపి కూటమి హామీ మేరకు రూ.15 వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యను పరిష్కరించాలని ఆందోళన చేపట్టామని, తాము ముట్టడికి పిలుపు ఇవ్వలేదని, పోలీసులు అత్యుత్సాహంతో విఆర్‌ఎలను ముందస్తు అరెస్టులు చేశారన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, తక్షణం ప్రభుత్వం జోక్యం చేసుకుని విఆర్‌ఎల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం సిసిఎల్ఎ అధికారులకు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకున్నారు. అనంతరం విడిచిపెట్టారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారని ఉమామహేశ్వరావు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు త్రినాధరావు, ఎన్ గంగాధర్ రావు, ఎస్ సాంబశివరావు, ఎం ఆంజనేయులు, షేక్ బాజీ, నవీన్, టి ఆనంద్ కుమార్, గుంటూరు జిల్లా సిఐటియు నాయకులు ఎస్ ఎస్ చెంగయ్య, ఎం బాలాజీ, నాయకులు కె. రవికుమార్, రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత కనకదాస

- బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత
- అనంతపురంలో రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్



భక్తకనకదాస విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యేలు, ఎంపిలు

తన కీర్తనల ద్వారా ప్రజల్లో చైతన్యం తెచ్చిన స్ఫూర్తిప్రదాత శ్రీ భక్త కనకదాస అని మంత్రి ఎస్.సవిత కొనియాడారు. శ్రీ భక్త కనకదాస రాష్ట్ర జయంతి ఉత్సవాలను బిసి వెల్ఫేర్ ఆధ్వర్యంలో అనంతపురంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా గుత్తి రోడ్డులో ఉన్న కనకదాస విగ్రహానికి మంత్రి సవితతో పాటు ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కెటిఆర్ కన్వెన్షన్ హాల్లో నిర్వహించిన సభలో మంత్రి మాట్లాడుతూ.. శ్రీ భక్త కనకదాస రాష్ట్ర స్థాయి జయంతోత్సవాలను ఉమ్మడి అనంతపురం జిల్లాలో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సంఘటితంగా పోరాడితే ఏదైనా సాధించగలమని చెప్పి తన కీర్తనల ద్వారా ఊరూరా తిరిగి ప్రతి ఒక్కరినీ కనకదాస చైతన్యవంతం చేశారని అన్నారు. హిందూపురం ఎంపి బికె.పార్థసారథి మాట్లాడుతూ.. భక్త కనకదాస యుగపురుషుడని, కురుబ కులానికి వన్నెతెచ్చిన మహనీయుడని పేర్కొన్నారు. ఆయన అడుగుజాడల్లో తామంతా నడిచేందుకు కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ.. సిఎం కురుబ సామాజిక తరగతికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ వారికి అండగా నిలిచారన్నారు. సవితమ్మకు మంత్రి పదవి ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, పరిటాల సునీత, అమిలినేని సురేంద్రబాబు, కురుబ కార్పొరేషన్ చైర్మన్ దేవేంద్రప్ప, రాష్ట్ర బిసి వెల్ఫేర్ ప్రిన్సిపల్ సెక్రటరీ పోలా భాస్కర్, రాష్ట్ర బిసి వెల్ఫేర్ సంచాలకులు, మేనేజింగ్ డైరెక్టర్ ఎ.మల్లికార్జున, కలెక్టర్ వినోద్ కుమార్, కురుబ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

బోరుగడ్డ అనిల్‌ను విచారించిన పోలీసులు

ప్రజాశక్తి - తుళ్లూరు (గుంటూరు జిల్లా)

బోరుగడ్డ అనిల్‌ను తుళ్లూరు పోలీసులు సోమవారం విచారించారు. రాజమండ్రి జైలు నుంచి మంగళగిరి కోర్టుకు తీసుకువచ్చిన అనంతరం మధ్యాహ్నం 12.30 గంటల సమయంలో బోరుగడ్డను తుళ్లూరు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చారు. ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ విధులకు ఆటంకం కలిగించాడన్న ఫిర్యాదుతో బోరుగడ్డపై గతంలో తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఈ కేసు విచారణలో భాగంగా తుళ్లూరు పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చారు. బోరుగడ్డను తుళ్లూరు డిఎస్‌పి మురళీకృష్ణ, సిఐలు గంగా వెంకటేశ్వర్లు, అంజయ్య విచారించారు. రెండు గంటల పాటు విచారించిన అనంతరం తిరిగి మంగళగిరి కోర్టుకు అక్కడి నుంచి రాజమండ్రి జైలుకు తరలించారు. మంగళవారం కూడా బోరుగడ్డను పోలీసులు విచారించనున్నారు.

కృష్ణారెడ్డితో వాగ్మూలం రికార్డు చేస్తున్న డిఎస్‌పి

వివేకా పిఎ కృష్ణారెడ్డి ఇంటికి పోలీసులు

- వాంగ్మూలం నమోదు చేసిన డిఎస్‌పి

ప్రజాశక్తి-పులివెందుల టౌన్

మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి పిఎ వెంకట కృష్ణారెడ్డి ఇంటికి సోమవారం పోలీసులు వెళ్లారు. పులివెందుల డిఎస్‌పి మురళీ నాయక్ సమక్షంలో ఆయన వాగ్మూలం రికార్డు చేశారు. వివేకా హత్య కేసుకు సంబంధించి తనను బెదిరిస్తున్నారని, వివేకా కుమార్తె సునీత, అల్లుడు రాజశేఖర్‌రెడ్డి, సిబిఐ అధికారి రామ్‌సింగ్‌లపై కృష్ణారెడ్డి 2022లో పులివెందుల కోర్టులో ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. దీంతో కోర్టు ఆదేశాల మేరకు గతేడాది డిసెంబర్ వారిపై పులివెందుల పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి సోమవారం డిఎస్‌పి కృష్ణారెడ్డి ఇంటికి వెళ్లి న్యాయవాదుల సమక్షంలో వాగ్మూలం రికార్డ్ చేశారు. ఈ సందర్భంగా డిఎస్‌పి మాట్లాడుతూ 643/2023 కేసుకు సంబంధించి గతంలో పనిచేసిన డిఎస్‌పిలు కోర్టు ఆదేశాల ప్రకారం నివేదికలు సమర్పించారని తెలిపారు. మళ్లీ కోర్టు కొన్ని ప్రశ్నలను లేవనెత్తడంతో వాటికి సమాచారం కోసం కృష్ణారెడ్డిని అడిగామని, సానుకూలంగా ఆయన సమాధానం చెప్పారని తెలిపారు. కార్యక్రమంలో పట్టణ సిఐ జీవన్ గంగానాథ్ బాబు, వైసిపి లీగల్ అడ్వైజర్ ఓబుల్‌రెడ్డి పాల్గొన్నారు.

డాక్టర్ మీగడ రామలింగ స్వామికి గురజాడ పురస్కారం

- 30న సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ చేతుల మీదుగా అందజేత

ప్రజాశక్తి-విజయనగరం కోట

డాక్టర్ మీగడ రామలింగ స్వామి

మహాకవి గురజాడ అప్పారావు విశిష్ట పురస్కారాన్ని ప్రముఖ రంగస్థల నటుడు, రచయిత, దర్శకుడు 28 నంది బహుమతులు పొందిన డాక్టర్ మీగడ రామ లింగస్వామి ఎంపికయ్యారు. విజయనగరం ఆనంద గజపతి కళా క్షేత్రంలో ఈ నెల 30న గురజాడ వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమంలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణ ఈ పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ మేరకు సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గురజాడ సాంస్కృతిక సమాఖ్య కార్యదర్శి కాపుగంటి ప్రకాష్ చెప్పారు. ఏటా నవంబర్ 30న గురజాడ వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించే గురజాడ సాహితీ చైతన్యోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. గురజాడ వినియోగించిన వస్తువులతో ఆ రోజు ఉదయం పాదయాత్రగా వెళ్లి గురజాడ విగ్రహానికి పూలమాలలతో నివాళులర్పిస్తామని చెప్పారు. అనంతరం ఆనంద గజపతి కళా క్షేత్రంలో పురస్కార ప్రదానం ఉంటుందన్నారు. జాతీయ స్థాయిలో నిర్వహించిన కవితల పోటీలో ఎంపిక చేసిన ఏడుగురికి గురజాడ ఉత్తమ కవితా పురస్కారంతో సత్కరిస్తామని తెలిపారు. వీరితో పాటు నవసాహితీ చెన్నయ్ గురజాడ ఉత్తమ కవితా పురస్కారాలు ఇద్దరికి అందజేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి జస్టిస్ ఎన్‌వి రమణతో పాటు, విశిష్ట అతిథిగా రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్, స్థానిక ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతి రాజు , కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ హాజరవుతారని తెలిపారు.

తిరుపతిలో ఉప్పు భూముల సర్వే పూర్తి

- 16,230 ఎకరాల గుర్తింపు
- కార్పొరేట్ల కోసం తెలుగుగంగ తరలింపు?

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సముద్ర తీర ప్రాంతం వాకాడు దగ్గర ఉప్పు భూములు

తిరుపతి జిల్లాల్లో ఉప్పు భూముల సర్వే పూర్తయ్యింది. కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లోనే దాదాపుగా రెండు నెలల క్రితం ఈ సర్వే జరిగినట్లు సమాచారం. చెన్నయ్‌లోని 'సాల్ట్ కమిషనర్' ఆధ్వర్యంలో దాదాపు 40 రోజుల పాటు సర్వే చేసి 16,239 ఎకరాల భూమి ఉన్నట్లు గుర్తించారు. చెన్నయ్‌కు సమీపంలోనే ఉండటంతో ఈ భూముల కోసం పలు కార్పొరేట్ సంస్థలు పోటీ పడుతున్నట్లు సమాచారం. వీరికి అప్పగించడం కూడా దాదాపు ఖాయమనే చెబుతున్నారు. దీంతో అధికాం యంత్రాంగం మౌలిక వసతుల కల్పనపై కూడా దృష్టి సారించినట్లు తెలిసింది. విశ్వసనీయ సమాచారం ప్రకారం తెలుగు గంగ నీటిని కార్పొరేట్ అవసరాల కోసం ఉప్పు భూములకు తరలించనున్నారు. పైప్‌లైన్ ద్వారా ఈ నీటిని తరలించడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. తిరుపతి జిల్లాలోని వాకాడు, చిట్టమూరు మండలాల్లో మాత్రమే ఈ ఉప్పు భూములు ఉన్నాయి. అయితే రెవెన్యూ యంత్రాంగం తమకేం తెలియదని చెబుతోంది. 'ఆ భూములు సాల్ట్ స్పెషల్ ల్యాండ్స్ జోన్ కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి.' అని రెండు మండలాల తహశీల్దార్లు 'ప్రజాశక్తి'కి తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఒకప్పుడు సముద్రతీర ప్రాంతం లేదు. ఎప్పుడైతే జిల్లాల విభజనలో భాగంగా తిరుపతి జిల్లాకు సముద్ర తీర ప్రాంతం కలిసొచ్చింది. చిట్టమూరు, వాకాడు, గూడూరు, సూళ్లూరుపేట, తడ మండలాల్లో సముద్రతీర ప్రాంతం ఉంది. అయితే వాకాడు, చిట్టమూరు ప్రాంతాల్లో 'ఉప్పు భూములు' అధికంగా ఉన్నాయి. ఒక్క చిట్టమూరు మండలంలోనే 18 గ్రామాల పరిధిలో 2,739 ఎకరాలు, వాకాడు మండలంలో 29 గ్రామాల పరిధిలో 13,500 ఎకరాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల్లో ఉప్పు చవడ, ఎరు, పొరంబోకు రకాల భూములు ఉన్నాయి. ఒక్క వాకాడు మండలంలోనే తూపులపాలెం బీచ్ సమీపంలో 3వేల ఎకరాల్లో 'ఉప్పు'ను పండిస్తుంటారు. 16వేల మంది రైతులు తమ భూములకు ఆనుకుని ఉన్న ఉప్పు భూముల్లోనే వర్షం వస్తే అప్పుడప్పుడు వరి సైతం పండించేవారు. అయితే ఈ భూములు ప్రత్యేకించి ఎవరి పరిధిలోనూ లేవు. ఉప్పు భూముల పరిధి ఉన్న మూడువేల ఎకరాల్లోనే సొసైటీ ఉంది. ఇలా ఖాళీగా ఉన్న 'ఉప్పు' భూములపై కార్పొరేట్ల కన్ను పడినట్లు తెలుస్తోంది.

ఇన్వెస్టర్లను ముంచిన మోడీ,షా..!

- మార్కెట్ల వరుస పతనం
- రూ.50 లక్షల కోట్లు ఫట్
- లక్షల కోట్ల ఎఫ్‌ఐఐలు వెనక్కి
- ఆగని దలాల్ స్ట్రీట్ నష్టాలు



న్యూఢిల్లీ : "మా ప్రభుత్వం మరోమారు అధికారంలోకి రానుంది. స్టాక్ మార్కెట్లు దూసుకెళ్తాయి. ఇప్పుడే షేర్లు కొనుగోళ్లు చేసుకోండి. ఆ తర్వాత ధరలు పెరిగిపోతాయి." అని లోకసభ ఎన్నికలకు ముందు బిజెపి నేత అమిత్ షా వ్యాఖ్యలు చేశారు. కానీ ఎన్నికల ఫలితాల తర్వాత కొన్ని నెలలు సానుకూలంగా ట్రేడింగ్ అయినప్పటికీ.. గడిచిన రెండు నెలలుగా అనేక ప్రతికూలాంశాలతో దలాల్ స్ట్రీట్‌లో ఫలితాలు తారుమారయ్యాయి. మోడీ, అమిత్‌షా ప్రభుత్వాన్ని నమ్మి పెట్టుబడులు పెట్టిన లక్షలాది మంది ఇన్వెస్టర్లు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. షా హామీలకు భిన్నంగా గత రెండు నెలలుగా దలాల్ స్ట్రీట్ అమాంతం పడిపోతోంది. లక్షల కోట్ల రూపాయాల ఇన్వెస్టర్ల సొమ్ము కరగిపోతోంది. అందులోనూ ముఖ్యంగా సాధారణ ఇన్వెస్టర్లు భారీ నష్టాలను ఎదుర్కొంటూ బోరుమంటున్నారు.

గడిచిన ఒక్క నెలలోనే సెన్సెక్స్, నిఫ్టీలు ఏకంగా 10 శాతం పతనమయ్యాయి. అనేక కంపెనీల స్టాక్స్ 20, 30 శాతం మేర పడిపోయాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు (ఎఫ్‌ఐఐ)లు గడిచిన ఒక్కటిన్నర నెలలోనే రూ.1.20 కోట్ల తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. చివరి సారిగా 2008 ఆర్థిక సంక్షోభ సమయంలో సెన్సెక్స్ 40 శాతం పతనమయ్యింది. ఆ సమయంలో మొత్తంగా 15 బిలియన్ల ఎఫ్‌ఐఐలు తరలిపోగా.. గడిచిన ఏడు వారాల్లోనే ఆ స్థాయిలో విదేశీ పెట్టుబడులు వెనక్కి తీసుకోవడంతో భారత మార్కెట్లలోని ప్రమాద ఘంటికలు స్పష్టమవుతున్నాయి. గడిచిన నెలన్నర రోజుల్లోనే రూ.47 లక్షల కోట్ల మదుపర్ల సంపద ఆవిరై.. బిఎస్‌ఇ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.427 లక్షల కోట్లకు పరిమితమయ్యింది. సెప్టెంబర్ 27న మార్కెట్ కాపిటలైజేషన్ రికార్డ్ స్థాయిలో రూ.474 లక్షల కోట్లుగా ఉంది. ఆ సమయంలో సెన్సెక్స్ 85,978, నిఫ్టీ 26,277 గరిష్ట స్థాయిలను తాకాయి.

దేశంలో అధిక ద్రవ్యోల్బణం, పట్టణ వినిమయం తగ్గడం, సెప్టెంబర్ త్రైమాసికంలో కార్పొరేట్ కంపెనీల రెవెన్యూలో పతనం తదితర పరిణామాలు భారత స్టాక్ మార్కెట్లను అమాంతం పడేస్తున్నాయి. అధిక ద్రవ్యోల్బణం మధ్యతరగతి ప్రజల వాస్తవ ఆదాయాన్ని దెబ్బతీస్తున్నందున పట్టణ వినియోగం మరింత బలహీనపడుతుందని నెస్లే, హెచ్‌యుఎల్, ఏషియన్ పెయింట్స్, ఇతర వినియోగదారు కంపెనీల టాప్ సిఇఒల నుండి ప్రకటనలు రావడం దేశ ఆర్థిక పరిస్థితుల బలహీనతను బయటపెట్టాయి. మరోవైపు చైనా ప్రభుత్వ వృద్ధి విధానాలు ఆకర్షణీయంగా ఉండటంతో ఎఫ్‌ఐఐలు అక్కడికి తరలిపోతున్నాయి.

ట్రంప్‌తో భంగం..

అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్ టారీఫ్‌ల పెంపు ప్రతిపాదనలు అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల సమతుల్యతకు భంగం కలిగిస్తాయని జెపి మోర్గాన్ ప్రతినిధి జహంగీర్ అజీజ్ పేర్కొన్నారు. వర్ధమాన దేశాల కరెన్సీలను బలహీనపర్చుతుందన్నారు. తద్వారా వ్యాపార విశ్వాసం దెబ్బతినునుందన్నారు. చివరిసారిగా 2018లో ట్రంప్ భారీ దిగుమతి సుంకాలను విధించినప్పుడు, చైనా వెంటనే తమ కరెన్సీని తగ్గించి, తమ ఎగుమతులను ఆసియా, లాటిన్ అమెరికన్ మార్కెట్‌లకు పెంచారని అజీజ్ గుర్తు చేశారు. చైనా ఈసారి కూడా అదే చర్యను పునరావృతం చేయవచ్చన్నారు. చైనా తన కరెన్సీ విలువను తగ్గిస్తే భారతదేశంతో పాటు ఇతర అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు కూడా అనుసరించాల్సి ఉంటుందన్నారు. ట్రంప్ ఎన్నిక ప్రకటనలోనే రూపాయి క్షీణత ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది వరకు పరిస్థితులు ఎలా మారుతాయో చూడాలన్నారు. చైనా తరహాలో భారత్ తనను తాను రక్షించుకోవడానికి ట్రంపోనోమిక్స్‌కు ప్రతిస్పందన వేగంగా ఉండాలని కొటాక్ మహీంద్రా బ్యాంక్ ఛైర్మన్ ఉదయ్ కొటాక్ అన్నారు. ఇప్పటి వరకు మోడీ పెద్ద విధాన ఆలోచనలకు ప్రయత్నించి చాలా సమయాన్ని వృధా చేశారన్నారు. అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదన్నారు.

ఏడో రోజూ నేల చూపులు..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా ఏడో రోజూ నష్టాలు చవి చూశాయి. ఐటి, ఇంధన రంగాల సూచీల్లో అమ్మకాల ఒత్తిడితో సోమవారం సెషన్‌లో సెన్సెక్స్ ఓ దశలో 600 పాయింట్లు కోల్పోగా.. ఆ తర్వాత కొంత కోలుకుని.. తుదకు 241 పాయింట్ల నష్టంతో 77,339కు పడిపోయింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 79 పాయింట్ల నష్టంతో 23,453 వద్ద ముగిసింది. సెన్సెక్స్ 30లో టిసిఎస్, ఇన్ఫోసిస్, ఎన్‌టిపిసి, హెచ్‌సిఎల్ టెక్నలాజీస్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. బిఎస్‌ఇలో 2,532 షేర్లు పతనం కాగా.. 1,525 స్టాక్స్ లాభపడగా.. మరో 123 షేర్లు యథాతథంగా నమోదయ్యాయి.

20 నుండి పాట్నాలో ఎనస్తీషియా వైద్యుల జాతీయ సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్

ఇండియన్ సొసైటీ ఆఫ్ ఎనస్తీషియాలజిస్ట్స్ 71వ జాతీయ సదస్సు ఈ నెల 20 నుండి 24వ తేదీ వరకు బీహార్ రాజధాని పాట్నాలో జరుగుతుందని ఐఎస్ఎ రాష్ట్ర అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఉప్పులేటి తారక ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20న వర్క్‌షాప్, 21న సిఎంఇ, 22 నుండి 24 వరకు కాన్ఫరెన్స్ జరుగుతాయని పేర్కొన్నారు. సదస్సుకు 4 వేల మంది ఎనస్తీషియా వైద్యులు, 200 మంది ఫ్యాకల్టీ మెంబర్లు హాజరవుతారని, ఎనస్తీషియాలో నూతన ఆవిష్కరణలపై ఈ సదస్సులో చర్చ జరుగుతుందని తెలిపారు. సదస్సుకు మన రాష్ట్రం నుండి ఐఆర్‌సిఎఫ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎస్‌సి చక్రరావు, నేషనల్ అకడమిక్ చైర్మన్ డాక్టర్ ఎంవి భీమేశ్వర్, ఐఎస్ఎ జాతీయ పూర్వ అధ్యక్షులు డాక్టర్ కామేశ్వరరావు, డాక్టర్ కుచేలాబాబు, డాక్టర్ ఠాగూర్, పూర్వ జిసి కిరణ్ కుమార్, రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సూరిశెట్టి శ్రీనివాస్, అనస్తీషియా విభాగం హెడ్ ప్రొఫెసర్ ఎస్ వినయ్ కుమార్, ఆళ్ల ప్రశాంతి తదితరులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

విధుల్లో కొనసాగించాలి

- ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి శాఖ కార్యదర్శికి విఒఎల వినతి

ప్రజాశక్తి - వీరులపాడు (ఎన్‌టిఆర్)

తమను విధుల్లో తిరిగి కొనసాగించాలని వీరులపాడు విఒఎలు కేంద్ర ప్రభుత్వ గ్రామీణ అభివృద్ధి కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విఒఎలు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్‌టిఆర్ జిల్లా వీరులపాడు మండలంలో గత పదేళ్ల నుంచి పని చేస్తున్న విఒఎలను ఎటువంటి నోటీసులూ ఇవ్వకుండా అక్రమంగా తొలగించిందన్నారు. దీనిపై కొంతమంది విఒఎలు హైకోర్టుకు వెళ్లి తమను విధుల్లో కొనసాగేలా చూడాలని విన్నవించుకున్నారని తెలిపారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విఒఎలకు విధుల్లో నుంచి తొలగించడం చట్టపరమైన నేరమని తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని కోర్టు చెప్పిందన్నారు. ఆ తీర్పును బేఖాతరు చేస్తూ సంబంధిత శాఖ అధికారి వ్యవహరించడంతో విఒఎలు న్యూఢిల్లీలోని శాఖ కార్యదర్శి లిఖితపూర్వకంగా ఫిర్యాదును అందజేసినట్లు తెలిపారు.

కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌కు సాంకేతిక లోపం

- దుగ్గిరాల స్టేషన్‌లో రెండున్నర గంటలు ఆగిపోయిన రైలు

ప్రజాశక్తి - దుగ్గిరాలు (గుంటూరు జిల్లా)

హౌరా నుండి చెన్నయ్ వెళ్తున్న 12841 కోరమండల్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు ఇంజన్‌లో తలెత్తిన సాంకేతిక కారణాల వల్ల సోమవారం దుగ్గిరాల స్టేషన్లో దాదాపు రెండు గంటల పాటు నిలిచిపోయినది. ట్రాక్ మోటార్ వీల్ లాక్ అవడంతో ఇంజన్‌కు ఉన్న ఒక జత చక్రాలకు రెండు పక్కల బ్రేకులు స్టక్ అయ్యి ఇంజన్ నిలిచిపోయింది. ఈ విషయం తెలుసుకున్న అధికారుల యంత్రాంగం విజయవాడ నుండి మరో ఇంజన్‌ను తెప్పించారు. సాంకేతిక లోపం తలెత్తిన ఇంజన్‌కు విజయవాడ నుండి వచ్చిన ఇంజనీర్లు స్టక్ అయిన చక్రాల బ్రేకులను తొలగించి ఇంజన్‌ను దుగ్గిరాల స్టేషన్‌లోని లూప్ లైన్‌లో నిలిపివేశారు. ఉదయం 10 :40 గంటలకు దుగ్గిరాల స్టేషన్‌ను దాటవలసిన ఈ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ దాదాపు రెండున్నర గంటల ఆలస్యంగా నడుస్తోందని రైల్వే అధికారులు తెలిపారు.

మరమ్మతులు చేస్తున్న రైల్వే సాంకేతిక సిబ్బంది

పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని సందర్శించిన ఎపిఇఆర్‌సి చైర్మన్

ప్రజాశక్తి - పోలవరం

విద్యుత్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎపిఇఆర్‌సి చైర్మన్, సభ్యులు

పోలవరం జల విద్యుత్ కేంద్రాన్ని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి ఇన్‌ఛార్జి చైర్మన్ ఠాకూర్ రామసింగ్ సోమవారం సందర్శించారు. ఆయన వెంట కమిషన్ సభ్యులు వి . వెంకటరామిరెడ్డి ఉన్నారు. పోలవరం ప్రాజెక్ట్ నుంచి జల విద్యుత్ కేంద్రానికి నీటిని తరలించేందుకు నిర్మిస్తున్న కాలువ, విద్యుత్ కేంద్రం సర్వీస్ బే, ఇతర నిర్మాణాలను వారు పరిశీలించారు. జల విద్యుత్ కేంద్రం పనుల పురోగతిని ఎపి జెన్‌కో హైడెల్ విభాగం డైరెక్టర్ సుజయకుమార్, మేఘా ఇంజనీరింగ్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సతీష్‌బాబు వివరించారు. ప్రాజెక్ట్ పనుల పట్ల చైర్మన్ సంతృప్తి వ్యక్తం చేశారని అధికారులు తెలిపారు. చైర్మన్ వెంట ఎపి జెన్‌కో చీఫ్ ఇంజనీర్ వై కోటేశ్వరరావు, ఎస్ఇలు రామభద్రరాజు, రవీంద్రరెడ్డి, చంద్రశేఖర్, ఇఇలు హనుమ, ప్రభాకరరావు, భీమారావు, సీతారాం తదితరులు ఉన్నారు.

మంగళగిరిలో అఘోరి హల్‌చల్

- విలేకరిపై దాడి

ప్రజాశక్తి - మంగళగిరి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా మంగళగిరిలో మహిళా అఘోరి హల్‌చల్ చేశారు. ఆమె తన కారును ఆటోనగర్‌లోని గౌతమ్ బుద్ధ రోడ్డు సమీపంలోని సర్వీసింగ్‌కు తీసుకువచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో అటుగా వెళుతున్న విలేఖరి అఘోరిని చూసి వీడియో తీయడానికి ప్రయత్నించారు. దీంతో అఘోరి ఆవేశానికి గురై విలేకరిపై దాడి చేశారు. దీంతో, రిపోర్టర్ కాలుకు దెబ్బతగిలింది. కారును అక్కడే వదిలేసి గౌతమ్‌బుద్ధ రోడ్డు మీదుగా బైపాస్ రోడ్డు వద్దకు నడుచుకుంటూ వచ్చారు. అక్కడి నుండి జనసేన రాష్ట్ర కార్యాలయం వద్ద జాతీయ రహదారిపై బైఠాయించారు. డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్‌ను కలవాలని రోడ్డుపై నానా యాగి చేశారు. దీంతో, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అఘోరిని పోలీసులు అదుపులో తీసుకునేందుకు ప్రయత్నించగా వారిపై దాడి చేసేందుకు ప్రయత్నించారు. ఎట్టకేలకు పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు.

సంపాదకీయం

మళ్లీ మణిపూర్ మంటలు

మణిపూర్‌లో మరో మారు తలెత్తిన తీవ్ర హింసాత్మక పరిస్థితులు యావత్ దేశాన్నీ కలవరపెడుతున్నాయి. ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌తో అప్పటి వరకు నివురుగప్పిన నిప్పులా ఉన్న ఘర్షణలు ఒక్కసారిగా ప్రజ్వరిల్లాయి. భద్రతా బలగాల కాల్పుల్లో పది మంది కుకీ తెగకు చెందిన వారు మరణించగా, ప్రతిగా శరణార్థి శిబిరంలో తలదాచుకుంటున్న మెయితీ తెగ కుటుంబాన్ని కుకీ మిలిటెంట్లు గత సోమవారం అపహరించారు. వారి మృతదేహాలు జిరిబమ్ ప్రాంతంలోని బరాక్ నదిలో శుక్ర, శని వారాల్లో దొరికాయి. పసి పిల్లలని కూడా చూడకుండా కుటుంబంలోని ఆరుగుర్నీ దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేశారు. దాంతో నిరసనకారుల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. శనివారం రాష్ట్ర రాజధాని ఇంఫాల్‌లో ముఖ్యమంత్రి, ముగ్గురు మంత్రులు, ఆరుగురు శాసనసభ్యుల ఇళ్లపై ఆందోళనకారులు దాడి చేసి ఫర్నీచర్‌ను తగులబెట్టారు. హింసాకాండ దరిమిలా రాజధాని ఇంఫాల్ సహా రాష్ట్రంలో చాలా చోట్ల నిరవధిక కర్ఫ్యూ విధించారు. ఇంటర్నెట్ సేవలు నిలిచిపోయాయి. రాష్ట్రంలో ఈ నవంబర్ 7 నుంచి జాతుల మధ్య చెలరేగిన దాడులు, ప్రతి దాడుల్లో 20 మంది మరణించారు. పలువురు క్షతగాత్రులయ్యారు.

జనాభాపరంగా మెజార్టీగా ఉండి, ఆర్థికంగా లాభపడుతున్న మెయితీలకు ఎస్‌టి రిజర్వేషన్ కల్పించే విషయంలో గతేడాది మేలో తలెత్తిన వివాదం నుంచి స్థానిక తెగల మధ్య అంకురించిన అల్లర్లు 18 మాసాలైనా ఆగట్లేదు. రిజర్వేషన్ డిమాండ్ వెనుక ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్ సంస్థల హస్తం ఉంది. షెడ్యూల్డు తెగల్లోని కుకీలు ఎక్కువగా క్రైస్తవులుగా ఉన్నందున సంఘ్ పరివార్ మెయితీల డిమాండ్‌ను ముందుకు తెచ్చింది. ఈ మారణహోమంలో 200 మందికిపైగా హత్యకు గురయ్యారు. సుమారు 60 వేల మంది నిరాశ్రయులయ్యారు. అమానవీయ పద్ధతుల్లో స్త్రీలు, పిల్లలపై హత్యాచారాలు, గ్యాంగ్ రేప్‌లు, పాశవిక లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయి. మహిళలను వివస్త్రలను చేసి వీధుల్లో ఊరేగించిన రాక్షసత్వం దేశాన్ని హతాశులను కావించింది. మణిపూర్ ఘోరాలను చూస్తుంటే సభ్య సమాజంలో, ప్రజాస్వామ్యంలో, భారత రాజ్యాంగం పరిధిలో ఉన్నామా అనిపిస్తుంది. దేశంలో అంతర్భాగమైన మణిపూర్ తగలబడుతుంటే కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం నీరో చక్రవర్తి వలే వ్యవహరించడం అభ్యంతరకరం. రాష్ట్రంలో పెచ్చరిల్లిన ఘాతుకాలను నిరోధించి శాంతి భద్రతలు పరిరక్షించడంలో, ప్రజలకు రక్షణ కల్పించే విషయంలో బీరేన్ సింగ్ నాయకత్వంలోని స్థానిక బిజెపి ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందింది. ఆ కారణంతోనే బీరేన్ ప్రభుత్వానికి ఎన్‌పిపి రాంరాం చెప్పింది. ముఖ్యమంత్రి బీరేన్‌ను పదవి నుంచి తొలగించాలన్న డిమాండ్ ప్రజల నుంచి, ప్రతిపక్షాల నుంచే కాదు స్వంత పార్టీ, కూటమి నుంచి వస్తున్నా ప్రధాని మోడీ, బిజెపి కేంద్ర నాయకత్వం ఆయన్నే కొనసాగించడాన్ని బట్టి మణిపూర్‌లో మంటలు ఎగదోస్తున్నది బిజెపియేనని అర్థమవుతుంది.

మణిపూర్ అకృత్యాలపై పార్లమెంటులో, బయటా ప్రధాని మోడీది మౌనమే. హింసతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో ఈ సంవత్సరన్నరలో ఒక్కసారి కూడా మోడీ పర్యటించలేదు. దేశ దేశాలు టూర్ చేస్తున్న మోడీ మణిపూర్‌కేసి ఎందుకు కన్నెత్తయినా చూడరు? సార్వత్రిక ఎన్నికల్లో ఆ సేతు హిమాచలం ఓట్ల కోసం వందలాది బహిరంగ సభలకు దేశమంతా కలియదిరిగిన ఆయన మణిపూర్‌లో ఒక్కటంటే ఒక్క సభ పెట్టలేదు. మొన్నటి ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో, ప్రస్తుత మహారాష్ట్ర, జార్ఖండ్ ఎన్నికల్లో బిజెపి గెలుపు కోసం కాలికిబలపం కట్టుకొని తిరుగుతున్న ప్రధానికి హింసతో వణుకుతున్న మణిపూర్‌కు వెళ్లి అక్కడి ప్రజలకు భరోసా కల్పించాలని ఎందుకనిపించట్లేదు? ఉన్మాదం తలెత్తిన ప్రతిసారీ హోం మంత్రి అమిత్‌షా సమీక్షలు నిర్వహిస్తున్నారే తప్ప శాంతి స్థాపన జరిగింది లేదు. ప్రస్తుత హింసాత్మక ఘటనలతోనైనా మోడీ ప్రభుత్వం బాధ్యతతో గట్టిగా జోక్యం చేసుకొని రాష్ట్రంలో శాంతి భద్రతల పునరుద్ధరణకు చిత్తశుద్ధి కనబరచాలి. రాష్ట్రంలోని అన్ని తెగల హక్కుల పరిరక్షణకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూచీ పడాలి. చర్చలతో రాజకీయ పరిష్కారం కనుగొనాలి. రాష్ట్రంలో పరిస్థితులు దిగజారడానికి కారణమైన ముఖ్యమంత్రి బీరేన్‌ను పదవి నుంచి తొలగించినప్పుడే ప్రజల్లో కేంద్ర ప్రభుత్వంపై, రాజకీయ వ్యవస్థపై నమ్మకం కుదురుతుంది. లేదంటే బిజెపి, కేంద్ర ప్రభుత్వాలే మణిపూర్ రావణకాష్టానికి బాధ్యత వహించాల్సి ఉంటుంది.

మహనీయుల మాట



ఒక విషయాన్ని ఇతరులకు సులభంగా అర్థం అయ్యేలా వివరించలేకపోవడమంటే... నీకే ఆ విషయం పూర్తిగా అర్థం కానట్లు లెక్క.

- ఆల్బర్ట్ ఐన్‌స్టీన్,
ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Albert Einstein

ప్రజాప్రభాతం

సంక్షోభంలో ఉదారవాద రాజకీయాలు

ప్రభాత్ పట్నాయక్

ప్రపంచవ్యాప్తంగా ఉదార, మధ్యేవాద రాజకీయ పార్టీలు బలహీనపడి దెబ్బతినిపోతున్నాయి. వామపక్ష శక్తులు బలంగా ఉన్నచోట్ల ఆ వామపక్షాలకు మద్దతు పెరుగుతోంది. అవి బలంగా లేనిచోట్ల పచ్చి మితవాద, ఫాసిస్టు శక్తులకు బలం పెరుగుతోంది. అమెరికన్ ఎన్నికల్లో ట్రంప్ గెలుపు ప్రస్తుతం ప్రపంచ రాజకీయాల్లో కనిపిస్తున్న ఈ ధోరణికి అనుగుణంగానే ఉంది. ఫ్రాన్స్‌లో మాక్రాన్ పార్టీ బాగా బలహీనపడింది. అప్పటికప్పుడు హడావుడిగా కూడగట్టుకుని ఏర్పడిన వామపక్ష కూటమి బలంగా ముందుకు రావడంతో అక్కడ నయా ఫాసిస్టు శక్తులు ఆధిపత్యం సాధించకుండా అడ్డుకట్ట వేయడం సాధ్యపడింది. మన పొరుగున ఉన్న శ్రీలంకలో కూడా ఇదే మాదిరిగా వామపక్ష అభ్యర్థి గణనీయంగా ఓట్లు పెంచుకుని దేశాధ్యక్ష పదవిని చేపట్టాడు. అక్కడ ఓడిపోయిన అభ్యర్థి ఉదారవాద మధ్యేవాద పార్టీకి చెందినవాడు. ఇలా ఉదారవాద, మధ్యేవాద పార్టీలు అన్ని చోట్లా దెబ్బతినిపోవడం వర్తమాన కాలంలో ఉదారవాదం ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని సూచిస్తోంది. రాజకీయ ఉదారవాదం ఆర్థిక నయా ఉదారవాదంతో గట్టిగా పెనవేసుకుని వుంది. ఆ నయా ఉదారవాద ఆర్థిక విధానాలే సంక్షోభంలో పడిపోవడంతో రాజకీయ ఉదారవాదం కూడా సంక్షోభంలో పడి దెబ్బ తినిపోతోంది.

సాంప్రదాయంగా ఉదారవాద రాజకీయ పార్టీలు పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను బలపరుస్తూ వచ్చాయి. గతంలో అమలైన ఉదారవాద ఆర్థిక విధానాలను కాని, తర్వాత అమలౌతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కాని ఇవి అమలు చేస్తూ వచ్చాయి. ఈ రెండు రకాల ఆర్థిక విధానాలూ స్వేచ్ఛా మార్కెట్‌కు పెద్ద పీట వేశాయి. మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యాన్ని కుదించడం అనేదానికి అత్యంత అధిక ప్రాధాన్యతనిచ్చాయి.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోను, ఆ తర్వాత రెండో ప్రపంచ యుద్ధ కాలంలో తలెత్తిన మహా మాంద్యం కాలంలోను ఈ ఉదారవాద ఆర్థిక విధానాల వైఫల్యం స్పష్టంగా బైటపడింది. స్వేచ్ఛా మార్కెట్ విధానాలు అప్పుడప్పుడు తాత్కాలికంగా హుషారు పుట్టించవచ్చు. కాని అంతకు మించి అవి కార్మిక వర్గాన్ని దెబ్బ తీసి, నిరుద్యోగాన్ని విపరీతంగా పెంచుతాయి. దాని ఫలితంగా పెట్టుబడిదారీ విధానం యావత్తూ ప్రమాదంలో పడి సోషలిజం బలపడడానికి దారి తీస్తుంది. ఈ వైనాన్ని కీన్స్ చాలా పద్ధతి ప్రకారం వివరించాడు. ఐతే అతడు స్వతహాగా ఉదారవాది. అందుచేత బలపడుతున్న సోషలిస్టు ప్రమాదాన్ని నివారించడం ఎలా అన్నదే ఆలోచించాడు. అందుకోసం ఒక కొత్త తరహా ఉదారవాదాన్ని అతడు ప్రతిపాదించాడు. ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వం నిత్యం జోక్యం చేసుకుంటూ స్థూల డిమాండ్‌ను పెంచే దిశగా చర్యలు తీసుకుంటూ వుండాలని, అప్పుడు ఉపాధి అవకాశాలు బాగా పెరుగుతాయని కీన్స్ సూచించాడు. ప్రభుత్వ జోక్యాన్ని అంతకంతకూ తగ్గించాలనే సాంప్రదాయ ఉదారవాదానికి కీన్స్ చెప్పింది భిన్నంగా ఉంది.

కీన్స్ సిద్ధాంతాన్ని ద్రవ్య పెట్టుబడి ఏనాడూ అంగీకరించలేదు. ఇది కీన్స్ కే అంతుబట్టలేదు. తన సిద్ధాంతాన్ని అర్థం చేసుకోలేకపోవడమే దీనికి కారణం అని అతడు భావించాడు. కాని అసలు కారణం ఇంకా లోతైనది. ప్రభుత్వం గనుక జోక్యం చేసుకోవడాన్ని ఒక విధానంగా చేపడితే అప్పుడు పెట్టుబడిదారుల ఉనికి, వారు నిర్వహించే పాత్ర క్రమంగా సమాజ ఆమోదాన్ని కోల్పోతాయని పెట్టుబడిదారులు, ముఖ్యంగా ద్రవ్య పెట్టుబడి రంగంలో ఉన్న తరగతి ఆందోళన చెందారు (ఈ తరగతి పెట్టుబడిదారులను 'పని లేని పెట్టుబడిదారులు' అని కీన్స్ అభివర్ణించాడు.). వారి భయం నేటికీ కొనసాగుతోంది.

> సాంప్రదాయంగా ఉదారవాద రాజకీయ పార్టీలు పెట్టుబడిదారీ ఆర్థిక విధానాలను బలపరుస్తూ వచ్చాయి. గతంలో అమలైన ఉదారవాద ఆర్థిక విధానాలను కాని, తర్వాత అమలౌతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాలను కాని ఇవి అమలు చేస్తూ వచ్చాయి. ఈ రెండు రకాల ఆర్థిక విధానాలూ స్వేచ్ఛా మార్కెట్‌కు పెద్ద పీట వేశాయి. మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యాన్ని కుదించడం అనేదానికి అత్యంత అధిక ప్రాధాన్యతనిచ్చాయి.

రెండో ప్రపంచ యుద్ధానంతర కాలంలో కీన్స్ విధానాలు ప్రభుత్వ విధానాలుగా అమలులోకి వచ్చాయి. ద్రవ్య పెట్టుబడి ఆ యుద్ధం వలన గణనీయంగా దెబ్బ తినడంతో కీన్సియన్ విధానాలను స్వీకరించిన సోషల్ డెమాక్రసీ బలంగా ముందుకొచ్చింది.

ఆ తర్వాత కాలంలో సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో ఆర్థికాభివృద్ధి వేగం పుంజుకుంది. ద్రవ్య పెట్టుబడి మళ్ళీ బలం పెంచుకుని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడిగా పెరిగింది. అదే సమయంలో పెట్టుబడిదారీ వ్యవస్థ మార్కెట్‌లో ప్రభుత్వ జోక్యం ఉన్నప్పటికీ మరొక తరహా సంక్షోభంలోకి జారిపోయింది. 1960, 1970 దశకాల్లో కనిపించిన ద్రవ్యోల్బణ సమస్యకు కారణం స్థూల డిమాండ్ తగినంత లేకపోవడమే. కాని సంక్షోభపు మూలాలు అంతకన్నా తీవ్రమైనవి. ఉపాధి అవకాశాలు ఎక్కువ మందికి రావడంతో పెట్టుబడిదారీ శక్తులు అదనపు విలువను ఆశించినంత మేరకు పొందలేక పోతున్నాయి. రెండోపక్క అంతకు ముందు వలసలుగా ఉన్న కాలంలో మూడవ ప్రపంచదేశాల నుండి ముడిసరుకును చౌకగా కాజేసినట్టు, వలసలు స్వాతంత్ర్యం పొందిన తర్వాత కాలంలో చౌకగా పొందగలిగే ఏర్పాటు ఏదీ లేకుండా పోయింది. ఈ పరిస్థితిని అడ్డం పెట్టుకుని అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి శక్తులు కీన్స్ విధానాలను తప్పుబట్టడం ప్రారంభించాయి. మళ్ళీ పాతకాలపు స్వేచ్ఛా మార్కెట్ విధానాలు అమలైతేనే పరిష్కారం దొరుకుతుందని ప్రచారం మొదలుబెట్టాయి. ఈ ప్రచారానికి బూర్జువా ఆర్థికవేత్తలు తమ గొంతులు కలిపారు. క్రమంగా అన్ని ప్రభుత్వాలూ నయా ఉదారవాద విధానాలనే తమ ప్రభుత్వ విధానాలుగా అమలు చేయడం మొదలైంది.

తమ దేశాల్లోకి పెట్టుబడులను ఆకర్షించడం లేదా వచ్చిన పెట్టుబడులను వెనక్కి మళ్ళకుండా నిలుపుకోవడం అనేది అన్ని ప్రభుత్వాలకూ ప్రధాన కర్తవ్యంగా మారిపోయింది. ఈ పరిస్థితిలో ఉదారవాద మధ్యేవాద పార్టీలు-వాటిలో ఎక్కువ భాగం సోషల్ డెమొక్రటిక్ పార్టీలు-కొన్ని చోట్ల వామపక్ష పార్టీలు సైతం, కీన్స్ విధానాలను పూర్తిగా విడిచిపెట్టి నయా ఉదారవాద విధానాలకే కొమ్ము కాశాయి.

ఐతే నయా ఉదారవాద విధానాలు అటు సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోని కార్మిక వర్గానికి, ఇటు మూడవ ప్రపంచ దేశాలలోని అన్ని తరగతుల కష్టజీవులకు భరించలేని కష్టాలను తెచ్చిపెట్టాయి. ఈ విధానాలు ఏ సంక్షోభంలోనూ పడక మునుపే కష్టజీవులు కష్టాల్లో పడ్డారు. ఇక అవి సంక్షోభంలో చిక్కుకున్నాక శ్రామిక ప్రజల కష్టాలు ఇబ్బడి ముబ్బడిగా పెరిగిపోయాయి. ప్రభుత్వ జోక్యంతో కీన్స్ విధానాలు అమలు జరిగిన కాలంలో సాధించిన వృద్ధిరేటు క్రమంగా నయా ఉదారవాద కాలంలో తగ్గిపోతూ వచ్చింది. 2008లో అమెరికాలో రియల్ ఎస్టేట్ బుడగ బద్దలైన దరిమిలా ఏర్పడ్డ సంక్షోభం అనంతరం ఈ వృద్ధిరేటు ఇంకా వేగంగా పడిపోతూ వచ్చింది. సంపదలోని అసమానతలు చాలా తీవ్రంగా పెరిగిపోవడంతో ప్రపంచపు స్థూల డిమాండ్ తగినంత లేకుండా పోయింది (స్వేచ్ఛా మార్కెట్‌లో ఉత్పత్తి మీద కూడా నియంత్రణ ఉండదు కనుక అది అధికోత్పత్తికి దారి తీస్తుంది. అత్యధికుల వద్ద ఉండే సంపద తరిగిపోయి కొద్ది మంది దగ్గరే కేంద్రీకృతం కావడం వలన ఈ అధికోత్పత్తి చెల్లుబాటు కాదు. అందువలన సంక్షోభం అనివార్యంగా ఏర్పడుతుంది.). అమెరికాలో రియల్ ఎస్టేట్ బుడగ పెరుగుతున్నంత కాలమూ ఈ సంక్షోభాన్ని తాత్కాలికంగా వెనక్కి నెట్టగలిగారు. ఒకసారి ఆ బుడగ బద్దలవడంతో సంక్షోభం విరుచుకు పడింది. ఈ సంక్షోభాన్ని నయా ఉదారవాద విధానాల చట్రం లోపలే పరిష్కరించడం అసాధ్యం. మళ్ళీ ఏదో ఒక బుడగను సృష్టిద్దామనుకున్నా, గతకాలపు చేదు అనుభవాలతో తలలు బొప్పికట్టిన ప్రజలు ఆ బుడగల పట్ల ఉత్సాహంగా స్పందించరు. వాస్తవానికి ద్రవ్య విధానంలో మార్పుల ద్వారా అటువంటి ఓ బుడగను సృష్టించే ప్రయత్నం జరిగింది. అదనపు డిమాండ్ ప్రజల దగ్గర లేకపోయినా, మార్కెట్ లోకి అదనపు ద్రవ్యాన్ని ఈ ద్రవ్య విధానం ద్వారా (మానెటరీ పాలసీ) పంపి లాభాలను పెంచుకునే ప్రయత్నం జరిగింది. అది మరింత ద్రవ్యోల్బణానికే దారితీసింది. సంక్షోభం మరింత ముదిరింది.

ఇటువంటి పరిస్థితుల్లో మధ్యేవాద ఉదారవాద పార్టీలు నయా ఉదారవాద విధానాలతోటే ముడివేసుకుని ఉన్న కారణంగా, అవి చేయగలిగినది ఏమీ లేకుండా పోతోంది. ప్రజల కడగండ్లను తీర్చగలిగే శక్తిని అవి కోల్పోయాయి. అందువలన ప్రజలు ఈ పార్టీలను విడిచిపెట్టి తక్కిన పార్టీల వైపు మళ్ళుతున్నారు. వాటిలో అటు మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలూ ఉన్నాయి, ఇటు వామపక్ష పార్టీలూ ఉన్నాయి. ఈ మితవాద అభివృద్ధి నిరోధక పార్టీలు కూడా ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజల కష్టాలను తొలగించగలిగే స్థితిలో లేవు. ఆ పార్టీలు కూడా నయా ఉదారవాద విధానాలను సమర్ధించేవే. ఎన్నికల సమయంలో ప్రజలను ఆకర్షించే నినాదాలను ఇవ్వగలవు. కాని అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి పని ఆ నినాదాలకు పూర్తి భిన్నంగా ఉంటుంది. అవి నయా ఉదారవాద విధానాలనే మరింత వేగంగా అమలు చేయడం ప్రారంభిస్తాయి. ఇటలీలో అధికారం చేపట్టిన మెలోనీ విధానాలు చూస్తే ఇది స్పష్టంగా కనిపిస్తుంది. ఫ్రాన్స్‌లో పచ్చి మితవాద మరైన్ లీపెన్ పార్టీ తాలూకు ప్రధానమంత్రి అభ్యర్థి ఇంకా ఎన్నికలకు ముందే అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడికి అనుకూలతను ప్రకటించేశాడు!

ఐతే ఈ మితవాద పార్టీలు ఏదో ఒక రూపంలో రాజకీయ చర్చను "బైటవాళ్ళు" వైపు తిప్పుతాయి. ఈ "బైటవాళ్ళు" ఏదో ఒక మైనారిటీ మతానికి చెందినవారైనా కావచ్చు లేదా ఏదైనా మైనారిటీ జాతికి చెందినవారు కావచ్చు లేదా బతుకు తెరువుకోసం బైట నుంచి వచ్చిన వారైనా కావచ్చు. ప్రజలు అనుభవిస్తున్న కష్టాలకు ఈ "బైటవాళ్ళే" కారణం అని ఆందోళనలు రెచ్చగొట్టి మితవాద పార్టీలు తమ ప్రాబల్యం పెంచుకోడానికి పూనుకుంటాయి. మరోవైపు ఉదారవాద మధ్యేవాద పార్టీలు అసలు ఏ సంక్షోభమూ లేనే లేదన్నట్టు ప్రవర్తిస్తాయి. ఇటువంటి సందర్భాల్లో గుత్త పెట్టుబడిదారీ శక్తులు మితవాదుల వైపు, లేదా నయా ఫాసిస్టు శక్తుల వైపు మొగ్గి వాటికి తమ మద్దతు అందిస్తాయి. రాజకీయంగా పరిస్థితులు చేజారిపోకుండా వుండాలంటే వాటి ముందున్న మార్గం అదొక్కటే. ఈ గుత్త పెట్టుబడిదారీ శక్తుల మద్దతు కోల్పోవడంతో ఉదారవాద, మధ్యేవాద పార్టీలు మరింత రాజకీయ సంక్షోభంలో పడతాయి.

పైకి చూసినప్పుడు ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఎజెండా ప్రభుత్వ జోక్యాన్ని మరింత పెంచే దిశగా ఉన్నట్టు అనిపించవచ్చు. అమెరికన్ ఆర్థిక వ్యవస్థను చైనా నుండి మాత్రమే కాక, యూరోపియన్ యూనియన్ దేశాల నుండి కూడా వచ్చిపడే దిగుమతుల తాకిడి నుండి కాపాడుతానని ట్రంప్ ప్రకటించాడు. ఇలా దేశ ఆర్థిక వ్యవస్థను కాపాడేందుకు జోక్యం చేసుకోవడం అంటే అది నయా ఉదారవాద విధానాల నుండి పక్కకు మళ్ళినట్టే కనిపిస్తుంది. కాని ట్రంప్ ఎక్కడా అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి కదలికల మీద ఆంక్షలు పెడతానని ప్రకటించలేదు. అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి స్వేచ్ఛగా ఎక్కడబడితే అక్కడికి సంచరించడమే నయా ఉదారవాద విధానాలలో అత్యంత కీలకమైన అంశం. అంతేకాదు, అమెరికా మార్కెట్‌కు దిగుమతుల నుండి రక్షణ కల్పిస్తానని ట్రంప్ కన్నా ముందే ఒబామా కాలంలోనే చెప్పారు. ఇటువంటి రక్షణ విధానం వలన అమెరికాలో దేశీయంగా ఉత్పత్తి అయ్యే సరుకుల వరకూ కొంత ఊరట లభించవచ్చు. కాని దాని వలన అమెరికాలో డిమాండ్ పెరగడం అనేది జరగదు. డిమాండ్ పెరగాలంటే ప్రభుత్వ వ్యయం పెరగాల్సిందే. అందుకోసం ద్రవ్యలోటు పెంచి రుణాలైనా తేవాలి లేదా సంపన్నుల మీద అదనంగా పన్నులైనా వేయాలి. కాని ట్రంప్ ఇప్పుడు విధిస్తున్న కార్పొరేట్ పన్నులనే మరింత తగ్గిస్తానని ప్రకటించాడు. కాబట్టి ప్రభుత్వ వ్యయాన్ని ట్రంప్ పెంచే ప్రసక్తే ఉండదు. ట్రంప్ కల్పించే రక్షణతో స్వల్పకాలం పాటు దేశీయ ఉత్పత్తులకు రక్షణ లభించడం మినహా ఇంకేమీ ఒరిగేది ఉండదు. ఆర్థిక మాంద్యంలో, సంక్షోభంలో అమెరికన్ ఆర్థిక వ్యవస్థ మరింత కూరుకుపోతుంది.

ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద మధ్యేవాద పార్టీలు దెబ్బ తినిపోవడం అనే ధోరణికి అనుగుణంగానే అమెరికాలోనూ జరిగింది. అందుచేత ట్రంప్ ఎన్నిక ఆశ్చర్యం కలిగించదు. కాని అమెరికన్ ప్రజానీకం ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఎజెండా వెనుక నయా ఉదారవాద సూత్రాలే ఉన్నాయని గుర్తించలేకపోయారు. ట్రంప్ రక్షణాత్మక చర్యలు దేశీయ పరిశ్రమల్లో కొన్ని ఉద్యోగాలు కల్పించవచ్చు. కాని అవే రక్షణాత్మక చర్యల వలన దిగుమతులు మరింత ఎక్కువ ఖరీదు అవుతాయి. దాని వలన ద్రవ్యోల్బణం తీవ్రం అవుతుంది. అది సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది.

> ప్రపంచవ్యాప్తంగా ఉదారవాద మధ్యేవాద పార్టీలు దెబ్బ తినిపోవడం అనే ధోరణికి అనుగుణంగానే అమెరికాలోనూ జరిగింది. అందుచేత ట్రంప్ ఎన్నిక ఆశ్చర్యం కలిగించదు. కాని అమెరికన్ ప్రజానీకం ట్రంప్ ప్రకటించిన ఆర్థిక ఎజెండా వెనుక నయా ఉదారవాద సూత్రాలే ఉన్నాయని గుర్తించలేకపోయారు. ట్రంప్ రక్షణాత్మక చర్యలు దేశీయ పరిశ్రమల్లో కొన్ని ఉద్యోగాలు కల్పించవచ్చు. కాని అవే రక్షణాత్మక చర్యల వలన దిగుమతులు మరింత ఎక్కువ ఖరీదు అవుతాయి. దాని వలన ద్రవ్యోల్బణం తీవ్రం అవుతుంది. అది సంక్షోభాన్ని తీవ్రతరం చేస్తుంది.

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల్లో ఈ సంక్షోభం నుండి బైట పడవేయగల ఎజెండా ఉన్నది వామపక్షాల వద్ద మాత్రమే. నయా ఉదారవాద విధానాలకు తెర దించడం ద్వారా ప్రత్యామ్నాయ విధానాలను అవి అమలు చేయగలవు. ఇప్పుడు కొనసాగుతున్న యుద్ధాలకు సైతం అవి మాత్రమే ముగింపు పలకగలవు (ఈ యుద్ధాలు తలెత్తడంలోగాని, అవి కొనసాగడంలో గాని ఉదారవాద, మధ్యేవాద పార్టీలు ప్రధాన కారణం). ఈ కర్తవ్యాన్ని నెరవేర్చడానికి వామపక్ష శక్తులు సమాయత్తం కావాలి.

(స్వేచ్ఛానుసరణ)

కవిత్వం

స్పాట్ అండ్ కోడ్స్

వాడంటే నీకు
ఎంత ప్రేమో...! మరెంత భక్తో...!
కార్పొరేట్ల కొమ్ము కాయడంలో
సరిలేరు నీకెవ్వరు...!
వాడి లాభాలకు చిల్లు పడితే చాలు
నీ చిట్టి గుండె శోషొచ్చి సొమ్మసిల్లి పోద్ది.
కష్టజీవికి కన్నూ కాలూ ఏది పోయినా...
వుండదు ఇబ్బంది ఎంతమాత్రం
పరిశ్రమాధిపతుల కడుపులో
చల్ల కదలకుండాల. వాళ్ళ
లాభాలకు గ్యారంటీ మస్తుగుండాల
కార్మికుడి బతుకు సంకనాకిపోయినా...
రెక్కల కష్టం గెద్దలెత్తుకు పోతున్నా...
కరగదు నీ గుండె, పెగలదు నీ గొంతు
వాడి రక్షణకేమో స్పాట్ అండ్ కోడ్స్
మరి నాకో...! కల్లబొల్లి కబుర్లు
సొల్లు పురాణాలు. కానీ...!
ఒక్క మాట గుర్తుపెట్టుకో...!
నిప్పును గుప్పెట బంధించలేవు.
బడబాగ్నిని అరచేతితో ఆపలేవు.
కాలం బండలా పడి వుండిపోదు.
కడలిలా చలిస్తుంది, జ్వలిస్తుంది
దేనికైనా కలిసి రావాలి కాలం.
అప్పటి వరకు కొనసాగుతుంది
శ్రమ జీవుల సమైక్య సమరం
చినికి చినికి గాలివాన ఐనట్టు
చిరు పోరాటాలు ఉప్పెనలా
విరుచుకు పడకమానవు
నెత్తికెక్కిన అధికార మధాన్ని
నేల మట్టం చేయకా...! మానవు.

(పారిశ్రామిక ప్రాంతాల్లో స్పాట్ ఏర్పాటుకు నిరసనగా)
- వి. రాజగోపాల్, విజయనగరం

సమస్య

వన్యప్రాణుల అక్రమ రవాణా అడ్డుకుందాం

ఫిరోజ్ ఖాన్

హైదరాబాద్ కేంద్రంగా అంతర్జాతీయ స్థాయిలో వన్యప్రాణుల వ్యాపారం చేస్తున్న ముఠా గుట్టును పోలీసులు ఇటీవల రట్టు చేశారు. నల్లమల నుంచి అలుగును తీసుకువచ్చి తరలిస్తుండగా అచ్చంపేట మండలం హాజీపూర్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఇలా వన్యప్రాణులను అక్రమ రవాణా చేస్తున్న ఘటనలు తెలుగు రాష్ట్రాలలో, దేశంలో ప్రతి రోజూ ఏదో ఒక చోట వెలుగు చూస్తూనే ఉన్నాయి. వీటిని పూర్తి స్థాయిలో అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి.

అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్

వన్యప్రాణులకు అంతర్జాతీయ స్థాయిలో డిమాండ్ ఉండడంతో అక్రమార్కులు ముఠాలుగా ఏర్పడి.. వివిధ మార్గాల్లో వాటిని సరిహద్దులు దాటిస్తున్నారు. ఒక్కో అలుగుకు రూ. 80 లక్షల నుంచి రూ. కోటి వరకు విదేశాల్లో ధర పలుకుతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. అలుగును ఇతర దేశాల్లో ఔషధ ప్రయోజనాల కోసం, ఆభరణాలు, బుల్లెట్ ప్రూఫ్ జాకెట్లు, వాలెట్ల తయారీకి ఉపయోగిస్తారని తెలుస్తున్నది. ప్రధానంగా వివిధ వన్యప్రాణులను ఆఫ్రికా నుంచి ఆగ్నేయాసియాకు, ఆ పై భారత్, చైనాలకు రవాణా చేయడానికి ముఠాలు ఎయిర్ కార్గో మార్గాన్ని ఎంచుకుంటున్నాయి. ఆఫ్రికా నుంచి ఆగ్నేయాసియా వయా బంగ్లాదేశ్ మీదుగా వాయు మార్గం, థాయ్‌లాండ్, మయన్మార్ భూ సరిహద్దుల ద్వారా మలేషియా, ఇండోనేషియా నుంచి చైనాలకు పాములు, తాబేళ్లు, ఇగువానా వంటి సరీసృపాలను అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా హులాక్ గిబ్బన్, అరుదైన తాబేళ్లు, బల్లులు, బీవర్లు, మూర్ మక్వాక్స్, డ్వార్ఫ్ ముంగిసలు, పిగ్మీ మార్మోసెట్లు, డస్కీ లీఫ్ మంకీస్, బాల్ కొండచిలువలతో సహా 50 పైగా జాతులను వాయు, భూ మార్గాల ద్వారా మలేషియా నుంచి థాయ్‌లాండ్, అక్కడి నుంచి భారత్‌కు తీసుకొస్తున్నట్లు గుర్తించారు. ప్రపంచ కస్టమ్స్ ఆర్గనైజేషన్ ప్రకారం 2022లో కస్టమ్స్ తనిఖీల్లో 3,428 వన్యప్రాణులను స్వాధీనం చేసుకోగా, 2021లో ఈ సంఖ్య 3,316గా ఉంది. అంతేకాకుండా వేలాదిగా ఏనుగు దంతాలను సైతం పట్టుకున్నారు. వన్యప్రాణుల అక్రమ రవాణా చేసే ఘటనలు ప్రతి యేటా పెరుగుతున్నాయని ప్రపంచ కస్టమ్స్ ఆర్గనైజేషన్ అక్రమ వాణిజ్య నివేదిక-2022 పేర్కొన్నది. 2020 గణాంకాలతో పోలిస్తే 2022లో ఇలా పట్టుబడిన కేసులు 10 శాతం అధికం కాగా, 2021తో పోలిస్తే 56 శాతం అధికమని వెల్లడించింది.

ఆన్‌లైన్‌లో విక్రయాలు

ఆన్‌లైన్‌లో వన్యప్రాణుల వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై గతంలో వచ్చిన ఫిర్యాదు మేరకు మన రాష్ట్ర అధికారులు వారిని అరెస్ట్ చేశారు. మరోవైపు ఏనుగు దంతాలను పొడిగా, ఖడ్గ మృగాల కొమ్ములను పేస్ట్‌గా మార్చి, పాములను ఆలూ చిప్స్ డబ్బాల్లో కొరియర్ల ద్వారా కూడా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. 2023-24లో వివిధ జాతుల బల్లులు, సరీసృపాలను సాక్స్‌లో ఉంచి, ప్లాస్మిక్ బొమ్మల్లో కప్పేసి పోస్టాఫీసుల ద్వారా రవాణా చేసేందుకు ప్రయత్నించగా, ఆస్ట్రేలియాలో అధికారులు గుర్తించి అడ్డుకున్నారు. పోస్టు, కొరియర్ ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణా 2021-2022 మధ్య 17 శాతం పెరిగినట్లు గుర్తించారు.

సంయుక్త ప్రణాళిక

వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టడానికి భారత్, బంగ్లాదేశ్, థాయ్‌లాండ్, మలేషియా, ఇండోనేషియా సంయుక్త ప్రణాళికను సిద్ధం చేసుకున్నాయి. తమ అధికార పరిధిలోని స్మగ్లింగ్ ముఠాలకు సంబంధించిన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడంతోపాటు వారి ఆర్థిక మూలాలను విచ్ఛిన్నం చేసే చర్యలు చేపట్టాలని నిర్ణయించాయి. ఇందులో భాగంగా సీబీఐతోపాటు వైల్డ్‌లైఫ్ క్రైం కంట్రోల్ బ్యూరో, డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులతో కూడిన ప్రతినిధుల బృందం విమానాశ్రయాల్లో నిరంతరం నిఘా పెట్టాలని నిర్ణయం తీసుకున్నారు. దీనితోపాటు ఇంటర్ పోల్ ద్వారా వన్యప్రాణుల అక్రమ రవాణాను అరికట్టవచ్చని భావిస్తున్నారు.

అంతరించిపోతున్నాయి

గత మూడు దశాబ్దాల్లో ఆఫ్రికాలో ఏనుగుల జనాభా దాదాపు 90 శాతం తగ్గడంతో, అంతర్జాతీయ ప్రకృతి పరిరక్షణ సంస్థ (ఐ.యు.సి.ఎన్) వాటిని అంతరించిపోతున్న జీవ జాతుల్లో చేర్చింది. ఈ యాభయ్యేళ్లలో భారీ సంఖ్యలో వన్యప్రాణుల జాతులు కనుమరుగైనట్లుగా వరల్డ్ వైల్డ్ లైఫ్ ఫౌండేషన్ విడుదల చేసిన 'లివింగ్ ప్లానెట్ ఇండెక్స్-2024' పేర్కొంది. అడవుల నరికివేత, జంతువుల అక్రమ రవాణా, మానవ కార్యకలాపాలతో వన్యప్రాణులు అంతరించి పోతున్నాయని వెల్లడించింది. 1970 నుంచి 2020 మధ్య కాలంలో సగటు జాతుల్లో 73 శాతం తగ్గుదలను గుర్తించింది. జూలాజికల్ సొసైటీ ఆఫ్ లండన్ లివింగ్ ప్లానెట్ ఇండెక్స్ ప్రకారం...1970-2020 మధ్య 35 వేలకు పైగా వన్యప్రాణుల జాతులు, 5,495 జాతుల ఉభయచరాలు, పక్షులు, చేపలు, క్షీరదాలు, సరీసృపాలు అంతరించిపోయాయి. భారత్‌లో మూడు రకాల రాబందుల జాతులు క్రమంగా అంతరించిపోతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా వన్యప్రాణి సంరక్షణలో ప్రభుత్వాలు అవలంభిస్తున్న మెతక వైఖరి కూడా దీనికి కారణమౌతోంది. ప్రపంచ వ్యాప్తంగా అన్ని దేశాలు పరస్పరం సహకరించుకుంటూ...స్మగ్లర్లు, వేటగాళ్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తేనే వన్యప్రాణులను రక్షించుకొని జీవ వైవిధ్యాన్ని కాపాడుకోగలుగుతాం.

/ వ్యాసకర్త సెల్ : 9640466464/

అభిప్రాయం

ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత

ఈ మధ్య అన్ని బ్యాంకుల వారు ఎస్.ఎం.ఎస్ చార్జీల మోత మోగించడం ఎక్కువైంది. అలాగే ఎ.టి.ఎం. కార్డుల పేరుతో వార్షిక చార్జీల మోత మరీ ఎక్కువగా వున్నది. దీంతో తమ బ్యాంకు ఖాతా లోని డబ్బు మాటిమాటికీ ఎందుకు, ఎంత కోత పడుతున్నదో తెలియని అగమ్యగోచర పరిస్థితుల్లో ప్రస్తుతం ఖాతాదారులు కొట్టు మిట్టాడుతున్నారు. ప్రైవేటు బ్యాంకుల జిల్లా సహకార బ్యాంకుల్లో కూడా ఇదే పరిస్థితి నడుస్తున్నది. వారు అనుసరిస్తున్న కొన్ని అర్థం పర్థం లేని అస్తవ్యస్త విధానాలు ఖాతాదారుల పాలిట పెను శాపంగా పరిణమిస్తున్నాయి. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం వెంటనే 'రిజర్వ్ బ్యాంకు'కి దిశానిర్దేశం చేసి చార్జీల మోతను కొంత మేరకైనా కట్టడి చేయాలి. అప్పుడే సామాన్యుడికి కొంత ఊరట కలుగుతుంది.

- దాసం వెంకటరెడ్డి,
ఊరదాళ్ళపాలెం, పశ్చిమ గోదావరి జిల్లా.

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @ gmail.com

జి-20కి సంబంధించి కొన్ని ముఖ్యాంశాలు

- 1999 – జి20 స్థాపన
- 2008– వాషింగ్టన్‌లో నిర్వహించిన మొదటి జి-20 సదస్సు
- 2023 – ఆఫ్రికన్ యూనియన్‌కు జి-20లో సభ్యత్వం
- జి-20లో 19 దేశాలకు, ఇయు, ఆఫ్రికా యూనియన్‌కు ప్రాతినిధ్యం
- సభ్య దేశాలు: అర్జెంటీనా, ఆస్ట్రేలియా, బ్రెజిల్, కెనడా, చైనా, ఫ్రాన్స్, జర్మనీ, భారత్, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో, దక్షిణ కొరియా, రష్యా, సౌదీ అరేబియా, దక్షిణాఫ్రికా, టర్కీ, బ్రిటన్, అమెరికా.
- గ్లోబల్ జనాభాలో మూడింట రెండొంతులకు జి-20 ప్రాతినిధ్యం
- ప్రపంచ భూ విస్తీర్ణంలో 60 శాతం కలిగి ఉంది
- గ్లోబల్ జిడిపిలో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 80 శాతం వాటా కలిగి ఉంది.
- 2008– 2023 మధ్య 18 జి-20 సమ్మిట్‌లు జరిగాయి
- ఈ సమ్మిట్‌లలో ప్రస్తావనకు వచ్చిన ప్రధాన అంశాలు: ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కోవడం
- అంతర్జాతీయ ఫైనాన్స్ మార్కెట్ల నియంత్రణ
- పన్ను ఎగవేతపై యుద్ధం
- అభివృద్ధి విధానాలకు ప్రోత్సాహం
- ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అందరి భాగస్వామ్యం,ఉత్తేజితం, వినూత్నమైన రీతిలో అనుసంధానం దిశగా ముందుకు సాగడం.

పెద్దదర్గాను దర్శించిన రామ్‌చరణ్

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడపలోని పెద్దదర్గాను ప్రముఖ సినీ నటుడు రామ్‌చరణ్ సోమవారం సందర్శించారు. బేగంపేట నుంచి కడప ఎయిర్ పోర్టుకు ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన ముందుగా శ్రీ విజయ దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాహకులు దుర్గాప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి పెద్ద దర్గాకు రామ్‌చరణ్ వెళ్లారు. ఆయనకు పీఠాధిపతి ఆరిఫుల్లా హుసేని,దర్గా కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికారు. దర్గాలో రామ్‌చరణ్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పీఠాధిపతి ఆయనకు దర్గా విశిష్టత వివరించారు. రామ్‌చరణ్ వెంట దర్శకుడు బుచ్చిబాబు ఉన్నారు.

కోటీశ్వరులకు, పేదలకు మధ్య యుద్ధం : రాహుల్‌గాంధీ

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలను కోటీశ్వరులు, పేదలకు మధ్య జరుగుతున్న యుద్ధంగా కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ అభివర్ణించారు. ముంబయిలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించడానికి బిజెపి విభజన భాషను వాడుతోందని విమర్శించారు. 'ఎన్నికలలో ప్రధానాంశం నిరుద్యోగం. మహారాష్ట్రలో నిరుద్యోగం పెరిగిపోతోంది. ఏడు లక్షల కోట్ల రూపాయల విలువైన ఎనిమిది ప్రాజెక్టులు రాష్ట్రం నుండి తరలిపోతున్నాయి. ఫలితంగా ఐదు లక్షల ఉద్యోగాలకు మంగళం పాడుతున్నారు. ధారవిలో లక్ష కోట్ల రూపాయల విలువైన ముంబయి ప్రజల భూమిని ఒక వ్యక్తికి కట్టబెడుతున్నారు. వ్యవసాయోత్పత్తుల ధరలు పడిపోతున్నాయి. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేసేందుకు బిజెపి చేసిందేమీ లేదు. ధర్మయుద్ధం వంటి మాటలు చెబుతూ సమస్యల నుండి ప్రజల దృష్టిని మళ్లించే ప్రయత్నం చేస్తున్నారు. వారికి మరో ప్రత్యామ్నాయం లేకే ఇలా చేస్తున్నారు' అని మండిపడ్డారు. బిజెపి చేస్తున్న ఈ ప్రయత్నాలు మహారాష్ట్ర ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపబోవని రాహుల్ చెప్పారు. మోడీ, పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ, ధారవి పునరభివృద్ధి మ్యాప్ ఫొటోలతో ఉన్న ఖజానా పెట్టెను రాహుల్ ప్రదర్శిస్తూ 'ఈ సురక్షితమైన పెట్టె గురించే ఆయన ఆందోళన చెందుతున్నారు. భారత ప్రధాని మద్దతు లేకుండా అదానీ ప్రజల నుండి ధారవి భూమిని తీసుకోలేరు. ఇదే అసలైన ఎన్నికల ప్రచారాంశం' అని అన్నారు. ఆ వ్యాపారవేత్త ఓడరేవులు, విమానాశ్రయాలు, గనులు, ధారవి పునరభివృద్ధి... ఇలా అన్ని ప్రాజెక్టులను సొంతం చేసుకుంటున్నారని ఆరోపించారు. మహారాష్ట్ర సంపదను రాష్ట్ర ప్రజలకు ఇవ్వాలా లేక ఒకే వ్యక్తికి కట్టబెట్టాలా అనేదే ఈ ఎన్నికలలో ప్రధాన ప్రశ్నగా నిలిచిందని తెలిపారు.

మహిళలపై అత్యాచారాలకు పాల్పడే వారికి బిజెపి అండదండలు : వినేష్ ఫొగట్

మహిళలపై అత్యాచారాలకు పాల్పడేవారికి బిజెపి అండగా నిలుస్తుందని హర్యానాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే వినేష్ ఫొగట్ విమర్శించారు. పుణేలో జరిగిన విలేకరుల సమావేశంలో ఫొగట్ మాట్లాడుతూ 'నేను బిజెపి నాయకులకు ఒకటి చెప్పాలను కుంటున్నాను. 'ఏక్ హై తో సేఫ్ హై' అని మీరు అంటున్నారు. కానీ, మీ నాయకుడు మహిళలను వేధించడం ఆపేస్తే మేం సురక్షితంగా ఉంటాం' అని అన్నారు. డబ్ల్యుఎఫ్ఐ మాజీ అధ్యక్షులు, బిజెపి మాజీ ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను ఉద్దేశించి ఫొగట్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'తమకు అన్యాయం జరిగిందని మహిళలు రోదిస్తే.. వారు బిజెపికి ప్రియమైన వారు కాదు. పైగా ఆ మహిళలు దేశద్రోహులు అవుతారు' అని అన్నారు. 'ఓట్ల కోసం బిజెపి హిందు-ముస్లిం మధ్య వివాదాలను, నోట్లను వెదజల్లుతుంది' అని ఫొగట్ విమర్శించారు.

సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసినా మారని యోగి

జార్ఖండ్ ఎన్నికల ప్రచారంలో 'బుల్డోజర్' ప్రస్తావన

రాంచి : బుల్డోజర్ న్యాయం పేరుతో వ్యతిరేకిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చినా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ తీరు మారలేదు. సోమవారం జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో యోగి మాట్లాడుతూ హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం కేంద్ర నిధులను కొల్లగొట్టిందని, ఆ డబ్బును రికవరీ చేయడానికి "బుల్డోజర్ సిద్ధంగా ఉంది" అని హెచ్చరించారు. ల్యాండ్ జిహాద్, లవ్ జీహాద్‌లకు సోరెన్ ప్రభుత్వం ప్రోత్సాహం ఇచ్చిందని ఆరోపించారు.

రవీంద్రరెడ్డి విషయంలో కోర్టు ఉత్తర్వుల అమలుపై సందేహాలు : హైకోర్టు

ప్రజాశక్తి-అమరావతి

సోషల్ మీడియా యాక్టివిస్ట్ వి రవీంద్రర్ రెడ్డిని కోర్టు ముందు హాజరీకి ముందు కోర్టు ఉత్తర్వులను అమలు చేయలేదనేందుకు ప్రాథమిక ఆధారాలు ఉన్నాయని హైకోర్టు చెప్పింది. రవీందర్‌రెడ్డిని తమ ఎదుట హాజరుపర్చాలని సోమవారం హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. పోలీసులు వివరణ ఇవ్వాలని కూడా ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలంది. జాతీయ రహదారుల సంస్థను ప్రతివాదిగా చేర్చాలని రవీందర్‌రెడ్డి భార్యను ఆదేశించింది. విచారణ ఈ నెల 20న జరుపుతామని జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన డివిజన్ బెంచ్ ప్రకటించింది. రవీందర్‌రెడ్డిని అక్రమంగా నిర్బంధించారంటూ ఆయన భార్య కళ్యాణి హెబియస్ కార్పస్ పిటిషన్ వేశారు. గత విచారణలో వర్రా రవీందర్‌రెడ్డిని తాము అరెస్ట్ చేయలేదని, తమ నిర్బంధంలో కూడా లేరని పోలీసులు చెప్పారు. దీంతో రవీందర్‌రెడ్డితోపాటు సుబ్బారెడ్డి, భాస్కర్‌రెడ్డిని తమ ఎదుట హాజరుపర్చాలని హైకోర్టు ఆదేశించింది. రెండోసారి విచారణ సమయంలో రవీందర్‌రెడ్డిని తాము అరెస్టు చేసినట్లు పోలీసులు హైకోర్టుకు చెప్పారు. రవీందర్‌రెడ్డిని పోలీసులు కొట్టారని, శరీరంపై గాయాలు ఉన్నాయని న్యాయవాది తెలిపారు. 9న తాము అరెస్టు చేయలేదన్న పోలీసులు 12న అరెస్టు చేశామని చెప్పడాన్ని సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి తీవ్రంగా తప్పుపట్టారు. హైకోర్టు తమ ఎదుట హాజరుపర్చాలంటే పోలీసులు కింది కోర్టులో హాజరుపర్చడం కోర్టు ధిక్కారమే అవుతుందన్నారు. పుల్లూర్ టోల్ ప్లాజా వద్ద రవీందర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నందున అక్కడి సిసి ఫుటేజీని భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని, టోల్ ప్లాజా జాతీయ రహదారుల సంస్థ ఆధీనంలో ఉన్న నేపథ్యంలో ఆ సంస్థను ప్రతివాదిగా చేర్చాలని కోరగా.. అందుకు హైకోర్టు అనుమతినిచ్చింది.

ఆర్‌జివికి ఎదురుదెబ్బ

మధ్యంతర ఉత్వర్వుల జారీకి హైకోర్టు నిరాకరణ

ప్రజాశక్తి-అమరావతి

ప్రకాశం జిల్లా, మద్దిపాడు పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలంటూ సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్‌లో మధ్యంతర ఉత్తర్వుల జారీకి హైకోర్టు నిరాకరించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. అధికారుల ముందు హాజరయ్యేందుకు గడువు ఇచ్చేందుకు నిరాకరించింది. అరెస్టు భయం ఉంటే బెయిల్ పిటిషన్ దాఖలు చేసుకోవాలని వర్మకు చెప్పింది. ప్రాథమిక దశలో మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయలేమని జస్టిస్ బివిఎల్ఎన్ చక్రవర్తి తేల్చి చెప్పారు. పోలీసులకు, ఫిర్యాదుదారుకు నోటీసులు జారీ చేశారు. సమగ్ర వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. గత మార్చిలో విడుదలైన వ్యూహం సినిమా పోస్టర్లను ఎక్స్‌లో పోస్టు చేశారని, అవి చంద్రబాబు, వపన్‌కల్యాణ్, లోకేష్‌లను కించపరిచేలా ఉన్నాయని ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం, గార్లపాడుకు చెందిన ముత్తనపల్లి రామలింగయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పెట్టిన కేసును కొట్టేయాలని వర్మ... హైకోర్టును ఆశ్రయించారు.

గౌతమ్‌రెడ్డి పిటిషన్‌పై విచారణ వాయిదా

విజయవాడ, సత్యనారాయణపురం పోలీసులు పెట్టిన హత్యాయత్నం కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ వైసిపి నేత పూనూరు గౌతమ్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. తదుపరి విచారణ వరకు గౌతమ్‌రెడ్డిపై కఠిన చర్యలేవీ తీసుకోవద్దని పోలీసులకు హైకోర్టు సోమవారం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 21కు వాయిదా వేసింది. పోలీసులకు గౌతమ్‌రెడ్డి సహకరించాలంది. ఈ మేరకు జస్టిస్ విఆర్‌కె కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబుపై కేసుల్లో సాక్ష్యాలు తారుమారు ప్రమాదం హైకోర్టులో అనుబంధ పిటిషన్

నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న 2014-19 మధ్య కాలంలో జరిగిన పలు భారీ కుంభకోణాలకు సంబంధించి నమోదైన కేసుల్లో కింది కోర్టుకు సమర్పించిన చార్జిషీట్లను, ఆ కేసుల డైరీలను కోర్టు ముందుంచేలా సిఐడి అదనపు డిజిని ఆదేశించాలని కోరుతూ కొట్టి బాలగంగాధర్ తిలక్ హైకోర్టులో అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. ఆ కుంభకోణాల్లో నిందితులుగా ఉన్న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రులు పొంగూరు నారాయణ, నారా లోకేష్, కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర తదితరులు దర్యాప్తు అధికారులను ప్రభావితం చేసేంత శక్తిమంతమైన మంత్రి పదవుల్లో ఉన్నందున కేసు డైరీల్లోని కీలక ఆధారాలను, సాక్ష్యాలను మార్చే ప్రమాదం ఉందన్నారు. కేసుల తదుపరి దర్యాప్తు బాధ్యతలను సిబిఐ, ఇడిలకు అప్పగించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిటిషనరు ప్రజాహిత వ్యాజ్యం దాఖలు చేశారు.

IKF Home Finance

ఐకెఎఫ్ హోమ్ ఫైనాన్స్ లిమిటెడ్

ప్లాట్ నం.30/ఎ, సర్వే నం.83/1, మై హోమ్ ట్విజా, 11వ అంతస్తు, డైమండ్ హిల్స్, లుంబిని అవెన్యూ, 400/220/132కెవి ప్రక్కన, జిఐఎస్ సబ్‌స్టేషన్, ఎపిఐఐసి హైదరాబాద్, నాలెడ్జి సిటీ, రాయిదుర్గ్ హైదరాబాద్-081. ఫోన్:040-23412083

స్వాధీనతా ప్రకటన

(ది సెక్యూరిటీ ఇంటెరెస్ట్ ఎన్ఫోర్స్‌మెంట్ రూల్స్, 2002 యొక్క రూల్ 8(1)తో చదువబడే అనుబంధం 4 ప్రకారం)

లోన్ ఖాతా నం. LNVJY04022-230005073/LNVJY02523-240009301.

క్ర. సం.	రుణగ్రహీతల పేరు మరియు చిరునామా & రుణ ఖాతా నెంబరు	డిమాండ్ నోటీసు తేది	బాకీపడిన మొత్తం	స్వాధీనతా ఆస్తి వివరాలు	స్వాధీనతా తేది
1.	రుణ ఖాతా నెంలు: HL11GIV000064908 & HL05GIV000030985 ముత్తయ్య మోదుగు లక్ష్మీ విమల కుమారి మోదుగు **ఇరువురి నివాసం:** డి.నెం.3-4, చనుబండ, ఛత్రాయి, పంచత్ ఆఫీస్ దగ్గర, ఛత్రాయి, 521214. **ఇక్కడ కుడా:** డి.నెం.3-4, చనుబండ, పంచాయత్ ఆఫీస్ దగ్గర, ఛత్రాయి-521214	22-05-2024	21.05.2024 నాటికి రూ. 20,27,649/- (రూపాయలు ఇరవై లక్షల ఇరవైఏడు వేల ఆరువందల నలభై తొమ్మిది మాత్రమే) మరియు దానిపై వడ్డీ.	చనుబండ గ్రామం, చనుబండ గ్రామపంచాయతీ ప్రాంతం, ఛత్రాయి మండలం, విస్సన్నపేట సబ్ రిజిస్ట్రీ, కృష్ణా జిల్లా వద్దగల సర్వే నెం.149/4లోని ఆర్‌సిసి బిల్డింగ్ మరియు అందులోని 600.00చ.గ.లవిస్తీర్ణపు స్థలంపైగల ఆస్తి మొత్తం భాగం. సరిహద్దులుగా: తూర్పు: పెరికెల రఘు నాయకుల ఆస్తి 98.0 లింకులు, దక్షిణం: పోరంబోకు రోడ్డు 111.0 లింకులు, పడమర: మోదుగు రవి ఆస్తి 127 లింకులు, ఉత్తరం: కంచర్ల వెంకట రత్నం ఆస్తి112.0 లింక్‌లు, అన్ని సౌలభ్య హక్కులతో	స్వాధీనతా తేది: 12-11-2024

తేది: 12-11-2024 — చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ తరపున
ప్రదేశం: విజయవాడ, ఎన్‌టిఆర్ జిల్లా — అధీకృత అధికారి

భౌతిక స్వాధీనత నోటీసు

ICICI Home Finance — **నమోదిత కార్యాలయం:** ఐసిఐసిఐ బ్యాంక్ టవర్స్, బాంద్రా-కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబాయి-400051.
కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హెచ్ఎఫ్‌సి టవర్స్, జెబి నగర్, అంధేరి కుర్లా రోడ్డు, అంధేరి ఈస్ట్, ముంబాయి-400059
శాఖ కార్యాలయం: 2వ అంతస్తు, 40-1-129/1, ఆర్‌సిసి భవనం, మహాత్మాగాంధీ రోడ్డు, చంద్రమౌళీపురం, విజయవాడ-520010.

ఏదైతే
దిగువసంతకందారు అయిన ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్ ఆండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ యాక్ట్, 2002 క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 3తో చదువుతూ సెక్షన్ 13(12) క్రింద అతనికి అందించబడిన అధికారాలను వినియోగించుకుంటూ రుణగ్రహీతలను సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపట దిగువ పేర్కొన్న మొత్తాన్ని తిరిగి చెల్లించవలసిందిగా కోరుతూ డిమాండ్ నోటీసులు జారీచేయడమైనది.
రుణగ్రహీతలు మొత్తం తిరిగి చెల్లించుటలో విఫలం చెందిన కారణంగా, ప్రధానంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలకు నోటీసు ఇవ్వడమేమనగా, దిగువ పేర్కొన్న తేదిల ప్రకారం సదరు రూల్స్ యొక్క రూల్ 8తో చదువుతూ సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద అతను/ఆమె అధికారాలు అధ్యాయనం చేస్తూ దిగువ వివరించిన ఆస్తి దిగువ సంతకందారుడు స్వాధీనపరుచుకొన్నాడు. ప్రత్యేకంగా రుణగ్రహీత మరియు సాధారణ ప్రజలను హెచ్చరిండమేమనగా ఆస్తితో ఎలాంటి లావాదేవీలు జరుపరాదు మరియు ఏవైనా లావాదేవీలు జరుపదలచిన వారి ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ చార్జ్‌కు లోబడి జరుపవలెను.
రుణగ్రహీత జాగ్రత్త వహించవల్సింది ఏమనగా సెక్యూర్డ్ అస్సెట్స్‌ను విడిపించుకొనుటకు మీకు లభించిన సమయం మేరకు చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) నిబంధనలను అహ్వానించడమైనది.

క్ర. సం	రుణగ్రహీత/సహా-రుణగ్రహీత పేరు/లోను అకౌంట్ నంబరు	ఆస్తి వివరణ/ స్వాధీనత తేది	డిమాండ్ నోటీసు తేది/ డిమాండ్ నోటీసులో మొత్తం (రూ.)	శాఖ పేరు
1.	గంజికుంట కోదండ రామాంజనేయులు (రుణగ్రహీత), గంజికుంట శ్రీనివాసరావు (సహ-రుణగ్రహీత) LHVJW00001482328	53-1-50, ఆర్.ఎస్.నం.413/ఎ, గుణదల విజయనగర్ కో., పాత డో.నం.53-150, కొత్త డో.నం.53-1-50/1, ఆర్.ఎస్.నం.43, పాత మూల్యాంకనం నం.6055599, కొత్త మూల్యాంకనం నం.1073195211, గుణదల, విజయవాడ ఆంధ్రప్రదేశ్-520010 (రిఫ్.ఎల్ఎఎన్ నం.LHVJW00001482328) హద్దులు : ఉత్తరం : మున్సిపల్ కార్పొరేషన్ రోడ్డు, దక్షిణం : ఆర్.ఏసుపాదం ఆస్తి, తూర్పు : ఎమ్.కస్తూరిబాయి ఆస్తి, పడమర : బి.రాజేశ్వర రాజు ఆస్తి/ స్వాధీనతా తేది: 14-నవంబరు-2024	18-08-2023 Rs. 38,99,337/-	విజయవాడ-బి

పైన పేర్కొన్న రుణగ్రహీతలు(లు)/హామీదారులు(లు) మొత్తం తిరిగిచెల్లించుటకు ఒక 30 రోజుల నోటీసు ఇక్కడ ఇవ్వడమైనది, కావునా రూల్స్ 8 మరియు 9 ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 క్రింద నిబంధనల ప్రకారం, ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 30 రోజుల గడువు తీరినాక తనఖా ఆస్తులు అమ్మబడును.

తేది: 19 నవంబరు, 2024 — అధీకృత అధికారి
ప్రదేశం: విజయవాడ — ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

మూగబోయిన మైకులు

- ముగిసిన 'మహా' ఎన్నికల ప్రచార పర్వం
- 20న పోలింగ్.. 23న తుది ఫలితాలు
- 288 స్థానాలకు బరిలో 4136 మంది
- నమోదిత ఓటర్ల సంఖ్య 9.63 కోట్లకు పైనే

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార పర్వం సోమవారం ముగిసింది. ఆదివారం సాయంత్రం వరకు రాజకీయ పార్టీలు ప్రచారాలు, సభలు, విమర్శలు, ప్రతివిమర్శలతో హోరెత్తించాయి. సోమవారం సాయంత్రం నాటికి తమ ప్రచారాలకు ఫుల్‌స్టాప్ పెట్టాయి. దీంతో మైకులు మూగబోయాయి. ప్రచారం చివరి రోజు కావటంతో మిగిలిన తక్కువ సమయాన్ని ప్రభావవంతంగా వినియోగించుకునేందుకు రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమించాయి. ఓటర్లను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలనే చేశాయి. ప్రచారపర్వం ముగియటంతో రాజకీయ పార్టీలు తెర వెనక ప్రయత్నాలు, 'ప్రలోభా'లను షురూ చేశాయి. మహారాష్ట్రలోని మొత్తం 288 అసెంబ్లీ స్థానాలకు.. ఈనెల 20 ఎన్నికలు.. 23న తుది ఫలితాలు వెలువడనున్న విషయం తెలిసిందే.

మహారాష్ట్రలో ప్రస్తుత ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, అజిత్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి, బిజెపిల మహాయుతి కూటమి అధికారంలో ఉన్నది. కాంగ్రెస్, శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సిపి (ఎస్‌పి), ఉద్ధవ్ థాక్రే నాయకత్వంలోని శివసేన (యుబిటి)ల ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) కూటమి ప్రధాన ప్రతిపక్షంగా.. మహాయుతి కూటమికి ప్రధాన పోటీదారుగా ఉన్నది. ఈ రెండు కూటములు అధికారమే లక్ష్యంగా రాష్ట్రంలో విస్తృత ప్రచారం నిర్వహించాయి.

మహారాష్ట్రలోని షోలాపూర్ ఎన్నికల సభలో మాట్లాడుతున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం

ప్రచారంలో పలువురు కీలక నేతలు

ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, ఇతర కేంద్ర మంత్రులు, బిజెపి సిఎంలు, రాష్ట్రాల మంత్రులు, ఎన్డీయేలో ఉన్న పార్టీల కీలక నాయకులు, నేతలు మహాయుతి కూటమి అభ్యర్థుల తరపున ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ కూడా.. అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, తమ పార్టీ ముఖ్యమంత్రులు, మంత్రులు, కీలక నాయకులతో ఎంవిఎ తరపున ప్రచారాన్ని జరిపించింది. మహిళలకు ఆర్థిక చేయూతనిచ్చే 'మఝీ లడ్‌కీ బహిన్' తమ కూటమిని మళ్లీ అధికారంలోకి తీసుకొస్తుందని మహాయుతి భావిస్తున్నది. 'బాటేంగో తో కాటేంగే', 'ఏక్ హై తో సేఫ్ హై' వంటి నినాదాలతో ప్రజల్లో మళ్లీ భావోద్వేగాన్ని రగిల్చి, హిందువుల ఓట్లను రాబట్టుకోవాలని బిజెపి చూస్తున్నదని ఎంవిఎ విమర్శించింది. మహాయుతి కూటమిలోనే ఇలాంటి నినాదాలపై ఐక్యత కనిపించలేదు. యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ వినిపించిన 'బాటేంగే తో కాటేంగే' నినాదానికి అజిత్ పవార్ ఎడం పాటించారు. కుల గణన, సామాజిక న్యాయం, రాజ్యాంగాన్ని పరిరక్షించటం వంటి అంశాలపై ఎంవిఎ కూటమి ప్రధానంగా ఫోకస్ చేసి, మహాయుతికి గట్టి కౌంటర్ ఇచ్చిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

వివిధ పార్టీలు పోటీ చేసే సీట్ల సంఖ్య ఇలా..

ఈ ఎన్నికల్లో మహాయుతి కూటమి నుంచి.. బిజెపి 149 స్థానాల్లో, శివసేన 81 సీట్లలో, అజిత్ పవార్ ఎన్సీపీ 59 నియోజకవర్గాల్లో పోటీ చేస్తున్నాయి. ఇక ఎంవిఎ నుంచి కాంగ్రెస్ 101 మంది అభ్యర్థులను పోటీలో నిలిపింది.

శివసేన (యుబిటి) 95 స్థానాల్లో, ఎన్‌సిపి (ఎస్‌పి) నుంచి 86 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో బిఎస్‌పి (237 మంది అభ్యర్థులు), ఎఐఎంఐఎం (17 మంది) పార్టీలు కూడా పోటీలో ఉన్నాయి.

పెరిగిన అభ్యర్థులు, ఓటర్ల సంఖ్య

2019 అసెంబ్లీ ఎన్నికలతో పోల్చి చూస్తే.. ఈ సారి పోటీ చేసే అభ్యర్థుల సంఖ్య 28 శాతం పెరిగింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో నిలిచినవారి సంఖ్య 3,239 కాగా.. అది ఈ సారి 4,136కు చేరింది. వీరిలో స్వతంత్రులు 2086 మంది ఉన్నారు. 150 నియోజకవర్గాల్లో పార్టీలకు రెబెల్ అభ్యర్థుల బెడద ఉన్నది. మహారాష్ట్రలో నమోదిత ఓటర్ల సంఖ్య 9,63,69,410గా ఉన్నది. కొత్తగా 69,23,199 మంది ఓటర్లు వచ్చి చేరారు. ఇందులో 18-19 ఏండ్ల మధ్య ఉన్న ఓటర్ల సంఖ్య 20,93,206గా ఉన్నది. 6,36,278 మంది వికలాంగులు, 12,43,192 మంది 85 ఏళ్లకు పైబడినవారు, 47,716 మంది శతాధిక వృద్ధులు ఉన్నారు. ఈసారి ఎన్నికల్లో మొత్తం 1,00,186 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ సంఖ్య 96,654గా ఉన్నది. దాదాపు ఆరు లక్షల మంది రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల విధుల్లో పాలు పంచుకోనున్నారు. ఈనెల 23న అసెంబ్లీ ఎన్నికల తుది ఫలితాలు వెలువడనున్నాయి.

జార్ఖండ్‌లో రేపే చివరి దశ పోలింగ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

తమకు కేటాయించిన కేంద్రాలకు వెళుతున్న ఎన్నికల సిబ్బంది

జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల రెండో, చివరి దశ ఎన్నికల ప్రచార సందడి ఆగిపోయింది. రెండో దశకు సంబంధించి 38 స్థానాల్లో బుధవారం ఓటింగ్ జరగనుంది. ప్రస్తుతం ఎన్నికలు జరగనున్న స్థానాలు జెఎంఎం, కాంగ్రెస్, ఆర్‌జెడిలకు కంచుకోటలుగా ఉన్నాయి. రెండో దశ ఎన్నికల్లో సంతాల్ పరగణాలోని 18 స్థానాలతో కలిపి మొత్తం 12 జిల్లాల్లోని మొత్తం 38 స్థానాలకు గానూ 528 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, కల్పనా సోరెన్, బాబూలాల్ మరాండీ, సుదేశ్ మహతో, రవీంద్రనాథ్ మహతో, దీపికా పాండే సింగ్, హఫీజుల్ హసన్, సీతా సోరెన్, బసంత్ సోరెన్‌లతో సహా పలువురు ప్రముఖులు బరిలో ఉన్నారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ 38 సీట్లలో జార్ఖండ్ ముక్తి మోర్చాకు గరిష్టంగా 13 సీట్లు, బిజెపికి 12 సీట్లు, కాంగ్రెస్‌కు 8 సీట్లు వచ్చాయి. జార్ఖండ్ వికాస్ మోర్చా (జెవిఎం), ఎజెఎస్‌యు చెరో రెండు సీట్లు, సిపిఐ (ఎంఎల్) కూడా ఒక స్థానాన్ని గెలుచుకున్నాయి.

బిజెపి నుంచి ఈసారి అత్యధికంగా 32 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. జెఎంఎం నుండి 20 మంది కాంగ్రెస్ నుండి 13 మంది బరిలో ఉన్నారు. ఆల్ జార్ఖండ్ స్టూడెంట్స్ యూనియన్ (ఎజెఎస్‌యు) నుంచి ఆరుగురు, రాష్ట్రీయ జనతాదళ్ (ఆర్‌జెడి) నుంచి ఇద్దరు పోటీలో ఉన్నారు. 257 మంది అభ్యర్థులు స్వతంత్రంగా పోటీ చేస్తున్నారు.

1.23 కోట్ల ఓటర్లు

ఈ ఎన్నికల్లో మొత్తం 1.23 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల రెండో దశలో 14,218 పోలింగ్ బూత్‌లలో జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో 2,414 పోలింగ్ కేంద్రాలు, గ్రామీణ ప్రాంతాల్లో 11,804 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. 31 బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనుంది. మిగిలిన అన్ని బూత్‌లలో ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఓటింగ్ జరుగుతుంది. సాయంత్రం 4 గంటల వరకు ఓటింగ్ జరగనున్న చోట, దుమ్కా అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 10 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ధన్వర్ స్థానంలో అత్యధికంగా 24 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అత్యల్పంగా దియోఘర్ స్థానానికి ఏడుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

మళ్లీ పోరు బాట

- డిసెంబర్ 6న ఢిల్లీ ఛలో
- పంజాబ్ రైతు సంఘాల ప్రకటన

చండీగఢ్: తమ డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం స్పందించని పక్షంలో డిసెంబర్ 6వ తేదీన శంభు సరిహద్దు నుండి దేశ రాజధాని ఢిల్లీకి ప్రదర్శనగా వెళతామని పంజాబ్‌కు చెందిన కిసాన్ మజ్దూర్ మోర్చా (కెఎంఎం), అదే రాష్ట్రానికి చెందిన రాజకీయేతర సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) సోమవారం ప్రకటించాయి. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలన్న ప్రధాన డిమాండ్‌తో పంజాబ్ రైతులు ఆందోళన చేస్తున్న విషయం తెలిసిందే. సంగ్రూర్‌లోని ఖనౌరీ వద్ద ఈ నెల 26న నిరవధిక నిరాహార దీక్ష ప్రారంభిస్తానని ఎస్‌కెఎం సమన్వయకర్త జగజీత్ సింగ్ దల్లేవాల్ ఇప్పటికే ప్రకటించారు. తనతోపాటు సుఖ్‌జిత్ సింగ్ హర్డోజ్‌హండే కూడా దీక్షలో కూర్చుంటారని క్యాన్సర్ రోగి అయిన దల్లేవాల్ చెప్పారు. 'ఫిబ్రవరి 13వ తేదీ నుంచి శంభు, ఖనౌరీ సరిహద్దుల వద్దే బైఠాయించాం. ఆ నెల 18న ప్రభుత్వంతో చివరి సమావేశం జరిగింది. అది అసంపూర్తిగా ముగిసింది' అని కెఎంఎం సమన్వయకర్త సర్వన్ సింగ్ పాంధర్ చండీఘర్‌లోని కృషిభవన్‌లో చెప్పారు. కేంద్ర ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. శంభు, ఖనౌరీ వద్ద ధర్నాలో కూర్చుని 30 మంది రైతన్నలు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖనౌరీ సరిహద్దును దాటేందుకు రైతులు ప్రయత్నించగా హర్యానా వైపు నుంచి భద్రతా దళాలు జరిపిన కాల్పులలో ఓ రైతు చనిపోయాడని చెప్పారు. దల్లేవాల్ నిరాహార దీక్షను ప్రకటించినా కేంద్రానికి చీమ కుట్టినట్లు కూడా లేదని మండిపడ్డారు. సీనియర్ నేతల సారథ్యంలో బృందాలుగా విడిపోయి రాజధాని వైపు వెళతామని పాంధర్ తెలిపారు.

అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి

- మంత్రి సంధ్యారాణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అంగన్‌వాడీలతో దశలవారీగా చర్చలు జరిపి సమస్యలు పరిష్కరిస్తామని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి జి.సంధ్యారాణి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అంగన్‌వాడీల ప్రతి సమస్యపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని, ప్రభుత్వం ఏర్పడి ఆరు మాసాలే అయినందునే విషయాన్ని గమనించాలని అన్నారు.

మణిపూర్‌లో భయానక పరిస్థితి

(మొదటి పేజీ తరువాయి)

నెలకొందని పొలిట్‌బ్యూరో విమర్శించింది.

ఇటువంటి పరిస్థితుల్లో, కేంద్ర ప్రభుత్వం తక్షణమే గట్టిగా జోక్యం చేసుకుని, ఈ హింసకు స్వస్తి పలకాల్సిన సమయం ఆసన్నమైంది. శాంతిని పునరుద్ధరించి, రాష్ట్రంలోని అన్ని జాతులకు చెందిన వారి హక్కులను పరిరక్షించేందుకు రాజకీయ పరిష్కారం కోసం తీవ్రంగా కృషి చేయాలని పార్టీ పొలిట్‌బ్యూరో కోరింది.

బియ్యానికి నగదు బదిలీ!

(మొదటి పేజీ తరువాయి)

భరిస్తోంది. ఇప్పుడు ఈ సబ్సిడీ రద్దును అమలుచేస్తే ఖజానాకు భారీగానే నిధులు మిగులుతాయని అధికారులు అంటున్నారు. కేంద్రం నుంచి రావాల్సిన ఏడు వేల కోట్ల వరకు నిధులు కూడా యదాతథంగా వచ్చే అవకాశాలు ఉంటాయని ఆర్థికశాఖ అధికారి ఒకరు వ్యాఖ్యానించారు. ఇకపై బియ్యం ఇవ్వకుండా కార్డున్న వారిక కిలోకి కొంత మొత్తం చొప్పున వారి అకౌంట్లకు నగదు బదిలీ చేస్తారు. అయితే, బియ్యం ధరలు చుక్కలను దాటి పరుగులు తీస్తున్న నేపథ్యంలో సబ్సిడీని ఎత్తివేసి, నగదు ఇస్తే నిరుపేదలకు తిప్పలు తప్పవన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సాధ్యమైనంత త్వరగా శాంతిభద్రతల పునరుద్ధరణ

- మణిపూర్‌లో భద్రతపై అమిత్ షా సమీక్ష
- మణిపూర్‌కు అదనంగా 50 కంపెనీల బలగాలు
- నిరసనకారుడి హత్య

న్యూఢిల్లీ : మణిపూర్‌లో నెలకొన్న భద్రతా పరిస్థితులు, సైనిక బలగాల మోహరింపుపై వరుసగా రెండో రోజైన సోమవారం కూడా కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్ష జరిపారు. సాధ్యమైనంత త్వరలో మణిపూర్‌లో శాంతి భద్రతలను పునరుద్ధరించాల్సిందిగా ఉన్నతాధికారులను ఆదేశించారు. ప్రస్తుతం అత్యత సున్నితంగా వున్న పరిస్థితులను ఎదుర్కొనేందుకు ఐదు వేలమందితో కూడిన 50 కంపెనీల పారా మిలటరీ బలగాలను మణిపూర్‌కు తరలిస్తున్నట్లు కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. జిరిబమ్ జిల్లాలో తలెత్తిన హింస, ఘర్షణలు ఇతర ప్రాంతాలకు విస్తరించిన నేపథ్యంలో ఈ నెల 12న రాష్ట్ర బలగాలకు అదనంగా కేంద్ర బలగాలను పంపాలని ఆదేశాలు వెలువడ్డాయి. సిఎపిఎఫ్‌కు చెందిన 20 కంపెనీలు, సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 15 కంపెనీలు, బిఎస్‌ఎఫ్‌కు చెందిన ఐదు కంపెనీలను కేంద్ర హోం శాఖ తరలించిన సంగతి తెలిసిందే. వీటికి తాజా బలగాలు అదనం కానున్నాయి. త్వరలో తరలించే కంపెనీల్లో 35 సిఆర్‌పిఎఫ్, 15 బిఎస్‌ఎఫ్‌కు చెందినవి వున్నాయి. సిఆర్‌పిఎఫ్ డైరెక్టర్ జనరల్ ఎ.డి.సింగ్, కేంద్ర సాయుధ పోలీసు బలగాలకు చెందిన సీనియర్ అధికారులు ప్రస్తుతం రాష్ట్రంలోనే వున్నారు.

ప్రస్తుతం మణిపూర్‌లో మొత్తంగా 218 సిఎపిఎఫ్ కంపెనీల బలగాలు వున్నాయి. హింస, విధ్వంసకర చర్యలకు ఎవరైనా పాల్పడితే కఠినమైన చర్యలు వుంటాయని కేంద్ర హోం శాఖ హెచ్చరించింది. ఇప్పటివరకు ఇంఫాల్ లోయలో జరిగిన జాతుల ఘర్షణల్లో 220మందికి పైగా మరణించారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.

నిరసనకారుడి హత్య

జిరిబామ్ జిల్లాలో ఆందోళనలు జరుపుతున్న వారిపై పోలీసులు కాల్పులు జరపడంతో ఆదివారం రాత్రి ఒక వ్యక్తి మరణించగా, మరొకరు గాయపడ్డారు. ఆ హత్య జరిగిన గంటల వ్యవధిలోనే ముఖ్యమంత్రి బీరేన్ సింగ్ కాంగ్రెసేతర ఎంఎల్‌ఎలతో సోమవారం సాయంత్రం సమావేశం జరిపారు. అల్లరి మూక జిరిబమ్ పట్టణ వీధుల్లో పాలక బిజెపి, కాంగ్రెస్ కార్యాలయాలపై దాడి చేసిన నేపథ్యంలో ఈ సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు జరిపిన కాల్పుల్లో 20ఏళ్ల కుంద్రక్‌పామ్ మరణించాడు. 26ఏళ్ల బిషన్ గాయపడ్డాడు. ఇంఫాల్ ఈస్ట్, వెస్ట్, విష్ణుపూర్ జిల్లాల్లో కర్ఫ్యూ కొనసాగుతోంది. పలు జిల్లాల్లో ఇంటర్‌నెట్ సేవలు నిలిపివేశారు.

నాయకత్వాన్ని మారిస్తేనే బిజెపికి మద్దతు : కె సంగ్మా

అశాంతి నెలకొన్న మణిపూర్‌లో నాయకత్వాన్ని మార్చే వరకూ బిజెపికి మళ్లీ మద్దతు ఇచ్చేది లేదని ఎన్‌పిపి అధ్యక్షులు, మేఘాలయ ముఖ్యమంత్రి కాన్రాడ్ కె సంగ్మా సోమవారం స్పష్టం చేశారు. మణిపూర్‌లో హింసాకాండను పరిష్కరించడంలోనూ, సాధారణ పరిస్థితులు నెలకొల్పడంలోనూ విఫలమైనందుకు బీరేన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ఆదివారం ఎన్‌పిపి ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా సోమవారం సంగ్మా మాట్లాడుతూ 'మణిపూర్‌లో ఏడాదికి పైగా హింసాకాండ కొనసాగుతున్నదని, అయినా పరిస్థితులు అదుపులోకి వస్తాయని ఆశించామని, కానీ గతవారంలో పరిస్థితి మరింత దిగజారిందని చెప్పారు. ఈ పరిస్థితుల్లో బిరేన్ సింగ్ ప్రభుత్వంతో కలిసి ముందుకు వెళ్లలేమని చెప్పారు. బీరేన్ సింగ్‌పై తమ నాయకులు విశ్వాసం కోల్పోయారని అన్నారు.

ఇక రష్యాతో ప్రత్యక్ష యుద్ధమే !

- రంగంలోకి అమెరికన్ క్షిపణులు
- ఉక్రెయిన్‌కు బైడెన్ అనుమతి

వాషింగ్టన్ : మరో రెండు నెలల్లో దిగిపోనున్న బైడెన్ ప్రభుత్వం ఉక్రెయిన్ యుదాన్ని మరింత ఎగదోసే చర్యలను ముమ్మరం చేసింది. శక్తివంతమైన అమెరికన్ దీర్ఘ శ్రేణి క్షిపణులను రష్యాపై ప్రయోగించేందుకు ఉక్రెయిన్‌కు అనుమతి ఇచ్చింది. అమెరికా అందించే దీర్ఘశ్రేణి క్షిపణులను రష్యా నగరాలపై ఉపయోగించేందుకు అనుమతించడమంటే యుద్ధాన్ని మరింత విస్తరింపజేయడమే. ఈ చర్య ద్వారా ఉక్రెయిన్ యుద్ధం విస్తరింపజేయడమే అమెరికా ధ్యేయమని బైడెన్ ప్రభుత్వం చాటదలచుకుంది. అధికార బదలాయింపు ప్రక్రియ సాఫీగా సాగించే విషయమై అధ్యక్షుడిగా ఎన్నికైన ట్రంప్‌తో సమావేశమైన తర్వాత కొద్ది రోజులకే బైడెన్ ఈ చర్య తీసుకోవడం గమనార్హం. ట్రంప్ కూడా దీనిపై నోరు మెదపకపోవడాన్ని బట్టి బైడెన్ చర్యకు ఫాసిస్టు ట్రంప్ మద్దతు కూడా ఉన్నట్టు భావించాల్సి వస్తోంది. దీంతో రష్యా విధించిన లక్ష్మణరేఖను అమెరికా అతిక్రమించినట్లైంది. అదే గనక జరిగితే ఇదంతా రష్యాకు, నాటో దేశాలకు మధ్య ప్రత్యక్ష యుద్ధానికి దారి తీస్తుందని రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇదివరకే హెచ్చరించారు.

రష్యాకు మద్దతుగా ఉన్న ఉత్తర కొరియా బలగాలపై కూడా ఇజ్రాయిల్ ఈ దీర్ఘ శ్రేణి క్షిపణులను ప్రయోగించవచ్చని బైడెన్ చెప్పారు. అదే గనుక జరిగితే 1953లో కొరియా యుద్ధం ముగిసిన తర్వాత ఉత్తర కొరియా బలగాలపై అమెరికా ఆయుధాలతో జరిగే మొదటి దాడి ఇదే అవుతుంది. బైడెన్ ప్రభుత్వం ఆదివారం దీనిపై ప్రకటన జారీ చేసింది. రష్యాలోని కుర్స్క్ ప్రాంతంలో రష్యా, ఉక్రెయిన్ బలగాలపై ఆర్మీ టాక్టికల్ మిస్సైల్ సిస్టమ్ (ఎటిఎసిఎంఎస్) లను ఉక్రెయిన్ ఉపయోగించడానికి అనుమతి మంజూరు చేసింది. ప్రభుత్వం తాజాగా చేసిన ఈ ప్రకటనతో రష్యా నగరాలపై ముఖ్యంగా యుద్ధ రంగానికి దూరంగా గల ప్రాంతాలపై అంటే మాస్కోతో సహా ఇతర పట్టణాలు, నగరాలపై దాడులకు అమెరికా, బ్రిటీష్, ఫ్రెంచ్ దీర్ఘశ్రేణి ఆయుధాలు ఉపయోగించడానికి మార్గం సుగమం అయిందని అమెరికా అధికారులు స్పష్టం చేశారు.

ఢిల్లీ కాలుష్యంపై సుప్రీం కీలక నిర్ణయం

- అన్ని పాఠశాలలనూ మూసివేయాలంటూ ఆదేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీలో పెరుగుతున్న కాలుష్యంపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ, నేషనల్ క్యాపిటల్ రీజియన్‌లో 12వ తరగతి వరకు అన్ని పాఠశాలలనూ మూసివేయాలని ఆదేశించింది. కాలుష్య నియంత్రణకు ఎన్‌సిఆర్‌లోని రాష్ట్రాలు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. పెరుగుతున్న కాలుష్యాన్ని అరికట్టేందుకు ఏం చేశారంటూ సర్వోన్నత న్యాయస్థానం ఢిల్లీ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పరిధిలో కాలుష్యాన్ని నివారించేందుకు కఠిన చర్యలు అమలు చేయడంలో ఎందుకు ఆలస్యం చేస్తున్నారని ఆగ్రహించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ (జిఆర్‌ఎపి) అమలు చేయకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్రమైన వ్యాఖ్యలు చేసింది. యాక్షన్ ప్లాన్ కింద కాలుష్య నియంత్రణ చర్యలను అమలు చేయడానికి కొంత తక్షణ అవసరమని ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ కమిషన్‌కు సుప్రీంకోర్టు చెప్పింది. నాలుగో విడత ఎలాంటి ఆదేశాలు అడగకుండా తొలగించొద్దని కఠినమైన ఆదేశాలిచ్చింది. గాలి నాణ్యత సూచీ (ఏక్యూఐ) 300 కంటే ఎక్కువ పెరిగిపోతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. గ్రేడెడ్ రెస్పాన్స్ యాక్షన్ ప్లాన్ స్టేజ్-4ను తప్పనిసరిగా అమలు చేయాలని ఎన్‌సిఆర్ రాష్ట్రాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. మూడు రోజులు ఆలస్యం ఎందుకైందని అడిగింది. ఆంక్షలను పర్యవేక్షించేందుకు తక్షణమే టీమ్‌లను ఏర్పాటు చేయాలని, జిఆర్‌పిలో పేర్కొన్న చర్యలపై తక్షణమే నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. తదుపరి విచారణ వరకు నివారణ చర్యలను కోర్టుకు సమర్పించాలని చెప్పింది. నిబంధనలు ఉల్లంఘనలపై ఫిర్యాదులను పరిష్కరించేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేయాలని ఆదేశించింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 450 కంటే తక్కువకు పడిపోయినప్పటికీ.. కోర్టు తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు యాక్షన్ ప్లాన్ అమలు కొనసాగుతుందని స్పష్టం చేసింది.

హసీనాను అప్పగించాలని భారత్‌ను కోరతాం

- బంగ్లా ప్రభుత్వ నేత యూనస్

ఢాకా : పదవీచ్యుతురాలైన బంగ్లా ప్రధాని షేక్ హసీనాను అప్పగించాలని భారత్‌ను తమ ప్రభుత్వం కోరుతుందని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత, నోబెల్ శాంతి బహుమతి గ్రహీత మహ్మద్ యూనస్ చెప్పారు. ఈ ఏడాది ఆగస్టులో దేశంలో తిరుగుబాటు జరగడంతో భారత్ వెళ్ళిన ఆమె అప్పటి నుండి అక్కడే వున్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వంద రోజుల పూర్తయిన సందర్భంగా యూనస్ దేశ ప్రజలనుద్దేశించి టివిలో ప్రసంగించారు. హసీనా 15ఏళ్ల పాలనకు చరమగీతం పలికిన విద్యార్థుల ఆందోళనల్లో వందలాదిమంది మరణించారు. దానికి కారకులైన వారిని పట్టుకునేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. కేవలం మరణాలే కాకుండా ఆమె పాలనా సమయంలో మానవ హక్కుల ఉల్లంఘనలు, అదృశ్యమవడాలు వంటివి కూడా చోటు చేసుకున్నాయన్నారు. వాటన్నింటిపై కూడా దర్యాప్తు చేపడతామన్నారు. ఇందుకోసం హసీనాను అరెస్టు చేసేందుకు ఇంటర్‌పోల్ సాయం కోరతామన్నారు. కొత్తగా ఎన్నికలు నిర్వహించి ఎన్నికైన ప్రభుత్వానికి అధికారాన్ని అప్పగించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అయితే ఇందుకు కాలపరిమితిని ప్రకటించలేదు. ఎన్నికల వ్యవస్థతో సహా వివిధ రంగాల్లో సంస్కరణలు తీసుకురావాలన్నారు. అవి పూర్తయితే అప్పుడు కొత్త ఎన్నికలకు ప్రణాళిక రూపొందుతుందన్నారు.

త్వరలో విడుదల కానున్న లెబనాన్ స్వాతంత్ర్య పోరాట యోధుడు అబ్దుల్లా

పారిస్ : యూరప్‌లో సుదీర్ఘ కాలం రాజకీయ ఖైదీగా వున్న సామ్రాజ్యవాద వ్యతిరేక, పాలస్తీనా అనుకూల లెబనాన్ స్వాతంత్ర పోరాట యోధుడు జార్జెస్ ఇబ్రహీమ్ అబ్దుల్లాను విడుదల చేయాలని ఫ్రెంచ్ కోర్టు ఈ నెల 15న ఆదేశాలు జారీ చేసింది. ఆ మేరకు ఆయన డిసెంబరు 6న విడుదలవుతారు. కోర్టు ఆదేశాలకు అనుగుణంగా అబ్దుల్లా ఫ్రాన్స్ వదిలి వెళ్ళిపోవాలి, మళ్లీ ఎన్నడూ తిరిగి రాకూడదు. కాగా ఈ విడుదల ఆదేశాలు తాము సాధించిన న్యాయపరమైన, రాజకీయ విజయంగా అబ్దుల్లా తరపు న్యాయవాది జేన్ లూయిస్ చాలన్‌సెట్ వ్యాఖ్యానించారు. ప్రపంచవ్యాప్తంగా వామపక్ష కార్యకర్తలు, న్యాయవాదులు, మానవ హక్కుల సంఘాలు ఈ నిర్ణయం కోసం చాలా కాలంగా ఎదురుచూస్తున్నారు. కాగా, అబ్దుల్లా విడుదలను తాము అప్పీల్ చేయనున్నట్లు ఫ్రెంచ్ యాంటీ టెర్రరిజం ప్రాసిక్యూటర్ ప్రకటించారు. ప్రతిఘటనకు నిలువెత్తు రూపంగా అబ్దుల్లాను ఆయన మద్దతుదారులు చూస్తారు. ఫ్రాన్స్, ఇజ్రాయిల్, అమెరికాల నుండి తీవ్రంగా ఒత్తిళ్లు ఎదురైనా లొంగిపోవడాన్ని ఆయన ఎన్నడూ అంగీకరించలేదు. 1999లో కనీస యావజ్జీవ శిక్షనుపూర్తి చేసుకున్నా ఆయనను విడుదల చేయడానికి కోర్టు అంగీకరించలేదు. పెరోల్ కోసం పెట్టుకున్న విజ్ఞప్తులను కూడా తోసిపుచ్చింది. ఫ్రాన్స్ నుండి వెళ్ళిపోయే పక్షంలో విడుదల చేస్తామని చెప్పింది. ఆ మేరకు ఆదేశాలు వెలువడ్డాయి.

అన్యమత ఉద్యోగులకు విఆర్ఎస్

(మొదటి పేజీ తరువాయి)

తెలిపారు. తద్వారా రెగ్యులర్ ఉద్యోగులకు రూ.15,400, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రూ.7,535 చొప్పున అందుతుందని చెప్పారు. శారదా పీఠానికి ఇచ్చిన స్థలాన్ని రద్దు చేసి టిటిడి స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. టూరిజం టికెట్ల కేటాయింపులో భారీ స్థాయిలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణల నేపథ్యంలో తాత్కాలికంగా ఈ విధానాన్ని రద్దు చేస్తున్నట్లు చెప్పారు. విచారణ అనంతరం దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అన్నదాన కేంద్రంలో రెండు లక్షల మందికి అన్నప్రసాదం వితరణ చేస్తామని చెప్పారు. నూతన పరికరాలు అమర్చి, ఆధునీకరణకు టివిఎస్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నామని తెలిపారు. విలేకర్ల సమావేశంలో టిటిడి ఇఒ శ్యామలరావు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌తో వైద్య విద్యార్థి మృతి!

గాంధీనగర్ : ర్యాగింగ్ పేరుతో సీనియర్ల వేధింపులకు ఓ వైద్య విద్యార్థి బలైన ఘటన గుజరాత్‌లో జరిగింది. శనివారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పటాన్ జిల్లాలోని ధార్పూర్‌లోని జిఎంఇఆర్ఎస్ మెడికల్ కాలేజీ, ఆస్పత్రికి చెందిన హాస్టల్‌లో ఈ ఘటన జరిగింది. సహ విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగా హాస్టల్‌కు వచ్చిన అనిల్ మెథానియా (18) తనని తాను పరిచయం చేసుకున్నాడు. అనంతరం ర్యాగింగ్ పేరుతో మూడు గంటల పాటు కదలకుండా నిలబడాల్సిందిగా సీనియర్లు ఆదేశించారు. కొంతసేపు తర్వాత అనిల్ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని ఆస్పత్రికి తరలించారు. చికిత్స అందిస్తుండగా మరణించినట్లు వైద్యులు తెలిపారు. యాంటీ ర్యాగింగ్ బృందం ఈ ఘటనపై విచారణ చేపట్టిందని, సీనియర్లు వేధించినట్లు తేలితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆస్పత్రి డీన్ డాక్టర్ హార్దిక్ షా తెలిపారు. విద్యార్థి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పంపామని అన్నారు. అయితే ప్రమాదవశాత్తు మృతిగా కేసు నమోదు చేసినట్లు బలిసానా పోలీస్‌స్టేషన్‌కి చెందిన సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

జూనియర్ విద్యార్థులను సుమారు మూడు గంటల పాటు నిల్చుని ఒక్కొక్కరిగా తమను తాము పరిచయం చేసుకోవాలని ఎనిమిది మంది సీనియర్ విద్యార్థుల బృందం వేధింపులకు గురిచేసినట్లు ఎంబిబిఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న మరో విద్యార్థి తెలిపారు. అనిల్ స్పృహతప్పి పడిపోయినట్లు తన మామయ్య నుండి ఫోన్ వచ్చిందని, ఆస్పత్రికి చేరుకునేసరికి చనిపోయినట్లు వైద్యులు తెలిపారని అనిల్ సోదరుడు ధర్మేంద్ర మెథానియా పేర్కొన్నారు.

ధర్నాలతో దద్దరిల్లిన కలెక్టరేట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.6 లక్షలు బీమా చెల్లిస్తామని, రికార్డులు, నాణ్యమైన ఫోన్లు, 4జి సిమ్‌లు ఇస్తామని రాతపూర్వకంగా గత ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. వీటిని అమలు చేయాల్సిన బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఉందన్నారు. ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నాలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె.పోశమ్మ మాట్లాడుతూ గత ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందాలపై జిఒలు ఇవ్వాలని ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాన్ని అడుగుతుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ అధికారులే యూనియన్‌తో చర్చలు జరిపి మినిట్స్ కాపీ ఇచ్చారని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలానే ఈ ప్రభుత్వం కూడా డబ్బుల్లేవని చేతులెత్తేయడం తగదన్నారు. అనంతపురం కలెక్టరేట్ వద్ద ఆశాల ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికీ, ప్రజలకూ మధ్య అనుసంధానంగా ఉంటూ అనేక సేవలందిస్తోన్న ఆశా వర్కర్ల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదన్నారు. ఎఎన్ఎం, హెల్త్ సెక్రటరీల భర్తీలో అర్హులైన ఆశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, వెయ్యి నుంచి 1500 జనాభాకు ఒక ఆశా వర్కర్‌ను నియమించాలని, ఎన్‌సిడిసి సర్వేను ఆశాలతో చేయించరాదని డిమాండ్ చేశారు.

అమలాపురం కలెక్టరేట్ వద్ద ధర్నాకు కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కారెం వెంకటేశ్వరావు హాజరై మద్దతు తెలిపారు. ఆశాల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఒంగోలు, బాపట్ల, చిత్తూరు, కాకినాడ, రాజమహేంద్రవరం, గుంటూరు, నరసరావుపేట, పుట్టపర్తి, రాయచోటి, నంద్యాల, కర్నూలు, నెల్లూరు, శ్రీకాకుళం, అనకాపల్లి కలెక్టరేట్ల వద్ద, విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం ధర్నా, అల్లూరి జిల్లా రంపచోడవరం, చింతూరుల్లో ఐటిడిఎల వద్ద ఆశాలు ధర్నా చేశారు. తిరుపతిలో జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ఉద్యోగులను విస్మరించారు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ప్రభుత్వాలు నిధులు పెంచకుండానే మధ్యాహ్న భోజన పథకాలకు మెనూ మార్చడం ఎంత వరకు సరైనదని ప్రశ్నించారు. అనేక రంగాల్లో లక్షలాది మంది అసంఘిటిత రంగ కార్మికులకు సంక్షేమబోర్డులు లేక సంక్షేమపథకాలు అమలవ్వడం లేదన్నారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులోని రూ.1400 కోట్ల నిధులు గత ప్రభుత్వం ఇతర ఖాతాలకు మళ్లించిందని, వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఈ బడ్జెట్‌లో వారి సంక్షేమ బోర్డులోని నిధులు తిరిగి జమ చేస్తారో లేదో చెప్పలేదన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ కొంత మేరకు జరిగిందని, మిగిలిన ఉద్యోగుల రెగ్యులర్ చేయడాన్ని కొనసాగించడాన్ని ప్రస్తావించలేదన్నారు

ఆదివాసీలకు 2.57 శాతమే...

జనాభా ప్రాతిపదికన పరిశీలిస్తే బడ్జెట్‌లో ఆదివాసీలకు 6.59 శాతం నిధులు కేటాయించాల్సి ఉండగా 2.57 శాతం, 17 శాతం వున్న దళితులకు 6.28 శాతం నిధులు కేటాయించారరన్నారు. దళితులకు గతంకన్నా బడ్జెట్‌లో రూ. 1507 కోట్లు కోత పెట్టారన్నారు. విద్యారంగానికి 9.8 శాతం కేటాయించారని, ఈ ఏడాది డిఎస్‌సి ప్రకటించ లేదని, ఉపాధ్యాయ ఖాళీల్లో ఎకడమిక్ ఇన్‌స్ట్రక్టర్‌ను నియమించడంపైన శ్రద్ధ చూపలేదన్నారు. టీచర్ పోస్టులను భర్తీ చేయకుండా ప్రభుత్వాలు బడ్జెట్‌ను మిగుల్చు కుంటున్నాయని చెప్పారు. చేనేత, కల్లుగీత కార్మికులు సంక్షేమం, పోలవరం నిర్వాసితుల పునరావాసం తదితర అంశాలను బడ్జెట్‌లో చూపలేదన్నారు. విభజన చట్టంలో భాగంగా కేంద్రం నిర్మించాల్సిన గిరిజన యూనివర్శిటీకి నిధులు రాబట్టడంపై ప్రస్తావించలేదన్నారు. విశాఖ ఉక్కుఫ్యాక్టరీ కొనసాగింపుపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో చెప్పలేదన్నారు.

ఉచిత విద్య, వైద్యం, ప్రజాపంపిణీ, ఉపాధి, వ్యవసాయం, రోడ్లు ప్రతిదీ వ్యవస్థీకృతంగా మెరుగుపరచడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ హయాంలో ఉద్యోగులకు అన్యాయం జరిగిందని చెప్పగా తాము బాగానే చేశామని వైసిపి సభ్యులు వ్యాఖ్యానించారు. దీనికి స్పందించిన వెంకటేశ్వరరావు అప్పటి ప్రభుత్వంలో ఎలాంటి అన్యాయం జరిగిందో లెక్కలతో సహా చెబుతానని అనడంతో వైసిసి సభ్యులు కూర్చుండిపోయారు.

మీకోసం

ఫ్లాస్క్‌లో టీ మరకలు పోవాలంటే, మూడు వంతుల గోరువెచ్చని నీళ్లు, ఒక వంతు బేకింగ్ సోడా వేసి ఫ్లాస్క్‌ను కడగాలి.

జీవన సౌరభం

కుటుంబం కోసం త్యాగం చేసే మహిళలు వెనకపడినట్లు కాదు. మనం ముందు నడవడం కోసం వారు వెనుక నడుస్తారు.

కథ చెప్పడానికి వెళ్ళాను

హాయ్ ఫ్రెండ్స్, నా పేరు కృష్ణ విరాట్, నేను ఇటీవల ఓ కథల పోటీకి వెళ్లాను. విజయవాడలోని సర్వోత్తమ గ్రంథాలయంలో ఆ పోటీ జరిగింది. వెళ్లేటప్పుడు ట్రాఫిక్‌లో చాలా సేపు ఉన్నాము. ట్రాఫిక్ విడిచిపెట్టగానే నాకు చాలా సంతోషమేసింది. దారిలో వెళుతున్నప్పుడు గాంధీజీ, నేతాజీ, సరోజినీ నాయుడు లాంటి దేశ నాయకుల బొమ్మలు కనిపించాయి. పది నిమిషాల తర్వాత గ్రంథాలయానికి చేరుకున్నాము. అక్కడ కాసేపు ఆడుకున్నాము. చాలా పుస్తకాలు చూసాము. రెండు గంటలు ఎదురు చూసిన తర్వాత మాకు అవకాశం వచ్చింది. అందరూ వారి కథలు ఎలా చెబుతున్నారో గమనించాను. నా అవకాశం వచ్చినప్పుడు నేను కూడా కథను చెప్పాను. ఈ అనుభవం నాకు భలే అనిపించింది. అంతమంది ముందు ధైర్యంగా మాట్లాడడం నాకు చాలా బాగా అనిపించింది. మళ్ళీ తిరిగి వచ్చేటప్పుడు ట్రాఫిక్ గోల లేదు. భోజనం సమయానికి నేను నా స్కూలుకి తిరిగి చేరుకున్నాను.

ఎమ్.కృష్ణ విరాట్,
4వ తరగతి,
అరవింద హై స్కూల్,
గుంటూరు జిల్లా .

బాలలం

బాలలం బాలలం
భావి భారత పౌరులం
నవ్వులు చిందే పువ్వులం
అల్లరిలో సిసింద్రీలం

బాలలం బాలలం
అమ్మ నాన్న చాటు బిడ్డలం
పెద్దలందరినీ గౌరవిస్తాం
అమ్మ పనులకు తోడవుతాం

బాలలం బాలలం
బుద్ధిగా బడికి వెళ్ళిపోతాం
అక్షరాలు చక చక చదివేస్తాం
గురువులు చెప్పింది ఆచరిస్తాం

బాలలం బాలలం
ఆటలు బాగా ఆడేస్తాం
బొమ్మలు భలే గీసేస్తాం
అందరికీ ఆదర్శంగా నిలుస్తాం.

– చింతా రాంబాబు,
కాట్రేనికోన,
99481 78092.

నేను గీసిన బొమ్మ

ఎం.డి అఫీఫా,
10వ తరగతి,
జెడ్పిహెచ్ఎస్, కోదాడ,
సూర్యాపేట.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

బామ్మ డ్రెస్సు.. అదిరే.. అదిరే..

జాంబియా చాలా చిన్న దేశం.. పేద దేశం.. అక్కడే 80 ఏళ్ల మార్గరేట్ చోళా నివసిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఉంటున్న ప్రాంతం ఈ ప్రపంచానికి అస్సలు తెలియదు.. కానీ ఇప్పుడు.. పరిస్థితి మారిపోయింది. గ్రామీణ సంస్కృతిని ప్రతిబింబిస్తూ, అందమైన డ్రస్సులతో, ఆకర్షణీయమైన ఆభరణాలతో రకరకాల ఫోజులు ఇస్తూ మార్గరేట్ దిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్‌మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. మార్గరేట్‌ని ఇన్‌స్టాగ్రామ్‌లో అనుసరిస్తున్నవారు 59 వేలకు పైగానే ఉన్నారంటే బామ్మ ఫాలోయింగ్ ఏంటో అర్థం చేసుకోవచ్చు.

పచ్చని పొలం మధ్యలో చెక్క కుర్చీలో స్టైల్‌గా కూర్చొంది మార్గరెట్ బామ్మ. పొరలుపొరలుగా కుట్టిన అందమైన గౌనులో తళుక్కున మెరిసిపోతున్న నగలు వేసుకున్న ఆ స్టైల్‌ని చూడకుండా కన్ను తిప్పుకోలేం. జాంబియా గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్న ఈ బామ్మ స్టైలిష్ ఫొటోల్లో ఆమె వేసుకున్న డ్రెస్సు, నగలు మాత్రమే కనిపించవు.. అంతకుమించి బామ్మ దృఢమైన మనస్సు కనిపిస్తుంది. ఎక్కడా తొణకక, బెణకక చూసే చూపులో ఎన్నో భావాలు కనిపిస్తాయి.

బామ్మని ఇంతలా సెన్సేషనల్ చేసింది ఆమె మనవరాలు కౌంబా. న్యూయార్క్‌కి చెందిన దయానా కౌంబా ఓ స్టైలిష్. ఫ్యాషన్ డిజైనర్ అయిన తండ్రి వారసత్వాన్ని పుణికిపుచ్చుకున్న కౌంబా తండ్రి కలలు నెరవేర్చేందుకు ఫ్యాషన్ రంగాన్ని కెరీర్‌గా ఎంచుకుంది.

2023లో తండ్రి వర్ధంతిని నిర్వహించేందుకు న్యూయార్క్ నుండి కౌంబా, జాంబియాకి వచ్చింది. అప్పుడే తనకి ఓ ఆలోచన వచ్చింది. రకరకాల దుస్తులు వేసిన బామ్మ ఫొటోలని సరదాగా ఇన్‌స్టాలో పెట్టాలనుకుంది. ఆ మాటే బామ్మకి చెప్పింది. మనవరాలు చెప్పంగానే చోళా ఒప్పుకుంది. 'నేను ఎంతకాలం ఉంటానో తెలియదు. వీళ్ల ఎంతకాలం గుర్తుంచుకుంటారో అసలు తెలియదు. ఇలా మారితే అయినా ఎక్కువకాలం గుర్తుంటానేమో అనుకున్నాను. అందుకే ఒప్పుకున్నాను' అంటున్న చోళా వెండిరంగు ప్యాంటు, సూటు వేసుకుని మొదటి ఫొటోకి ఫోజు ఇచ్చింది.

అందమైన దుస్తులు, రకరకాల ఫోజులతో మొదలైన ఈ ఫొటోషూట్లు, రానురాను జాంబియా గ్రామీణ సంస్కృతి, సాంప్రదాయాలకు పెద్దపీట వేయడం మొదలుపెట్టాయి. గ్రామాల్లో తరచూ ఉపయోగించే వస్తువులను పట్టుకుని, స్టైలిష్ దుస్తులు వేసుకుని బామ్మ ఇచ్చే ఫోజులకు ఇన్‌స్టాలో వేలల్లో లైక్‌లు వస్తున్నాయి.

బామ్మ ఇన్‌స్టా పేజీల్లో ఆమెని అనుసరించే వారంతా జాంబియా గ్రామీణ సంస్కృతిపై కూడా ఆసక్తి పెంచుకుంటున్నారు. ఈ విషయంపైన కౌంబా మాట్లాడుతూ.. 'ఈ ఫొటోషూట్లల్లో బామ్మ కాలంనాటి ఎన్నో విషయాలను చూపించాలనుకుంటున్నాను. ఇలా చేయడం వల్ల తరువాతి తరాల వారు, వారి మూలాలను మర్చిపోకుండా ఉంటారు' అని ఆశాభావం వ్యక్తం చేస్తోంది. దీని వెనుక కారణం ఏదైనా బామ్మ డ్రెస్సులు, ఫోజులు మాత్రం అదిరే.. అదిరే..

వందనాలు తల్లీ..

ఓ అమ్మ.. చదువుకుంది. ఉద్యోగం చేయాలనుకుంది. బిడ్డతో పాటు వస్తానంటే ఎవరూ ఒప్పుకోలేదు. ఎక్కడా ఉద్యోగం ఇవ్వలేదు. అలాగని ఇంట్లో కూర్చొనే పరిస్థితి కాదు. అందుకే తనతో బిడ్డ ఉన్నా పరవాలేదనిపించే డెలివరీ గాళ్ ఉపాధిని ఎంచుకుంది. ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేయడం కోసం ఓ బైక్ తీసుకుంది. ఇప్పుడు ఎంచక్కా బిడ్డను బండిపై ఎక్కించుకుని, డెలివరీ బ్యాగు వీపుకి తగిలించుకుని ఇంటింటికీ తిరుగుతూ డెలివరీ చేస్తోంది. ఇలా వెళ్తున్నప్పుడే ఓ యూట్యూబర్ ఆమెతో మాట్లాడాడు. ఆ వీడియోని సోషల్ మీడియాలో షేర్ చేశాడు.

గుజరాత్ రాజ్‌కోట్‌కి చెందిన ఈ మహిళ డెలివరీ గాళ్‌గా మారి నెలరోజులే అవుతోంది. 'నేను హోటల్ మేనేజ్‌మెంట్ చేశాను. పెళ్లి తరువాత ఉద్యోగం చేయాలనుకున్నాను. అయితే నా రెండేళ్ల పిల్లాడు ఉద్యోగానికి అడ్డం అని అందరూ బయటకి పంపేశారు. వాడిని ఇంటి దగ్గర వదిలే పరిస్థితి లేదు. నాతో పాటే నా బిడ్డ కూడా ఉండాలి. ఎలా? ఈ ప్రశ్న వేసుకున్నప్పుడే డెలివరీ ఉద్యోగం గుర్తుకువచ్చింది. అది రావాలంటే బైక్ తప్పనిసరి. వెంటనే బైక్ కొనుక్కున్నాను. బిడ్డను వెంట తీసుకెళ్తానే డెలివరీ చేస్తాను అన్నాను. అభ్యంతరం చెప్పలేదు. ఎంత సంతోషమేసిందో.. ఇప్పుడు ఎంచక్కా వాడిని నా ముందు కూర్చోబెట్టుకుని డెలివరీలు చేస్తున్నాను' అని చెబుతున్నప్పుడు ఆమె కళ్లల్లో ఎంత ఆనందం కనిపించిందో.. ఆ సంతోషం ఉద్యోగం దొరికినందుకు కాదు. అంతకంటే ముఖ్యంగా తనతో తన బిడ్డను కూడా వెంటతీసుకెళ్తున్నందుకు.

మన చుట్టూ ఎందరో అమ్మలు, బిడ్డలను ఇళ్ల దగ్గరే వదిలి ఉద్యోగాలు కోసం వెళ్తుంటారు. శరీరం పనిచేసే చోట ఉన్నా, మనసు మాత్రం ఇంటి దగ్గర బిడ్డ చుట్టూనే తిరుగుతుంటుంది. ఎంతో మానసిక క్షోభను అనుభవిస్తుంటారు. ఆ తల్లులందరికీ ఈ అమ్మ గొప్ప స్ఫూర్తిగా నిలుస్తోంది.

'పుష్ప అంటే బ్రాండ్' ట్రైలర్‌లో ఆసక్తికర డైలాగులు

అల్లు అర్జున్ కథానాయకుడిగా సుకుమార్ దర్శకత్వంలో రూపొందించిన యాక్షన్ డ్రామా 'పుష్ప2 : ది రూల్'. రష్మిక కథానాయిక. ట్రైలర్‌ను ఆదివారం బీహార్ రాజధాని పాట్నాలో విడుదల చేశారు. పాట్నా లైవ్ ఈవెంట్‌ను ఏకంగా 2.06 లక్షలమంది లైవ్‌లో వీక్షించారు. ఇప్పటివరకు ఏ భారతీయ సినిమా ఈ రికార్డును సాధించలేదు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను పుష్ప టీమ్ ట్విట్టర్‌లో పంచుకుంది. ట్రైలర్ ప్రారంభంకాగానే ఏనుగు ఘీంకారంతో మొదలు పెట్టారు. కదనరంగంలోకి దూకుతున్నప్పుడో.. వైరి వర్గాల్లో భయం పుట్టించడానికో ఏనుగులు ఘీంకరిస్తాయని అంటారు. అంటే 'పుష్పరాజ్'ను మదపుటేనుగులా పోలుస్తూ ఆ ప్రపంచంలో జరగబోయే యుద్ధానికి సిద్ధమవుతున్నట్లు ఏనుగు ఘీంకారాన్ని రెఫరెన్స్‌ను పెట్టినట్లుగా అనిపించింది. ఆ వెంటనే కోగటం వీర ప్రతాప్‌రెడ్డి పాత్రలో జగపతిబాబును పరిచయం చేసి అతడితోనే 'పుష్ప' క్యారెక్టర్ ఎలా ఉండబోతోందో చెప్పించారు. 'డబ్బు అంటే లెక్కలేదు...పవర్ అంటే భయం లేదు..వీడిలో తెలియని బాధ ఏదో ఉంది' అని డైలాగ్ ఆసక్తిగా సాగుతుంది. పుష్ప–1లోని కొన్ని సన్నివేశాలను కట్స్‌రూపంలో చూపించి నేరుగా అడవిలో పుష్ప డెన్‌ను చూపించారు. అక్కడి నుంచి అల్లు అర్జున్ పాత్ర కనబడే ప్రతి సీన్ హైలో ఉంటుంది. 'పుష్ప అంటే పేరుకాదు పుష్ప అంటే బ్రాండ్' అంటూ హెలికాప్టర్ లో నుంచి దిగుతున్న అల్లు అర్జున్ షాట్స్ వస్తాయి. అంటే సాధారణ కూలీగా జీవితాన్ని మొదలు పెట్టిన పుష్ప ఆ తర్వాత హెలికాప్టర్ వాడే స్థాయికి ఎదిగిన వైనాన్ని ఆయా సన్నివేశాల్లో చూపించారు. 'శ్రీవల్లి నా పెళ్లాం..పెళ్లాం మాట మొగుడు వింటే ఎట్టా ఉంటాదో పపంచానికి చూపిస్తా' అంటూ శ్రీవల్లి కాలితో తన గడ్డాన్ని నిమిరే షాట్ చూపిస్తారు. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ పాత్రను ఎలాగైతే హైనోట్‌తో పరిచయం చేశారో అలాగే ప్రతినాయకుడు భన్వర్‌సింగ్ షెఖావత్ ఫహద్ ఫాజిల్‌ను చూపించారు. సుకుమార్–అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన 'పుష్ప' పార్ట్–1 బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. 2021లో విడుదలైన ఈ చిత్రం పలు రికార్డులు నమోదుచేసింది. పుష్ప–2 ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.

జనవరి 17న 'ఎమర్జెన్సీ' విడుదల



బాలీవుడ్ హీరోయిన్ కంగనారనౌత్ నటించి దర్శకత్వం వహించిన చిత్రం 'ఎమర్జెన్సీ'. వాస్తవంగా గతేడాదే ఈ సినిమా విడుదల కావాల్సివుంది. వివాదాల్లో చిక్కుకోవటంతో సెన్సార్ సూచనల మేరకు కొన్ని సీన్లు కట్ చేయాల్సి రావటంతో ఈ సినిమా విడుదల వాయిదా పడింది. చిత్రంలోని కొన్ని సన్నివేశాలపై సిక్కులు అభ్యంతరాలు వ్యక్తంచేయటంతో సెన్సార్ కట్స్ అనంతరం ఈ చిత్రం విడుదలవుతోంది. జనవరి 17న ఈ సినిమాను థియేటర్లలో విడుదల చేయబోతున్నామని కంగనారనౌత్ ప్రకటించారు. ఈమేరకు ఓ పోస్టర్‌ను కూడా విడుదల చేశారు.

హీరోల్లో ఎవరి స్టైల్ వారిదే...

'హీరోలది ఒక్కొక్కరిది సపరేట్ స్టైల్. మహేష్‌బాబు క్రమశిక్షణగా ఉంటారు. కోలీవుడ్ హీరో విజయ్ ఎప్పుడూ ఒకేలా ఉంటారు. దుల్కర్ సల్మాన్‌లో వినయం అంటే నాకు ఎంతో ఇష్టం. వరుణ్‌తేజ్‌ది పూర్తిగా జెంటిల్‌మ్యాన్ నేచర్. ఇక విశ్వక్‌సేన్ ఎప్పుడూ సరదాగా ఉంటారు. ఎనర్జిటిక్‌గా ఉంటూ సెట్‌లో సందడి క్రియేట్ చేస్తుంటారు' అని టాలీవుడ్ హీరోయిన్ మీనాక్షిచౌదరి అన్నారు. విశ్వక్‌సేన్ హీరోగా మీనాక్షిచౌదరి, శ్రద్ధాకపూర్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈనెల 22న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుక హైదరాబాద్‌లో జరిగింది. మీనాక్షిచౌదరి కొందరు హీరోల గురించి మాట్లాడారు. శ్రద్ధా శ్రీనాథ్ మాట్లాడుతూ 'గతంలో విశ్వక్‌సేన్ నటించిన 'ఫలక్‌నుమాదాస్'ను రిజెక్ట్ చేశా.ఈ కథ నాకు నచ్చలేదు. నటీనటులు సినిమాలను ఎంపిక చేసుకునే క్రమంలో అలా తిరస్కరించటం సహజం. కానీ అప్పటి నుంచి మంచి స్క్రిప్ట్ ఉంటే విశ్వక్‌తో నటించే అవకాశం కోసం ఎదురుచూశాను. మెకానిక్ రాకీలో నటించా. ఈ సినిమా కచ్చితంగా హిట్టవుతుంది' అని అన్నారు. ఈ సినిమాకు రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహించారు. రామ్ తాళ్లూరి నిర్మించారు. సునీల్, నరేశ్ వికె తదితరులు ముఖ్యపాత్రలు పోషించారు.

లక్ష్మణ్ మురారికి మైటా శతాబ్ది అవార్డు

'బందూక్' చిత్ర దర్శకుడు లక్ష్మణ్ మురారి ఆలోచనలో మెదిలిన 'తెలంగాణ బ్రీత్ లెస్ సాంగ్'కు అరుదైన గౌరవం లభించింది. గేయ రచయిత గోరేటి వెంకన్న, మ్యూజిక్ డైరెక్టర్ కార్తీక్, గాయకుడు సాకేత్ కోమండురి కలిసి 'పూసిన పున్నమి వెన్నెల మేన (తెలంగాణా బ్రీత్ లెస్ సాంగ్) పాటకు పదేళ్ల తర్వాత మలేషియాలో ప్రతిష్టాత్మక వేదికపై అరుదైన గౌరవం దక్కింది. మలేషియా ప్రధానమంత్రి కార్యాలయ సభ్యులు, తెలంగాణా రాజకీయ ప్రముఖులు, చీఫ్ జస్టిస్‌లు, రచయితలు, మేధావులు, సినీనటులు, సామాజిక వేత్తలు పాల్గొన్న కార్యక్రమంలో మలేషియా ప్రెసిడెంట్ సెక్రటరీ దాటో రోమ్లి ఇషాక్ చేతుల మీదుగా దర్శకుడు లక్ష్మణ్ మురారీ ఈ అవార్డును అందుకున్నారు.

భారత్-మలేషియా ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా

హైదరాబాద్: భారత్–మలేషియా జట్ల మధ్య గచ్చిబౌలి జిఎంసి బాలయోగి స్టేడియంలో జరిగిన అంతర్జాతీయ స్నేహపూర్వక ఫుట్‌బాల్ మ్యాచ్ డ్రా అయ్యింది. ఇరుజట్లు తొలి అర్ధభాగంలో ఒక్కో గోల్ కొట్టాయి. తొలి గోల్‌ను మలేషియా ఆటగాడు పాలో జోసుయే(19వ ని.)లో చేయగా.. భారత్ తరఫున 39వ ని.లో రాహుల్ భేకే ఒక గోల్ కొట్టి సమం చేశాడు. ఆ తర్వాత ఇరుజట్లు డిఫెన్స్‌కే ప్రాధాన్యతనిచ్చాయి. సోమవాం జరిగిన ఈ మ్యాచ్‌ను వీక్షించేందుకు భారీసంఖ్యలో ప్రేక్షకులు హాజరయ్యారు. ఈ ఏడాది ఇంటర్ కాంటినెంటల్ టోర్నీకి ఆతిథ్యమిచ్చిన హైదరాబాద్.. నేడు మరో అంతర్జాతీయ మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చింది. 1957నుంచి భారత్–మలేషియా జట్లు ఇప్పటివరకు 33సార్లు తలపడ్డాయి. చివరిసారిగా 2023లో ఇరుజట్లు మెర్డెకా టోర్నమెంట్ సెమీఫైనల్లో తలపడ్డాయి. భారత్ జట్టు ప్రధాన కోచ్ మనోలో మార్క్వెజ్‌కు ఇది నాల్గో అంతర్జాతీయ మ్యాచ్ కాగా.. ఇప్పటివరకు భారత్ ఒక్క మ్యాచ్‌లోనూ విజయం సాధించలేకపోయింది. మలేషియా జట్టు జులైలో పౌ మార్టిని నియమించింది. 2024 ఏడాదిలో భారత్ ఆడిన మ్యాచుల్లో ఒక్క విజయాన్ని నమోదు చేసుకోలేకపోయింది. తొలుత మారిషస్‌తో 0–0తో డ్రా చేసుకుంది. ఆ తర్వాత ఇంటర్ కాంటినెంటల్ కప్‌లో 0–3గోల్స్‌తో సిరియా చేతిలో ఓడింది. చివరి ఫ్రెండ్లీ మ్యాచ్ వియత్నాంతోనూ 1–1తో డ్రా చేసుకొని సంతృప్తి పడింది. ఈ ఏడాదిలో జరిగిన చివరి అంతర్జాతీ స్నేహపూర్వక మ్యాచ్ మలేషియాతోనూ డ్రాతో సరిపుచ్చుకుంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారత్ 125వ, మలేషియా 133వ ర్యాంకుల్లో ఉన్నాయి.

ఆసీస్ క్లీన్‌స్వీప్

మూడో టి20లోనూ పాకిస్తాన్‌పై ఘన విజయం

హోబర్ట్: పాకిస్తాన్ చేతిలో వన్డే సిరీస్ వైట్‌వాష్‌కు గురైన ఆతిథ్య ఆస్ట్రేలియా జట్టు టి20 సిరీస్‌లో ఆ జట్టుపై క్లీన్‌స్వీప్ చేసింది. మూడో, చివరి టి20లోనూ ఆసీస్ జట్టు ఘన విజయం సాధించి మూడు టి20ల సిరీస్‌ను 3–0తో చేజిక్కించుకుంది. సోమవారం హోబర్ట్ వేదికగా జరిగిన ఆఖరి టి20లో తొలుత పాక్ బ్యాటర్లును కట్టడి చేయడంతో 117 పరుగులకే ఆలౌటయ్యింది. స్వల్ప లక్ష్యాన్ని ఆసీస్ జట్టు 11.2ఓవర్లలో మూడు వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఆల్‌రౌండర్ మార్కస్ స్టొయినిస్(61నాటౌట్) అర్ధ సెంచరీతో రాణించాడు. తొలి రెండు టీ20ల్లో చివరిదాకా పోరాడినా పాక్ బ్యాటర్లు మూడో మ్యాచ్‌లో చేతులెత్తేశారు. అరోన్ హర్డీ(3/21), ఆడం జంపా(2/11), పేసర్ స్పెన్సర్ జాన్సన్(2/24)ల ధాటికి పాక్ బ్యాటర్లు డగౌట్‌కు క్యూ కట్టారు. మాజీ కెప్టెన్ బాబర్ ఆజాం(41), వికెట్ కీపర్ హసీబుల్లా ఖాన్(24)లు మాత్రమే కాసేపు పోరాడారు. దీంతో పాక్ జట్టు 18.1ఓవర్లలో 117 పరుగులకే కుప్పకూలింది. అనంతరం స్వల్ప ఛేదనలో ఆసీస్ 16 పరుగుల వద్ద తొలి వికెట్ కోల్పోయింది. మాథ్యూ షార్ట్(2) ఔటయ్యాడు. మెక్‌గుర్క్(18), కెప్టెన్ జోష్ ఇంగ్లిస్(27) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. మార్కస్ స్టొయినిస్ కేవలం 27 బంతుల్లోనే 5 ఫోర్లు, 5 సిక్సర్లు కొట్టాడు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ స్టొయినీస్‌కు, సిరీస్ జాన్సన్‌కు దక్కాయి.

సిన్నర్‌కు ఎటిపి టైటిల్

టాప్ ర్యాంక్‌తో సీజన్‌ను ముగించిన ఇటలీ ఆటగాడు

న్యూయార్క్: ఎటిపి ఫైనల్స్ పురుషుల సింగిల్స్ టైటిల్‌ను ఇటలీ ఆటగాడు జెన్నిక్ సిన్నర్ చేజిక్కించుకున్నాడు. సోమవారం జరిగిన ఫైనల్లో టాప్‌సీడ్ సిన్నర్ 6–4, 6–4తో వరుససెట్లలో 5వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్(అమెరికా)ను చిత్తుచేశాడు. ఈ మ్యాచ్ సుమారు గంటా 25నిమిషాలసేపే సాగింది. గ్రూప్ దశలోనూ సిన్నర్.. ఫ్రిట్జ్‌ను ఓడించాడు. దీంతో ఈ టైటిల్‌ను నెగ్గిన తొలి ఇటలీ ఆటగాడిగా జెన్నిక్ సిన్నర్ రికార్డుపుటల్లోకెక్కాడు. 1986 ఇవాన్ లెండిల్ తర్వాత ఎటిపి ఫైనల్ టైటిల్‌ను ఒక్క సెట్ కూడా చేజార్చుకోకుండా కైవసం చేసుకున్న మరో ఆటగాడు సిన్నర్ మాత్రమే. గత ఏడాది కూడా సిన్నర్ ఫైనల్‌కు చేరినా.. నొవాక్ జకోవిచ్ చేతిలో ఓటమిపాలయ్యాడు. ఇరువురి మధ్య గెలుపు ఓటముల రికార్డు 4–3గా ఉంది. ఇక 2006 తర్వాత ఓ అమెరికన్ ఎటిపి ఫైనల్‌కు చేరడం కూడా ఇదే తొలిసారి అప్పట్లో జేమ్స్ బ్లాక్ ఎటిపి ఫైనల్‌కు చేరి రన్నరప్‌గా నిలిచాడు. ఈ ఏడాది సిన్నర్ ఆడిన 27మ్యాచుల్లో 26 గేమ్‌లలో విజయం సాధించాడు. అందులో భాగంగా ఎనిమిది టైటిళ్లను చేజిక్కించుకున్నాడు. విజేతగా నిలిచిన సిన్నర్‌కు భారత కరెన్సీలో రూ.41కోట్లు, రన్నరప్ ఫ్రిట్జ్‌కు రూ.20కోట్ల ప్రైజ్‌మనీ దక్కింది.

గెలుపు బాటలో మళ్లీ తెలుగు టైటాన్స్

ప్రొ కబడ్డీ సీజన్–11

లక్నో: ప్రొ కబడ్డీ సీజన్–11లో తెలుగు టైటాన్స్ మళ్లీ గెలుపు బాట పట్టింది. తొలుత మూడు మ్యాచుల్లో ఓడిన టైటాన్స్.. ఆ తర్వాత వరుసగా మూడు మ్యాచుల్లో గెలిచింది. ఆ తర్వాత మ్యాచుల్లో ఓడినా.. మళ్లీ గెలుపుబాట పట్టింది. షహీద్ విజయ్ సింగ్ పాఠక్ స్టేడియంలో హర్యానా స్టీలర్స్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్ 49–27పాయింట్ల తేడాతో ఘన విజయం సాధించింది. టైటాన్స్ రైడర్లు ఆశీశ్ నర్వాల్(11), విజయ్ మాలిక్(8) రాణించగా.. ట్యాకిల్స్‌లో సాగర్, శంకర్ ఐదేసి పాయింట్లతో మెరిసారు. టైటాన్స్ జట్టు ఏకంగా 8సార్లు హర్యానా జట్టును ఆలౌట్ చేసింది. దీంతో 10మ్యాచ్‌లు ముగిసేసరికి టైటాన్స్ జట్టు 3పాయింట్లతో 7వ స్థానానికి ఎగబాకింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68